Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 114 • శుక్రవారం 4 ఆగస్టు 2017 • హైదరాబాద్ ❋ పేజీలు: 10+4 • వెల: 5.00 Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శుద్ధ ద్వాదశి సా. 6.25 వరకు, అనంతరం త్రయోదశి; నక్షత్రం: మూల రా. 9.41 వరకు, అనంతరం పూర్వాషాఢ; అమృతకాలం: మ. 2.25 నుండి 4.10 వరకు; వర్జ్యం: రా. 7.54 నుండి 9.41 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.17 నుండి 9.08 వరకు; మ. 12.32 నుండి 1.23 వరకు; రాహుకాలం: ఉ. 10.30 నుండి 12.00 వరకు; యమగండం: మ. 3.00 నుండి 4.30 వరకు; విశిష్టత: వరలక్ష్మీ వ్రతం



న్యూఢిల్లీ: ప్రధాని మోడీతో సమావేశమైన ఎంపీ కవిత నేతృత్వంలోని ప్రతినిధి బృందం

పసుపు బోర్డు ఏర్పాటు చేయండి

ప్రధాని మోడీతో ఎంపీ కవిత భేటీ • నిజామాబాద్ అనువైన ప్రాంతమంటూ సూచన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: పసుపు బోర్డు ఏర్పాటే లక్ష్యంగా నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఢిల్లీలో పార్లమెంటులోని ప్రధాన మంత్రి కార్యాలయంలో తన నియోజకవర్గ ఎమ్మెల్యేలతో పాటు వెళ్లి కలిసిన కవిత, పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు 10 నెలల పాటు సాగు చేసి పండించే పసుపు పంటకు సరైన ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నదని, పైపెచ్చు పసుపు దిగుమతి చేసుకోవడం వల్ల కూడా దేశంలోని రైతులు మరింతగా నష్టపోవాల్సి వస్తోందని ఎంపీ కవిత ప్రధానికి వివరించారు. ఈ దశలో ఆయన జోక్యం చేసుకుంటూ ''పసుపు దిగుమతి చేసుకుంటున్నామా?'' అంటూ ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. దీంతో మొత్తం దేశీయ ఉత్పత్తి, ఎగుమతులు, దిగమతుల గణాంకాలను కవిత ఆయనకు వివరించి, పసుపు బోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. తన డిమాండ్‌కు మద్దతిస్తూ అసోం, మహారాష్ట్ర, కేరళ ముఖ్యమంత్రులు రాసిన లేఖలను కూడా కవిత ప్రధానికి అందజేశారు. ఎమ్మెల్యేల నుంచి కూడా వివరాలు అడిగి మరీ తెలుసుకున్నారు. 13 రాష్ట్రాల్లో సాగవుతున్న ఈ పంటలో కొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడం కోసం, దిగుబడిని పెంచే పరిశోధనలతో పాటు, సరికొత్త వంగడాలు సృష్టించడం కోసం, పండిన పంటను ప్రాసెస్ చేసి మార్కెట్ చేయడం కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరముందని బృందంలోని

➪ 3వ పేజీలో...

పీయూష్ గోయల్‌తో భేటీ

రూ.314 కోట్ల బకాయిలు ఇవ్వండి

జ్యువల్ ఓరంతో సమావేశం

జగిత్యాలలో ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేయాలని విజ్ఞాపన

3 లో

నరేంద్ర సింగ్ తోమర్‌తోనూ...

అమృత్‌లో జగిత్యాలను ఎంపిక చేయండి

ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్

ఐటీలో టాప్..!



రావిరాల హార్డ్‌వేర్ పార్కులో కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్ పరిశ్రమలో పరికరాలను పరిశీలిస్తున్న కేటీఆర్

సులభతర వాణిజ్యంలో తెలంగాణకు అగ్రస్థానం

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోసం హెలికాప్టర్ క్యాబిన్ ఏరోస్పేస్ ఎస్ఈజడ్‌లోనే తయారీ
- మేక్ ఇన్ తెలంగాణ నినాదానికి స్పందన భేష్
- ప్రపంచ దేశాల నుంచి తరలివస్తున్న పారిశ్రామిక పెట్టుబడుల వెల్లువ
- పరిశ్రమలు, ఐటీ మంత్రి కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నూతన పారిశ్రామిక విధానం కింద మేక్ ఇన్ తెలంగాణ నినాదం బాగా ప్రాచుర్యం పొందడంతో భారీగా పారిశ్రామిక పెట్టుబడులు వస్తున్నాయని ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు చెప్పారు. హైదరాబాద్ రక్షణ, ఏరోస్పేస్ కంపెనీల హబ్‌గా అభివృద్ధి చెందుతోందని, ఇది దేశంలోనే ఎలక్ట్రానిక్ కంపెనీలకు ఆదర్శంగా నిలుస్తోందని ఆయన అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిరాల హార్డ్‌వేర్ పార్కులో నెలకొల్పిన కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీని గురువారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సంస్థను కళ్యాణి గ్రూపు, ఇజ్రాయిల్‌కు చెందిన రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ సంయుక్తంగా నెలకొల్పాయి.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం సులభతర వ్యాపారంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. నూతన పారిశ్రామిక విధానం కింద అనేక రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా టీఎస్-ఐపాస్ ఏర్పాటుచేసి కేవలం 15 రోజుల్లోనే పారిశ్రామిక అనుమతులు ఇస్తున్నామని మంత్రి చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి కల్పించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచే దిశగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో అనేక ఎస్ఈజెడ్‌లు, రంగాల వారీగా పార్కులు, ఇండస్ట్రియల్ హబ్‌లు అభివృద్ధి చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, ఇది రాష్ట్రంలో అత్యాధునిక ఎలక్ట్రానిక్ కంపెనీ స్థాపనకు మరో ముందడుగు నిలుస్తుందని ఆయన అన్నారు.

తెలంగాణ ఐటీ రంగంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుకోనుండగా, ఇప్పుడు ఏరోస్పేస్ రంగంలో ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇప్పటికే ఏరోస్పేస్ ఎస్ఈజెడ్‌లో రక్షణ,

➪ 3వ పేజీలో...

రాజకీయ వేడి రగిల్చిన

కేసీఆర్

పక్కా వ్యూహంతో దాడి

విపక్షాలకు గట్టి షాకిచ్చారని గులాబీ శ్రేణుల సంతోషం

10న పోచంపాడు సభపై సర్వత్రా ఆసక్తి



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కెసిఆర్.. ఆయనకు కోపమొస్తే రాజకీయ భూకంపమే. మాటల తూటాలు వదిలితే..ప్రత్యర్థులు కకావికలమే. అనేక సందర్భాల్లో ఇది రుజువు కాగా.. కెసిఆర్ తాజాగా విపక్షాలపై విరుచుకుపడిన తీరు ప్రతిపక్షాలను ఆత్మరక్షణలో పడేయగా, పార్టీకి మంచి మైలేజీ తెచ్చిందని గులాబీశ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. తనను, పార్టీని ఎన్నయినా తిట్టండి.. కానీ తెలంగాణ ప్రయోజనాలను అడ్డగిస్తే, చిల్లరమల్లర రాజకీయాల కోసం తెలంగాణను చులకన చేస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించనని ప్రకటించే కెసిఆర్ మరోమారు మీడియాసాక్షిగా ప్రభుత్వ పనులకు ఎదురవుతున్న ఆటంకాలను వివరిస్తూ.. విరుచుకుపడిన తీరుపై టిఆర్ఎస్ నేతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తీరుపై ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శల దాడి చేసిన కెసిఆర్.. విద్యుత్ ఉద్యోగుల విలీన ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడిన నేపథ్యంలో సమావేశం నిర్వహించి అడుగడుగునా ప్రభుత్వ చర్యలకు ఎదురవుతున్న ఆటంకాలు, ప్రగతి పరుగుకు వేస్తున్న బంధనాలను సుదీర్ఘంగా ఏకరువుపెట్టారు. ప్రజల్లోకి వెళ్ళి మీ పని పడతా అంటూ హెచ్చరించారు. విపక్షాలు అస్త్రాలన్నీ పోగుచేసుకుని..కాస్త వేడి రగిలించగానే, సిఎం వీటన్నింటినీ ఒక్కదెబ్బతో కనుమరుగుచేయడం గత కొన్నిమాసాలుగా జరుగుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులకు, విపక్షాలకు ఏ చిన్న అవకాశం వదలని కెసిఆర్ 2019 ఎన్నికలే లక్ష్యంగా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతి ఎన్నికనూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని

➪ 3వ పేజీలో...

అగ్నిపూలు

అగ్నిపర్వతం పేలుడు.. ఆపై పిడుగులు... కలగలసిన చిత్రమే ఇది



వివరాలు 2లో...



ఇటు గాంధీలో.. అటు కోఠి మెటర్నిటీ ఆస్పత్రిలో

అమానుషం

అందుబాటులో లేని వైద్యం • నడిరోడ్డుపైనే ప్రసవం

అమ్మలకు ఎన్నాళ్లీ నరకయాతన

3 లో

తెలంగాణ తలమానికమైన గాంధీ ఆసుపత్రి ఆవరణలో ఆటోలోనే ఓ మహిళ పండంటి మగబిడ్డకు జన్మనివ్వగా... కోఠి మెటర్నిటీ ఆసుపత్రి ఆవరణలోనే నడిరోడ్డుపై మరో మహిళ ప్రసవం... శిశువు కన్నుమూత



సీఎం కేసీఆర్‌వి చిల్లర మాటలు

కాంగ్రెస్ నేతల ధ్వజం

ముఖ్యమంత్రికి మానవత్వం లేదు: తెలుగుదేశం

పోరాటాలకు పెట్టింది పేరు కమ్యూనిస్టులు: తమ్మినేని, చాడా

తెరాసది అవకాశవాదం: బీజేపీ

8 లో



కాశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

ఆర్మీ మేజర్‌తో సహా మరో జవాన్ వీరమరణం • ఇద్దరు ముష్కరులు హతం • ముగ్గురు సిపాయిలకు గాయాలు

9 లో

ఔరా..!



యుద్ధం వస్తే.. డ్రాగన్‌కే దెబ్బ

- భారత్‌కు జన నష్టం.. చైనాకు ఆర్థిక నష్టం
- సిల్క్‌రోడ్ నిర్మాణానికి బ్రేక్
- బెల్ట్ ప్రాజెక్టు నిర్వీర్యం
- చైనా ఔషధ పరిశ్రమకు దెబ్బ
- ఎలక్ట్రానిక్స్ మార్కెట్ కుదేలు
- అందుకే యుద్ధానికి చైనా దూరం
- ఉత్తుత్తి బెదరింపులకే పరిమితం



(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ఉడత బెదిరింపులే తప్ప చైనా భారత్‌పై ప్రత్యక్షంగా యుద్ధం చేసే సాహసం చేయదని అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. యుద్ధమంటూ జరిగితే భారత్ కంటే చైనాకే తీవ్రస్థాయిలో నష్టాలు తప్పవని కూడా గురువారంనాటి వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. ఇదొక్కటే కాదు.. ఆసియాకు చెందిన పలు మీడియా సంస్థలు కూడా ప్రస్తుతం సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త వాతావరణంపై పలు విధాలుగా అంచనాలేస్తున్నాయి. గురువారం భారత ఈశాన్య సరిహద్దుల్లో కేవలం 150మీటర్ల దూరంలోనే భారత్, చైనా సేనలు మోహరించి ఉన్నాయి. ప్రస్తుతం సిక్కిం సెక్టార్‌లోనే ఉద్రిక్త వాతావరణం ఉన్నప్పటికీ దాడులంటూ మొదలైతే ఇవి అరుణాచల్ ప్రదేశ్ నుంచి జమ్మూకాశ్మీర్ వరకు గల సరిహద్దుల వెంబడి విస్తరిస్తాయన్న ఊహాగానాలు వెల్లడౌతున్నాయి. సరిహద్దుల్లో సమరం సాగితే భారత్‌కు జననష్టం తప్పదు. అయితే చైనాకు అంతకమించిన ఆర్థికనష్టం వాటిల్లుతుంది. పరిశ్రమలు మూతబడే పరిస్థితి నెలకొంటుంది. చమురు కోసం చైనా ఎక్కువగా దిగుమతులపైనే ఆధాపడుతోంది. చైనాకొచ్చే చమురు దిగుమతుల్లో 80శాతానికి పైగా మలాకా జలసంధి మీదుగానే

➪ 3వ పేజీలో...



ప్రణబ్ దా... మీ స్ఫూర్తికి ప్రణామం

4

మీ ఫోన్ కాల్ శక్తిని నింపేది

భిన్న సిద్ధాంతాలున్నా అవగాహన అపూర్వం



న్యూఢిల్లీ: నాగాలాండ్ జీబీ ఫెడరేషన్ ప్రతినిధుల సమావేశంలో నాగాల వేషధారణతో ప్రధాని మోడీ

ఆంధ్రప్రభ

ఈత వనాలకు ఎక్సైజ్ అవార్డులు



సంగారెడ్డి, కెఐఎన్‌ఎన్ : కల్తీలు, నకిలీలపై రాష్ట్రప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని, అక్రమార్కులను కఠినంగా శిక్షించే చర్యలు కార్యాచరణ సిద్ధమైందని రాష్ట్రనీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. గురువారం సంగారెడ్డి జిల్లా పట్టణ కేంద్రంలో గుడుంబా తయారీ నుంచి విముక్తులైన వారికి ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం, జీవనోపాధికి గేదెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం గుడుంబా తయారు చేసే కుటుంబాలకు సమాజంలో సమున్నత గౌరవం లభించేలా ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నదని చెప్పారు. నకిలీ ఆహార పదార్థాల విక్రయాల నియంత్రణకు ప్రత్యేక ట్రాన్స్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమార్కులపై పీడీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కల్లుగీత కార్మికులకు మద్దతుగా బంజరు భూముల్లో ఈత వనాల సాగును ప్రోత్సహిస్తున్నాం. ఎస్సీ, ఎస్టీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా తోడ్పాటు అందిస్తాం. గిరిజన, వెనుకబడినవర్గాలకు ఉన్నత విద్యను అందించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 7086 మంది గుడుంబా తయారీదారులను గుర్తించామని ఆ కుటుంబాలను పునరావాసం కింద 157 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. విపక్షాలు అభివృద్ధి నిరోధకులుగా మారాయని, వారికి ప్రజలే బుద్ధిచెప్తారని పిలుపునిచ్చారు.

స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని, అన్ని విధాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తన నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్, మెదక్ ఎంపిలు బిబిపాటిల్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు భూపాల్ రెడ్డి , రాములునాయక్, ఎమ్మెల్యేలు బాబూమోహన్, భూపాల్ రెడ్డిలతోపాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రాజమణి మురళీయాదవ్, పట్టణ మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి రవి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషన్ శాస్త్రి, జిల్లా ఇఎస్ చంద్రయ్య, స్థానిక ఎక్సైజ్‌సిఐ లక్ష్మణ్ రావుతోపాటు పలువురు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గుడుంబా తయారిదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఖజానా గలగల

- పెరుగుతున్న రాబడులు
- రవాణా, వాణిజ్య, ఎక్సైజ్ ఆదాయం భేష్
- తొలి త్రైమాసిక రాబడి రూ. 13,194 కోట్లు
- పన్నుల రాబడిలో 11.27శాతం వృద్ధి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రభుత్వం ఆశించిన విధంగానే రాబడులు పెరుగుతున్నాయి. ప్రభుత్వం దూరదృష్టితో తీసుకున్న చర్యలు ఆదాయం పెంచడానికి దోహదపడుతున్నాయి. పన్ను ఎగవేతలు తగ్గిపోతున్నాయి. రాబడి పెరుగుతుంది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో పన్నుల రూపంలో రూ. 11,514.70 కోట్ల రాబడి జమకాగా, 2017 తొలి త్రైమాసికంలో రూ. 12,812.47 కోట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంవత్సరం తొలి త్రైమాసికం పన్నుల వసూళ్ల ద్వారా రూ. 1,297.77 కోట్ల పెరుగుదల నమోదైంది. రాబోవు కాలంలో కూడా రాబడులు పెరిగే అవకాశం ఉందని ఆర్థిక వర్గాలు భావిస్తున్నాయి. పన్నేతర రాబడి రూ. 381.95 కోట్ల వరకు తొలి త్రైమాసికంలో నమోదైంది. మొత్తంగా ఏప్రిల్ నుండి జూన్ వరకు రాష్ట్ర రాబడి రూ. 13,194.42 కోట్లు. 2016-17లో రాష్ట్ర సొంత ఆదాయం రూ. 58,636 కోట్లు. 2017-18లో రాబడి లక్ష్యం రూ. 69,220.37 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించుకొని లక్ష్యం చేరుకొనేందుకు చర్యలు తీసుకుంటున్నది. కేంద్రం నుండి వివిధ పద్దుల కింద రూ. 43,862 కోట్లు రాబట్టడానికి వివిధ శాఖల ద్వారా ఇప్పటికే సంప్రదింపులు జరుపుతోంది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలతో పాటు విభజన చట్టం ప్రకారం రావాల్సిన కేంద్రనిధులను సకాలంలో రాబట్టడానికి ప్రజాప్రతినిధుల ద్వారా ఒత్తిడి తీసుకొస్తోంది. ఇప్పటికే పది వేల కోట్లకు పైగా వివిధ పద్దుల కింద రాష్ట్ర ప్రభుత్వ ఖాతాల్లో జమ అయి నట్లుగా ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం 2017-18 ఆర్థికసంవత్సరానికి రూ. 1,49,646 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. అందులో రెవెన్యూ మిగులు రూ. 4,571.30 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు. ద్రవ్య లోటు సుమారు రూ. 26 వేల కోట్ల వరకు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. రాబడులు పెరుగుతున్నప్పటికీ నిర్వహణకు రూ. 61,607 కోట్లు ఖచ్చితంగా వ్యయం చేయవలసి వస్తున్నది. అభివృద్ధి కార్యక్రమాలకు మరో రూ. 88.038 కోట్లు ఖర్చు చేయడానికి వివిధ శాఖల పరిధిలో చర్యలు తీసుకుంటున్నారు. రాబడులకు సంబంధించి వాణిజ్య పన్నుల్లో 8.20 శాతం వృద్ధి నమోదైంది.

గత సంవత్సరం తొలి త్రైమాసికంలో వాణిజ్య పన్నుల శాఖ రూ. 8,483.96 కోట్లు వసూలు చేయగా ఈ త్రైమాసికం లో రూ. 9,179.83 కోట్లు జమచేసింది. ఎక్సైజ్‌శాఖపరిధిలో కూడా 40.95 శాతం రాబడి పెరిగింది. 2016 తొలి త్రైమాసికంలో రూ. 1,384.88 కోట్ల రాబడి నమోదు కాగా 2017 తొలి త్రైమాసికంలో రూ. 1,952.05 కోట్ల మొత్తాన్ని సర్కారు ఖజానాలో జమ చేశారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖలో మాత్రం ఆర్థిక లావాదేవీలు తగ్గిపోయాయి. పెద్దనోట్లు రద్దు, ఆర్థిక ఆంక్షలు, జీఎస్టీ అమలు, నల్లధన వినియోగాన్ని కనిష్ట స్థాయికి తగ్గించేందు కు తీసుకుంటున్న చర్యల వల్ల రిజిస్ట్రేషన్లు ఆశించిన మేరకు జరగడం లేదు. రియల్ ఎస్టేట్ రంగం ఆందోళనకు గురికావడం, ఇళ్లు, ప్లాట్ల క్రయ విక్రయాల్లో స్తబ్దత ఏర్పడటంతో రాబడి పడిపోయింది. గత సంవత్సరం తొలి త్రైమాసికం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల రాబడి రూ. 1,005.60 కోట్లు కాగా ఈ సంవత్సరం తొలి త్రైమాసికం రూ. 897.33 కోట్లకే పరిమితమైంది. సుమారు 10.77శాతం రాబడి పడిపోయింది. రవాణా రంగం నుండి రాబడి రూ. 640.26 కోట్ల నుండి రూ. 783.26 కోట్లకు పెరిగింది. సుమారు 22.33 శాతం వృద్ధి నమోదైంది.

మొత్తంగా 11.27 శాతం రాబడి పెరిగింది. గనుల శాఖ ద్వారా వచ్చే రాబడి కూడా 12.35 శాతం తగ్గింది. గతసంవత్సరం తొలి త్రైమాసికంలో గనులశాఖ రాబడి రూ. 246.43 కోట్లు కాగా ఈ సంవత్సరం రూ. 216 కోట్లకే పరిమితమైంది. ఇసుక రాబడి రూ. 134.19 కోట్ల నుండి రూ. 165.95 కోట్లకు పెరిగింది. ఇసుక అక్రమాలను అరికట్టడంతో ప్రభుత్వ రాబడి పెరిగింది. రాబోవు



త్రైమాసికంలో కూడా స్టాంపులు రిజిస్ట్రేషన్ల రాబడి పెరిగే అవకాశం కనిపించడం లేదు. ప్లాట్లు, గృహాల క్రయ విక్రయాలు పుంజుకోకుండా రాబడిని ఆశించలేమని అధికారులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక రంగంలో తీసుకున్న కీలక నిర్ణయాలతో స్థిరాస్తి రంగం కుదేలవుతుంది.

ఈ రంగంలో లావాదేవీలు పడిపోయాయి. భూములు, ప్లాట్ల అమ్మకాలు, కొనుగోళ్లు ప్రభుత్వం ఆశించిన మేరకు జరగడం లేదు.

అగ్నిపూలు

అగ్నిపర్వతం పేలుడు..

ఆపై పిడుగులు...

కలగలసిన చిత్రమే ఇది

అగ్ని పర్వతం.. మెరుపు.. రెండూ రెండే.. రెండింటినీ ఒకేసారి ఫొటో తీయడం సాధ్యమా! ఈ ఊహకు ప్రతిరూపమే ఈ చిత్రం. చూడగానే కంప్యూటర్ గ్రాఫిక్ అనుకునేరు. కానేకాదు. మెక్సికోకు చెందిన సెర్జియో టపిరో వలెస్కో దీన్ని చిత్రీకరించారు. ది పవర్ ఆఫ్ నేచర్ పేరుతో 2017 నేషనల్ జాగ్రఫిక్ ట్రావెల్ ఫొటోగ్రాఫర్‌గా బహుమతినందుకున్నారు. ఈ టైటిల్ కోసం 30 దేశాలనుంచి 15000 ఎంట్రీలు అందాయి. అగ్నిపర్వతానికి 12 కిలోమీటర్ల దూరం నుంచి ఈ ఫొటోను తీశారు. పర్వతం నుండి అగ్ని శిఖలను తాకుతున్నట్లు విరిసిన మెరుపును ఆయన తన కెమెరాలో బంధించారు. లావా.. పొగ..మెరుపు ఇందులో అద్భుతంగా ఒదిగిపోయాయి. ప్రకృతి ఆగ్రహాన్ని కళ్లకు కట్టాయి. ఇంతకూ ఆ అగ్నిపర్వతం పేరు కొలిమో. దీన్ని వల్కనో ఆఫ్ ఫైర్‌గా కూడా పిలుస్తారు. ఈ అద్భుత చిత్రాన్ని తీయడానికి అతను నెలరోజుల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో బాంబుల్లా పేలుతున్న లావా ప్రతాపాన్ని ఆయన అనుభవించాడు.



పునరుజ్జీవ సభ ఇన్‌చార్జిగా ఈటల



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈనెల 10న జరిగే ఎస్సారెస్పీ పునరుజ్జీవ సభ ఏర్పాట్లు పర్యవేక్షించే బాధ్యతలను రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి ఈటల రాజేందర్‌కు ముఖ్యమంత్రి కెసిఆర్ గురువారం అప్పగించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులను సమన్వయం చేసి సభను విజయవంతం చేసే బాధ్యతలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కోరగా, ఇందుకు ఈటల రాజేందర్ అంగీకరించారు. తొలుత పునరుజ్జీవ సభ ఏర్పాట్లు చూడా ల్సిందిగా సిఎం హరీష్‌రావును ఆదేశించడంతో.. బుధవారం మంత్రి పోచంపాడు వెళ్ళి పరిసరాలు పరిశీలించి వచ్చారు. అయితే గురువారం ఈ బాధ్యతలు ఈటలకు అప్పగించారు. ప్రాజెక్టులకు సంబంధించిన పలు పనులు హరీష్ పర్య వేక్షించాల్సి ఉన్న నేపథ్యంలో సభ బాధ్యతలు ఈటల రాజేందర్‌కు అప్పగించినట్లు సమాచారం.

కృష్ణమ్మ కదిలింది..

- జూరాలకు స్వల్పంగా వరద

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఎగువన వరదలు ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలను నింపేసినా.. ఆయా ప్రాజెక్టుల కింద ఉన్న ఉప ప్రాజెక్టులు, రిజర్వాయర్లను కూడా నింపుకున్న కర్ణాటక.. స్వల్పంగా కృష్ణాజలాలను విడుదల చేసింది. నారాయణపూర్ నుండి 18072క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, జూరాలకు మాత్రం సగటులన 3842క్యూసెక్కుల వరద మాత్రమే వస్తోంది. ఆల్మట్టి ప్రాజెక్టు సామర్థ్యం 129.72 టిఎంసిలు కాగా, ప్రస్తుతం ఆ ప్రాజెక్టులో 128.19టిఎంసిలు నిల్వ ఉన్నాయి. ప్రాజెక్టులోకి 21వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు సామర్థ్యం 37.64టిఎంసిలు కాగా, 37టిఎంసిల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 19,365 క్యూసెక్కుల వరద వస్తుండగా, 18072క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల సామర్థ్యం 9.66టిఎంసిలు కాగా, ప్రస్తుతం 5.52టిఎంసిల నీరు ప్రాజెక్టులో నిల్వ ఉంది. 3846క్యూసెక్కుల వరద జూరాల ప్రాజెక్టులో వస్తుండగా, 4552క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



చుక్కనీరు లేదు..

ప్రస్తుతం తెలంగాణలోని ఇతర ప్రాజెక్టులకు చుక్కనీరు రావడం లేదు. సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్, లోయర్ మానేరుడ్యాం, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులలోకి చుక్కనీరు కూడా రావడం లేదు. దీంతో ఆయకట్టు రైతాంగం బిక్కుబిక్కుంటోంది.

వీఏఓల గౌరవవేతనం రూ. 3వేలు

- ఏప్రిల్ నుంచి వర్తింపు
- రూ. 190 కోట్లు మంజూరు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలోని గ్రామైఖ్య సంఘం అసిస్టెంట్లలకు (వీఏఓ) ఇచ్చే గౌరవ వేతనం మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు గురువారం ముఖ్యకార్యదర్శి వికాశ్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీఏఓలకు ప్రతి నెల రూ.3 వేలు గౌరవవేతనం కింద చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ గౌరవ వేతనం ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి చెల్లించాలని వెల్లడించారు. వీఓఏలు గ్రామైఖ్య సంఘం సమావేశాలు నిర్వహించడం, బుక్ కీపింగ్‌లతో పాటు ప్రతి రోజు సంఘం కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులను అమలు చేయాలని తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను ఆదేశించారు. వీఏఎల గౌరవ వేతనానికి సంబంధించిన రూ.1.90కోట్ల నిధులకు పరిపాలన అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది.

ప్రసాదంలో బల్లి అవశేషాలు



పాలకుర్తి, కెఐఎన్‌ఎన్ : పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో తయారు చేసిన ప్రసాదం (పులిహోర) ప్యాకెట్‌లో బల్లి అవశేషాలు ఉన్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. జనగాం జిల్లా, పాలకుర్తి మండలంలోని విస్నూర్ గ్రామానికి చెందిన వెంకటరమణ కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనం కోసం శ్రీసోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. గుట్టపై మండపం ఆవరణలో ప్రసాదం విక్రయిస్తుండగా పులిహోరా ప్యాకెట్లు కొనుగోలు చేశామని వెంకటరమణ తెలిపారు. కొనుగోలు చేసిన పులిహోరను తన కూతురు వర్ణికకు తినిపిస్తుండగా ప్యాకెట్‌లో బల్లి అవశేషాలు ఉన్నట్లు గమనించారు. దీంతో ఆందోళన చెందిన వెంకటరమణ దంపతులు తన తండ్రి మధుకర్‌కు తెలి పారు. వెంటనే గుట్ట వద్దకు వచ్చిన మధు కర్ వర్ణికను స్థానిక ప్రైవే టు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఈవో దేవులపల్లి సదా నందంను వివరణ కోరగా శ్రీసోమేశ్వరలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో తయారు చేసే ప్రసాదంలో బల్లి అవశేషాలు ఉన్న సంఘటన తన దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎస్సై ఎన్.వెంకటేశ్వర్లు సమాచారం తెలుసుకొని హుటాహుటీన ఆలయం వద్దకు చేరుకొని భక్తులను విచారించారు.

చోళకాలపు వినాయకుడు

నకిరేకల్, కెఐఎన్‌ఎన్: నల్గొండ జిల్లా, నకిరేకల్ పట్టణంలోని శివాలయం వీధిలో భూమిని చదును చేస్తుండగా నల్లరాతితో చెక్కిన వినాయక విగ్రహం బయటపడింది. పట్టణానికి చెందిన కొండ జాని, చందుపట్ల గ్రామానికి చెందిన టంగుటూరి సైదులు ఇచ్చిన సమాచారం మేరకు పురావస్తు పరిశోధకుడు, ప్రముఖ స్థపతి కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి గురువారం ఆ విగ్రహాన్ని పరిశీలించారు. మూడు అడుగుల ఎత్తు, 2అడుగుల వెడల్పు, అడుగున్నర మందం ఉన్న నల్లశానపు రాతి గణేష్ విగ్రహం లలితాసనంలో కూర్చొని ఉన్నట్లు రెండు చేతులతో సహజసిద్ధ ఏనుగు ముఖంతో తీర్చిదిద్దడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ విగ్రహం ప్రత్యేకత క్రీ.శ. 12వ శతాబ్ధిలో ఈ ప్రాంతాలన్ని పాలించిన కందూరు చోళుల శిల్పకళా శైలిలో చెక్కిన ఈ విగ్రహం ఎడమకాలు భిన్నమైందని, దాదాపు 800సంవత్సరాల చరిత్ర గల ఈ అరుదైన విగ్రహాన్ని తెలంగాణ పురావస్తుశాఖ కాపాడి తగు భద్రత కల్పించాలని శివనాగిరెడ్డిని శివాలయం వీధివాసులు టి.సైదులు, కొండ కృష్ణ, విజయవాడ బుద్ధ విహార కార్యదర్శి శుభాకార మేడసాని కృష్ణ తదితరులు కోరారు.



విగ్రహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నేటినుంచి డీఫార్మసీ కౌన్సెలింగ్

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో డి ఫార్మసీ కౌన్సిలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శుక్రవారం ఎంపిసి, బైపిసి గ్రూపులకు చెందిన వారందరూ ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని అధికారులు సూచించారు. శనివారం వరకు వారు తమ వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోవడానికి అవకాశం కల్పించారు. 8న సీట్ల కేటాయింపు ఉంటుంది. ధ్రువపత్రాల పరిశీలనకు రాష్ట్ర వ్యాప్తంగా 5 హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ దగ్గర ఉన్న సాంకేతిక విద్యా భవన్, వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ నిజామాబాద్, ప్రభుత్వ పాలిటెక్నిక్ మహబూబ్ నగర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ నల్గొండలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఆర్థిక అధికారాలపై కమిటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అధికారులకు ఆర్థిక అధికారాలు పెంచే అంశం పైన అధ్యయనం చేయడానికి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్. శైలేంద్ర కుమార్ జోషీ అధ్యక్షతన సీనియర్ ఐఎఎస్ అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సచివాలయ శాఖలు, ప్రధాన కార్యాల యాలు, ప్రాంతీయ అధికారులు, జిల్లా అధికారులు, యూని ట్ అధికారులకు ఇప్పటి వరకు ఉన్న ఆర్థిక అధికారాలు, వాటిని పెంచాల్సిన అవసరం, ఎంత వరకు పెంచవచ్చు అనే అంశాల పైన కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందచేయవలసి ఉంటుంది. కమిటీలో బి.ఆర్.మీనా, అధర్ సిన్హా, కె. రామకృష్ణారావు తదితరులు సభ్యులుగా ఉన్నారు.

ఖమ్మం బీసీ స్టడీసర్కిల్ భవనానికి రూ.3.50 కోట్లు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఖమ్మం జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ భవనం నిర్మాణానికి రూ. 3.50 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో స్వల్ప మార్పులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కల్యాణ లక్ష్మి పథకం కింద ప్రభుత్వం అంద చేస్తున్న రూ. 75,116ల నగదుకు వధు వు అనాధ అయిన పక్షంలో వధువు పేరు మీదనే చెక్ జారీ చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు వధువు తల్లి, తండ్రి పేరుతో చెక్‌ల ను జారీ చేయడం జరిగింది. అనాధలైన వధువుల విషయంలో నగ దు సహాయం ఎవరి పేరుతో ఇవ్వాలనే అంశం ఉత్పన్న మవడంతో ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వధువు తల్లి పేరుతో చెక్‌ను జారీ చేయాలని, తల్లి లేని పక్షంలో తండ్రి పేరుతో చెక్ ఇవ్వవలసి ఉంటుందని ఇప్పటి వరకు అమలులో ఉన్న ఆదేశాలను స్వల్పంగా మార్చి, తల్లి, తండ్రి లేని వధువులకు వారి పేరు మీదనే చెక్‌ను జారీ చేయాలని ప్రభుత్వం సూ చించింది.

ఉద్యోగులకు రాజీవ్ స్వగృహ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో నిర్మించిన ప్లాట్లను ప్రభుత్వ ఉద్యోగులకు విక్రయించాలని ప్రభుత్వం నిర్ణ యించింది. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు ఆదే శాల మేరకు ఆన్‌లైన్ ద్వారా ప్లాట్లను విక్రయిం చనున్నారు. బండ్లగూడ, పోచారంలో నిర్మిం చిన 3,719 ప్లాట్లను మొదటి దశలో విక్రయించనున్నారు. పారదర్శకంగా ఇండ్లను విక్రయించేందుకు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ తరఫున ఆన్‌లైన్ ప్రక్రియ కోసం త్వరలోనే వైబ్‌సై ట్‌ను ప్రారంభించనున్నట్లు గృహ నిర్మాణశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. దీనికోసం సెంట్రల్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రత్యేక అప్లికేషన్‌ను అభివృద్ధి చేసిందని ఆయన చెప్పారు.

బ్యాంకుల నుంచి తీసుకున్న రుణానికి వడ్డీ కూడా గత ప్రభుత్వాలు సరిగా చెల్లించకపోవడంతో ఆ భారం తెలంగాణ రాజీవ్ స్వగృహపై పడిందని మంత్రి చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ వాటాగా వడ్డీతో కలిసి రూ.1,069 కోట్లు రాజీవ్ స్వగృహపై భారం పడిందని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి రాజీవ్ స్వగృహపై ఉన్న అప్పులను తీర్చేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నారని, తెలం గాణ రాష్ట్ర అవతరణ నుంచి ఇప్పటి వరకు రూ.820 కోట్ల రుణాన్ని తీర్చినట్లు మంత్రి వెల్ల డించారు.

రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అన్ని మౌలిక వసతులతో కూడిన ప్లాట్లను నిర్మించిందని, వీటిని కొనుగోలు చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని మంత్రి ఇంద్రకరణ్ కోరారు. విక్రయ మార్గదర్శకాలను వెబ్‌సై ట్‌లో ఉంచుతామన్నారు. మొదటి దశలో బండ్ల గూడలో ఉన్న 2,245 ప్లాట్లను, పోచారంలో ఉన్న 1,474 ప్లాట్లను రాజీవ్ స్వగృహ విక్రయించనుంది. బండ్లగూడ లోని 2,245 ప్లాట్లలో 316 గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని, మరో 1,929 ప్లాట్లలో చిన్న చిన్న పనులు మిగిలి ఉన్నా యని మంత్రి వివరిం చారు. వీటిని ఆన్‌లైన్ వేలం ద్వారా కొనుక్కునే వారే మిగతా పనులు చేసుకోవలసి ఉంటుం దన్నారు. పోచారంలో మొత్తం 1,474 ప్లాట్లకు గానూ 969 ప్లాట్లలో పనులు పూర్తి కాగా, 505 ప్లాట్లకు ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రతి ప్లాటుకు ప్రత్యేకంగా ధరను నిర్ణయించి ఆన్‌లైన్ లో అమ్మ నున్నారు. బండ్లగూడలో నిర్మాణం పూర్తయిన వాటికి చదరపు అడుగుకు రూ.1, 900గా, సెమీ ఫినిష్డ్ ప్లాట్స్‌కు రూ.1,700లుగా నిర్ణయించారు. పోచారంలో నిర్మాణం పూర్తయిన ప్లాట్స్ చద రపు అడుగుకు రూ,1,700, వినియోగానికి అనుకూలంగా పూర్తి చేయని వాటికి రూ.1,500లుగా నిర్ణయించారు. ఈ ప్లాట్ల అమ్మకం ద్వారా గృహ నిర్మాణ శాఖకు రూ.545 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

4వేల కోట్లతో పోలీసులకు ఇండ్లు

- పోలీసు హౌసింగ్ సంస్థ చైర్మన్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం పోలీసు శాఖ పటిష్టతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర పోలీస్ గృహనిర్మాణ సంస్థ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామోదర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించారన్నారు. ముఖ్యమంత్రి కాగానే శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇచ్చి పోలీసు శాఖపై దృష్టి సారించారన్నారు. రూ.375కోట్లతో పోలీసు శాఖకు అధునాతన వాహనాలు సమకూర్చారన్నారు. పోలీసుల వసతి గృహాల నిర్మాణంకోసం హడ్కో ద్వారా రూ.4000 కోట్లు రుణం పొందే ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిపారు. 31జిల్లాల్లో 13జిల్లాలకు మాత్రమే కొత్త ఎస్పీ కార్యాలయాల నిర్మాణం అవసరం ఉందన్నారు. రామగుండం ,సిద్దిపేట కేంద్రాల్లో పోలీసు కమిషనరేట్ కార్యాలయాలను నిర్మించనున్నట్టు వెల్లడిం చారు. తీవ్రవాద ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో కొత్తగా 45 కోట్లతో 24పోలీస్‌స్టేషన్లు నిర్మించనున్నట్టు తెలిపారు. గోదా వరి ఖనిలో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మిస్తామన్నారు. కొత్తగా అదిలాబాద్ , కొత్తగూడెం, ఇబ్రహిపట్నంలో పోలీసు బెటాలియన్ల నిర్మాణం చేపట్టు నున్నట్టు తెలిపారు. వరంగల్‌లో అధునాతన కమిషనరేట్‌కు 30కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలో 48కోట్లతో పోలీస్ ట్రైనింగ్ కాలేజిని ఏర్పాటు చేస్తున్నా మన్నారు. ఇతర ప్రభుత్వ శాఖలు కూడా నిర్మాణ పనులు తమ సంస్థకే అప్పగిస్తున్నాయన్నారు. రూ.50కోట్ల తో గజ్వేల్‌లో అటవీశాఖ కళాశాలను నిర్మించ నున్నట్టు తెలిపా రు. ఈ ఆర్థిక సంవత్సరంలో కార్పొరేషన్ ద్వారా రూ.300కోట్లు వివిధ పనులపై ఖర్చు చేయనున్నట్టు ఛైర్మన్ దామోదర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ ఎండి మల్లారెడ్డి, సీఇ గోపాలకృష్ణ, ఎస్ఇ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్ వృద్ధి

జాబ్ కనెక్ట్‌తో సాధ్యం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : యువత పెడతోవ పట్టకుండా వారిని సన్మార్గంలో నడిపేందుకు దోహదం చేసే విధంగా.. దిక్సూచీగా తద్వారా శాంతి భద్రతల పరిరక్షణ సులభ మయ్యే రీతిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా టీఎంఐ, జాబ్స్‌డైలాగ్ భాగస్వామ్యంతో హాక్ఐ మొబైల్ కనెక్టివిటీతో హైదరాబాద్ సిటీ పోలీసు జాబ్ కనెక్ట్ వ్యాన్ ను రాష్ట్ర డీజీపీ అనురాగశర్మ గురువారం నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం లేని యువత అసహనానికి లోనై నేరాల బాట పట్టే ప్రమాదం లేకపోలేదన్నారు. ఈ జాబ్ కనెక్ట్ వ్యాన్ ద్వారా యువత నేరాల బాట పట్టకుండా వారికున్న స్కిల్స్‌ని పరిగణ నలోనికి తీసుకుని వారికి అనువైన ఉద్యోగాల కల్పనకు హైద రాబాద్ పోలీసులు తీసుకున్న చర్య ముదావహమన్నారు. ఇటు వంటి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన హైదరాబాద్ సిటీ పోలీ సులకు ఆయన ఈ సందర్భంగా అభినందనలు తెలి యజేశారు. హైదరాబాద్ సిటీ పోలీసు కమిషనర్ మహేందర్‌రెడ్డి ప్రసంగిస్తూ పోలీసింగ్ చేయాలంటే ప్రజలకు, పోలీసులకు మధ్య మాంఛి కనెక్టివిటీ ఉండాలన్నారు. ప్రజలనుండి ఎంతగా సహాయ సహకా రాలు లభిస్తాయో అంతగా చట్టా లను అమలు చేయడం సులభతరం కాగలదన్నారు. ప్రజలతో సఖ్యతతో పాటు ప్రజల హృదయాలను గెలుచుకోవాలని అన్నారు. ఈ జాబ్ కనెక్ట్ వ్యాన్ ఆయా పీఎస్‌ల పరిధిలో డోర్ టూ డోర్ తిరుగుతూ నిరుద్యోగ యువత డేటా సేక రిస్తుం దన్నారు. ఈ డేటాను హాక్ఐ యాప్‌కు అనుసంధానించడం జరుగుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఏదైనా సాధ్యమన్న అభిప్రాయాన్ని ఆయన ఈ సంద ర్భంగా వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువత డేటా సేకరించడమే కాదు. వారికున్న స్కిల్స్‌ని పరిగణన లోనికి తీసుకుని వారు ఏ ఉద్యోగానికి అర్హులో కూడా నిర్ణయించి తదనుగుణంగా వారికి ఉద్యోగావకాశాల కల్పన దిశగా కృషి చేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమం విజయ వంతమ వడానికి ఆయా సెక్టర్ ఎస్ఐలతో సహా అందరూ పోలీసు అధికారులు తమ వంతు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచిం చారు. ప్రజల దగ్గరికి మనమే వెళ్లడం తద్వారా కమ్యూనిటీ పోలీసింగ్ మెరు గవ్వ డంతో పాటు యువత భాగస్వామ్యం తోడవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న టీఎంఐ.. తదితరులను ఆయన అభినందించారు. నార్త్‌జోన్ డీసీపీ సుమ తి మాట్లాడుతూ.. తమ జోన్ పరిధిలో ఇటీవలే చేయూత కార్య క్రమాన్ని నిర్వ హించడం జరిగిందన్నారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా యువతకు వారి స్కిల్స్ ఆధారితంగా జాబ్స్ కల్పించే దిశగా ఈ కార్యక్రమం దోహదపడగల దన్న ఆశా భావా న్ని వ్యక్తం చేస్తున్నారు. పోలీసు కానిస్టేబుల్స్ ఉద్యోగాలకు జోన్ల వారీగా స్థానిక యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహణ జరుగుతోందన్నారు. యువత స్థానికంగా ఉద్యోగం పొందే విధంగా ఈ కార్యక్రమం ఉపయుక్తం కాగలద న్నారు. కార్యక్రమంలో టీఎంఐ చైర్మన్ మురళీధరన్ పాల్గొని ప్రసంగించారు.

డ్రాగన్‌తో పోరుకు
భారత్ సిద్ధం
కేంద్ర సహాయ మంత్రి రాందాస్



విశాఖపట్నం, కెఎన్ఎన్ బ్యూరో: చైనాపై యుద్ధానికి భారత్ ఎప్పుడూ సిద్ధంగానే వుందని, అయితే భారత్‌పై కొంతకాలంగా చైనా కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని, భారత భూభాగంలోకి చొచ్చుకురావడంతోపాటు అశాంతికి కారణంగా మారిందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత సహాయ మంత్రి రాందాస్ అత్‌వాలే అన్నారు. గురువారం విశాఖలోని విలేకరులతో కేంద్ర మంత్రి మాట్లాడుతూ చైనాతో పోరాటం సాగించేందుకు భారత్ ఎప్పుడూ కూడా సిద్ధంగా వుందని, ఈ విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తి లేదన్నారు. ఇప్పటికే పాకిస్తాన్ ఉగ్రవాదులను భారత్‌పైకి ఉసిగొలుపుతోందని అన్నారు. ఇరు దేశాల మధ్య శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు భారత్ సిద్ధంగా వున్న పాకిస్తాన్ ఆ ప్రయత్నం చేయడం లేదన్నారు. మన దేశంలో చైనా తన వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకుంటూనే మన భూ భాగాన్ని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తుందని, ఇటువంటి ప్రయత్నాలు సహించేది లేదని అన్నారు. దేశంలో ప్రత్యేక రాష్ట్రాల కోసం పలు చోట్ల పోరాటాలు జరుగుతున్నాయని, అయితే చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు ఎన్‌డి ఏ ప్రభుత్వం ఎప్పుడూ సుముఖంగానే వుందన్నారు. విధర్భను రెండు రాష్ట్రాలుగా చేయాలని కొంతమంది పోరాటాలు సాగిస్తున్నా ఎన్‌డిఎలో భాగ స్వామిగా వున్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎ) మద్దతు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కోమటిబండ, కాళేశ్వరంలో..
ఐఏఎస్‌ల బృందం పర్యటన



హైదరాబాద్, ఆంధ్రప్రభ: సీనియర్ ఐఎఎస్ అధికారుల బృందం కాళేశ్వరం ఎత్తిపోతల పనుల పరిశీలనకు గురు వారం వెళ్ళింది. ఈ క్రమంలో గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండపై ఏర్పాటుచేసిన మిషన్ భగీరథ పైలాన్‌ను అక్కడ నిర్మించిన వాటర్ ట్యాంకులను రాష్ట్ర ఐఎఎస్ అధికారుల బృందం పరిశీలించింది. సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రాం రెడ్డి వీరికి పథకంను, జిల్లావ్యాప్తంగా నీరు సర ఫరా అవుతున్న తీరును వివరించారు. కార్యక్రమంలో ఐఎ ఎస్‌ల బృందం బిపి ఆచార్య, సురేష్ చంద్ర, జగదీశ్వర్, శ్రీలక్ష్మి, మహేష్ దత్ ఎక్కా, పార్ధసారధి, ఉమర్ జలీల్, గడ ప్రత్యేక అధికారి హన్మంతరావు, సిఈ విజయ్‌ప్రకాష్ పాల్గొన్నారు.

అమానుషం



ఆటోలో ప్రసవించిన ఉషా



గర్భశోకం..

సికింద్రాబాద్, కెఎన్ఎన్ : పురిటినొప్పులతో గాంధీ ఆసుపత్రికి వచ్చిన ఓ మహిళ ఆటోలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ముందుగా ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లినప్పటికీ, ఆ ఆసుపత్రి వైద్యులు పట్టించుకోక పోవడంతో ఆటోలో నేరుగా గాంధీ ఆసుపత్రికి రావడం, ఆసుపత్రిలో ఆటో నుంచి బయటకు తరలించే క్రమంలో ఆ మహిళ ఆటోలోనే ప్రసవించింది. గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన ఉష(28), 8 నెలల గర్భవతి. గురువారం ఉదయం తన నివాసంలో నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన దగ్గరోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆసుపత్రి వైద్యులు పట్టించుకోక పోవడంతో వారు వెంటనే ఆటోలో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నొప్పులు ఎక్కువవడంతో ఆస్పత్రి వద్ద ఆటోను పార్కింగ్ చేసి, ఆ మహిళను ఆటో నుంచి బయటకు తీసే సమయంలో నొప్పులు మరింత ఎక్కువవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. ఇంతలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న గాంధీ నర్సులు హుటాహుటిన తల్లి, బిడ్డను వార్డుకు తరలించారు. తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మరోవైపు కోఠి మెటర్నిటీ ఆసుపత్రిలోనూ విషాద ఘటన చోటుచేసుకుంది. పురిటినొప్పులతో వచ్చిన మహిళకు సకాలంలో వైద్యం అందలేదు. దాంతో ఆమె నడిరోడ్డుపైనే ప్రసవించింది. పండంటి బిడ్డ కనుగుడ్డు తెరవకుండానే కన్నుమూసింది. ఈరెండు ఘటనలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో దయనీయ పరిస్థితులకు అద్దంపడుతున్నాయి.

సర్కారు దవఖానాల్లోనే
41 శాతం కాన్పులు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతం కంటే 41 శాతం ప్రసవాలు పెరిగాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కువ ప్రసవాలు జరగగా అత్యల్పంగా మేడ్చల్ జిల్లాలో జరిగాయని తెలిపారు. కేసీఆర్ కిట్ల పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చారించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో జరిగే మొత్తం ప్రసవాల్లో 50 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరగాలనేది సర్కార్ లక్ష్యమన్నారు. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పూల్‌నాయక్ తండాలో అధ్యయనం చేయడం కోసం ప్రత్యేక వైద్య బృందాన్ని పంపించాలని అధికారులను మంత్రి లక్ష్మారెడ్డి ఆదేశించారు. వ్యాధి బారినపడిన వారికి హైదరాబాద్‌లో ఉచిత చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు.

యుద్ధం వస్తే..
డ్రాగన్‌కే దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

సరఫరా అవుతోంది. ఇది మలేషియా, ఇండోనేషియాల మధ్య ఉంది. భారత్‌కు చెందిన అండమాన్ నికోబార్ దీవులు ఈ జలసంధికి అత్యంత సమీపంలోనే ఉన్నాయి. ఈ దీవుల్లో భారత నావికాదళం మాటేసుంది. ఇటీవలె ఇక్కడ భారీ నౌకాదళ కేంద్రాన్ని కూడా భారత్ ప్రారంభించింది. ఇక్కడ యుద్ధ నౌకలు సిద్ధంగా ఉన్నాయి. చైనాకు సరఫరా అయ్యే చమురు ఈ పక్క నుంచే వెళ్ళాలి. యుద్ధమంటూ మొదలైతే ఒక్క పధాతి దళానికే పరిమితంకాదు. వాయు, నావికాదళాలు కూడా బరిలో దిగుతాయి. అదే జరిగితే మలాకా జలసంధి మీదుగా వెళ్ళే చమురు వాణిజ్యనౌకలపై భారత యుద్ధనౌకలు దాడులు నిర్వహిస్తాయి. ఈ చమురు రవాణాను అడ్డుకుంటాయి. చైనా, పాకిస్థాన్ వెంబడున్న సరిహద్దులపై కూడా భారత్ దృష్టి పెడుతుంది. ఈ ప్రాంతంలో భారత్ ఇప్పటికే పెద్దసంఖ్యలో పదాతి దళాల్ని మోహరించుంది. అన్నింటికి మించి చైనా దీర్ఘకాలంగా ఎన్నో ఆశలెట్టుకున్న సిల్క్ రోడ్ నిర్మాణం మధ్యలో నిల్చిపోతుంది. అలాగే బెల్ట్ ప్రాజెక్ట్ కూడా నిర్వీర్యమౌతుంది. ఈ రోడ్డును చైనాలోని బీజింగ్ నుంచి భారత్-పాక్‌ల మధ్యగల సరిహద్దుల మీదుగా గ్వోదర్ పోర్టు వరకు కొనసాగనుంది. ఇప్పటికే నేపాల్‌లో పరోక్షంగా పెత్తనం చేస్తున్న చైనా భూటాన్‌ను కూడా లొంగదీసుకునేందుకు ప్రయత్నించింది. ప్రస్తుతం సమస్యాత్మకంగా మారిన డొక్లామ్ ప్రాంతం భారత్, చైనా, భూటన్‌ల సరిహద్దుల్లో ఉంది. తమకు సాయం చేయాలంటూ భూటాన్ భారత్ పంచన చేరడాన్ని చైనా సహించలేకపోతోంది. ఆ దేశాన్ని దారికి తెచ్చుకుంటే సరిహద్దుల వెంట సాగే సిల్క్ రోడ్డు నిర్మాణ నిరాటంకంగా సాగుతుంది. ఇప్పటికే శ్రీలంకలోని హంబంతోట్, పాక్‌లోని గ్వోదర్ పోర్టుల్లోని తన సైనిక శిబిరాల్ని ఏర్పాటు చేసుకునేందుకు చైనా ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. ఈ రెండు దేశాలు ఇందుకు అనుమతులు జారీచేశాయి. ఈ రెండు పోర్టులు భారత వాయుసేన వద్దనున్న క్షిపణుల పరిధిలోకొస్తాయి. దీంతో ఇవి కూడా భారత్‌కు లక్ష్యంగా మారతాయి. ఈ రేవులపై భారత్ దాడులు చేస్తే ఇవి చైనాతో ఒప్పందం కొనసాగించేందుకు ముందుకురావు. దీంతో ఆగ్నేయాసియాలో విస్తరించాలన్న చైనా వ్యూహానికి గండిపడుతుందంటూ చైనాకు చెందిన సైనిక కార్యకలాపాల విశ్లేషకులు అక్కడ ప్రభుత్వానికి సూచించినట్లు వార్తలొచ్చాయి. ఇదిలా ఉంటే చైనా అధికార పత్రిక గ్లోబల్ టైమ్స్ కూడా తన తాజా సంచికలో యుద్ధం వల్ల చైనాకే అధిక నష్టమంటూ పేర్కొంది. రెండు దేశాల మధ్య వాణిజ్య వ్యత్యాసం ఏటా 46బిలియన్ డాలర్లుంది. చైనా నుంచి భారత్‌కు ఏటా సుమారు 50బిలియన్ డాలర్ల విలువైన వస్తువులు ఎగుమతి అవుతున్నాయి. అదే భారత్ నుంచి 4బిలియన్ డాలర్ల విలువైన వస్తువుల్ని మాత్రమే చైనా కొనుగోలు చేస్తోంది. అయితే భారత్ నుంచి చైనా దిగుమతి చేసుకుంటున్న వస్తువులు అక్కడి పరిశ్రమలకు అత్యంత కీలకమైనవి. ముఖ్యంగా ఔషధాల తయారీకి అవసరమైన ముడిపదార్థాల్ని చైనా భారత్ నుంచే సమీకరిస్తోంది. వీటి ఎగుమతి నిల్చిపోతే అక్కడ ఔషధ పరిశ్రమ నిస్తేజమౌతుంది. అలాగే భారత్ నుంచి ఇనుపఖనిజం కూడా చైనాకు ఎగుమతి అవుతోంది. చైనా నుంచి భారత్‌కు సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, బొమ్మలు, రసాయనాలు, యంత్ర సామగ్రి, పట్టు, ప్లాస్టిక్, టైర్లు వంటివి దిగుమతౌతున్నాయి. చైనా-భారత్ మధ్య యుద్ధమంటూ వస్తే చైనా మార్కెట్ కుదేలైపోతుంది. ఇది ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందని గ్లోబల్ టైమ్స్ హెచ్చరించింది. ప్రపంచంలో చైనా ఎంతగా ఎంతపెద్ద ఆర్థిక శక్తిగా మారినా భారత్‌ను మాత్రం ఆ దేశం తాకే అవకాశాల్లేవని సైనిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇందుక్కారణం ప్రపంచంలోనే అతివేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న దేశం భారత్. అంతకుమించి అతిపెద్ద సంఖ్యలో మధ్యతరగతి కుటుంబీకులున్న దేశమిది. ఇక్కడి కొనుగోలుశక్తి అపారం. అంతేకాదు.. అందుబాటులో ఉన్న నిధులతో ఎలక్ట్రానిక్స్ పరికరాల్ని కొనుగోలు చేయడంలో భారత్ అగ్రగామిగా ఉంది. వీటిపైనే ఆధారపడి చైనా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకోబట్టే చైనా తరచూ హెచ్చరికలు జారీ చేయడం తప్ప భారత్ సైనికులు దుందుడుకుగా చైనా భూభాగంలోకి చొచ్చుకెళ్ళినా ఆ దేశం మాత్రం నిలకడ విధానాన్నే అనుసరిస్తోందని విశ్లేషిస్తున్నారు.

పసుపు బోర్డు
ఏర్పాటు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

నేతలంతా ప్రధానికి వివరించారు. ప్రధానితో భేటీ అనంతరం పార్లమెంటులో, ఆ తర్వాత తుగ్లక్ రోడ్‌లోని నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. మోడీతో భేటీ వివరాలను వెల్లడించారు. ఎన్నో రంగాల్లో సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ పసుపు పంట సాగులో మాత్రం ఇప్పటికీ వందల ఏళ్ల నుంచి కొనసాగుతున్న పాత విధానాలనే అవలంబిస్తున్నామని కవిత అన్నారు. పసుపు సాగులో సరికొత్త పరిజ్ఞానాన్ని రైతులకు అందజేసే వ్యవస్థ లేకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు. వాణిజ్య పంటగా ఉన్న పసుపును స్పైస్ బోర్డు 54 రకాల సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసుల్లో భాగంగా పేర్కొన్నప్పటికీ, ఈ పంటపై సరైన దృష్టి పెట్టలేదని అన్నారు. పసుపు కేవలం వంటల్లో వాడే పదార్థమే కాదని, పసుపు లేకుండా దేశంలో ఏ శుభకార్యం మొదలవదని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగమైన పసుపు కోసం ప్రత్యేక బోర్డు ఉంటేనే అందరికీ మేలు కలుగుతుందని కవిత వెల్లడించారు. ఇదే విషయాన్ని ప్రధాని మోడీతో చెప్పానని ఆమె తెలిపారు. తాము ప్రస్తావించిన 3 అంశాలపై ప్రధాని సానుకూలంగా స్పందించారని కవిత అన్నారు.

స్పైస్ పార్కు విషయంలో మాట మార్చిన కేంద్రం

స్పైస్ పార్కు ఏర్పాటు విషయంలో కేంద్రం మాట మార్చిందని ఎంపీ కవిత అన్నారు. స్థలాన్ని కేటాయిస్తే స్పైస్ పార్కు ఏర్పాటు కోసం నిధులిస్తామని తొలుత హామీ ఇచ్చిన కేంద్రం, తీరా తాము 42 ఎకరాల భూమిని కేటాయించిన తర్వాత స్కీం లేదంటూ చేతులెత్తేసిందని వివరించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే రూ. 30 కోట్లు కేటాయించి స్పైస్ పార్కు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు.

వరంగల్‌లో స్పైస్ ఏజెన్సీ నెలకొల్పాల్సిందే

స్పైస్ బోర్డు నుంచి 5 ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలన్న నిర్ణయంలో భాగంగా తెలంగాణలో ఒకటి నెలకొల్పాల్సి ఉందని ఎంపీ కవిత తెలిపారు. ఈ క్రమంలోనే వరంగల్‌లో స్పైస్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ నెలకొల్పుతున్నారని ఆమె అన్నారు. వరంగల్‌లో పసుపుతో పాటు మిర్చి వంటి స్పైసెస్ భారీ ఎత్తున సాగు చేస్తున్నారని ఈ సందర్భంగా ఆమె గుర్తుచేశారు. అందుకే అక్కడ స్పైస్ ఏజెన్సీ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని వ్యాఖ్యానించారు. 54 రకాల సుగంధ ద్రవ్యాలు, మసాలా దినుసులు ఉన్న స్పైసెస్ బోర్డు నుంచి ప్రత్యేకంగా పసుపు కోసం బోర్డు ఏర్పాటు చేయడం సాధ్యం కాదని వాణిజ్య వ్యవహారాలు, పరిశ్రమల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేసినప్పటికీ కవిత ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైపెచ్చు తన డిమాండ్‌కు మరిన్ని రాష్ట్రాల నుంచి మద్దతు సేకరించి నేరుగా ప్రధానినే ఒప్పించే ప్రయత్నం చేశారు. ప్రధాని సానుకూలంగానే ఉన్నారని చెబుతున్న కవిత, పసుపు బోర్డు ఏర్పాటుపై ఆశాభావంతో ఉన్నారు. నిజామాబాద్‌లో కాకపోయినా దేశంలో ఎక్కడ ఏర్పాటు చేసినా తమకు అభ్యంతరం లేదని కవిత స్పష్టం చేశారు.



ప్రధాని మోడీతో తెరాస ఎంపీ కవిత సెల్ఫీ

ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్
ఐటీలో టాప్..!

(మొదటిపేజీ తరువాయి)

హెలికాప్టర్ ఉత్పత్తులకు సంబంధించి మూడు కంపెనీలు ఏర్పాటయ్యాయన్నారు. సి-క్యాట్, టాటా సంస్థ పెద్దఎత్తున హెలిక్యాబిన్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించిందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోసం హెలికాప్టర్ క్యాబిన్‌ను ఈ ఎస్ఈజెడ్‌లోనే తయారు చేస్తున్నారని మంత్రి కేటీఆర్ చెప్పారు.

ఇప్పుడు కళ్యాణి గ్రూపు అత్యాధునిక టెక్నాలజీతో అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మరికొన్ని కంపెనీలు ఇక్కడికి వచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నాయన్నారు. హైదరాబాద్‌లో ఉన్న మౌలిక సదుపాయాలను గుర్తించిన సంస్థలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు సముఖంగా ఉన్నాయని కేటీఆర్ అన్నారు. జాయింట్ వెంచర్‌లో నెలకొల్పిన ఈ కంపెనీ అత్యాధునిక టెక్నాలజీని రాష్ట్రానికి తెస్తోందని, ఇది రక్షణ, ఏరోస్పేస్ రంగంలో మరికొన్ని కంపెనీలు వచ్చేందుకు దోహదపడుతుందని ఆయన అన్నారు.

భారత్‌లో ఇజ్రాయిల్ రాయబారి డానియిల్ కార్మన్ మాట్లాడుతూ, ప్రధాని నరేంద్రమోడీ మేక్ ఇన్ ఇండియా నినాదంలో ఇజ్రాయిల్ భాగస్వామ్యం ఉందన్నారు. భారత్‌లో ఇప్పటికే తన దేశానికి చెందిన అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టాయని, సంయుక్త రంగంలో నెలకొల్పుతున్న కంపెనీల ద్వారా పరస్పర పెట్టుబడులు, టెక్నాలజీ మార్పిడికి అవకాశం ఏర్పడిందన్నారు. గత 25 ఏళ్ళుగా తమ రెండు దేశాల మధ్య సంబంధాలు కొనసాగుతున్నాయని, ఇది భవిష్యత్తులో మరింతగా విస్తరించేందుకు దోహదపడుతుందన్నారు.

కళ్యాణి గ్రూప్ చైర్మన్ బాబా ఎం.కళ్యాణి మాట్లాడుతూ, భారత్-ఇజ్రాయిల్ మధ్య రక్షణ రంగంలో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతమవుతున్నాయని ఇటీవల భారత్‌ను సందర్శించిన ఆ దేశ ప్రధాని పేర్కొన్నారని, అందుకు నిదర్శనంగానే ఈ కంపెనీ నిలుస్తుందన్నారు. భారత్‌లో అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్, రిమోట్ వెపన్ సిస్టమ్ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశలో ఈ రెండు దేశాల మధ్య టెక్నాలజీ ఇచ్చిపుచ్చుకునే రీతిలో ఈ కంపెనీ పనిచేస్తుందన్నారు. రక్షణ, ఏరోస్పేస్ రంగంలో మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తుల తయారీ లక్ష్యంగా ఈ యూనిట్‌ను నెలకొల్పినట్లు బాబా కళ్యాణి చెప్పారు.



కేంద్ర మంత్రులతో
కవిత వరుస భేటీలు
నేడు గల్ఫ్ బాధితుల సమస్యలపై సుష్మాతో సమావేశం

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : పసుపు బోర్డు కోసం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కలిసిన నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత అనంతరం వరుసగా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసిన కవిత, ఆ శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన బకాయిల గురించి ప్రస్తావించారు. నిజామాబాద్ నియోజకవర్గం పరిధిలోనే రూ. 314 కోట్లు రావాల్సి ఉందని ఆమె తెలిపారు. అనంతరం జగిత్యాలలో ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర సామాజిక న్యాయ శాఖ మంత్రి జ్యూవల్ ఓరంను కలిశారు. సాయంత్రం 5గంటల సమయంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్‌తో కవిత భేటీ అయ్యారు. జగిత్యాల పట్టణాన్ని అమృత్ పథకంలో భాగంగా చేర్చాలని కోరారు. ఈ విషయంపై గతంలోనే తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు పంపించినప్పటికీ, ఆ పథకంలో చేర్చడానికి తగినంత జనాభా పట్టణంలో లేనందున తిరస్కరించారు. అయితే జిల్లాల పునర్విభజన సమయంలో జగిత్యాల పట్టణ ప్రాంతం పరిధిలోకి మరికొన్ని గ్రామాలను చేర్చడం వల్ల ప్రస్తుతం అమృత్ పథకానికి అర్హత సాధించింది. దీంతో కవిత ఈ విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చి జగిత్యాల పట్టణాన్ని అమృత్ పథకంలో చేర్చాల్సిందిగా కోరారు. అలాగే నిజామాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న 100 ఎకరాల పార్కు కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రెండు విజ్ఞప్తులపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని అనంతరం మీడియాతో మాట్లాడుతూ కవిత వెల్లడించారు.గల్ఫ్ బాధితుల సమస్యలపై విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్‌ను కలవనున్నారు. ఇప్పటికే 35 మంది బాధితులకు సంబంధించి వివరాలను ఆమె సేకరించి సిద్ధం చేసుకున్నారు. ఏజెంట్ల చేతుల్లో మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకుంటున్న భారతీయుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందినవారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బాధితులకు విముక్తి కల్పించే క్రమంలో కవిత సుష్మాతో చర్చించనున్నారు.

ఆ పాపం కాంగ్రెస్‌దే

సింగరేణి కారుణ్య నియామకాలకు న్యాయపరమైన అడ్డంకులు సృష్టిస్తున్న పాపం కాంగ్రెస్ పార్టీదేనని ఎంపీ కవిత అన్నారు. కేంద్ర మంత్రులతో భేటీల అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి చేసిన విమర్శలకు ధీటుగా బదులిచ్చారు. జానా ఆరోపిస్తున్నట్టు కోర్టులో కేసులు వేసిన సతీష్ అనే వ్యక్తి తెలంగాణ జాగృతిలో సభ్యుడు కాదని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శంకర్ ముదిరాజ్‌కు సతీష్‌సన్నిహితుడని ఆమె వివరించారు. "కావాలంటే మీరు చెబుతున్న వ్యక్తి పేరు, చిరునామా, వివరాలు ఇస్తాను. మీ ఆరోపణలు నిరూపించండి" అంటూ కవిత జానారెడ్డికి సవాల్ విసిరారు. టీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ కార్మికుల పక్షమేనని అన్నారు.

రాజకీయ వేడి రగిల్చిన
కేసీఆర్



(మొదటిపేజీ తరువాయి)

గత మూడేళ్ళుగా అప్రతిహతంగా విజయదుందుభి మోగిస్తున్నారు. ఏ ఎన్నిక జరిగినా.. విజయం టిఆర్ఎస్‌కు దాసోహం అవుతుండగా, సిఎం కెసిఆర్ వరుసగా నిర్వహింపజేసే సర్వేల్లోనూ అధికారం టిఆర్ఎస్‌దేనన్న సంకేతాలు న్నాయి. అయితే ఎక్కడా ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా.. టిఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలకు మంచిచేసే ఉద్దేశం, హామీలన్నీ నిలుపుకునే ఉద్దేశం ఉంటే.. విపక్షాలు అందుకు ఆటంకాలు సృష్టిస్తున్నా యని, ఎక్కడైనా హామీల అమల్లో ప్రతిష్టంభన ఏర్పడితే.. అది విపక్షాల తప్పే తప్ప తమ ప్రయత్న లోపం, చిత్తశుద్ధిలోపం కాదన్న అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళారు. 119అసెంబ్లీ స్థానాల్లో వందకు పైగా అసెంబ్లీ స్థానాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్న కెసిఆర్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళు దాటిపోగా.. ఇప్పటిదాకా విపక్షాలు అడపాదడపా కార్యక్రమాలు నిర్వహించడం మినహా.. తాము ప్రత్యామ్నాయం అన్న చర్చను ప్రజల మదిలోకి తీసుకురాలేకపోయాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. ఇకపై కూడా విపక్షాలు ఏమాత్రం కోలుకోకుండా చేయాలని, వారు చేసే వాదనలు వీగిపోయేలా చేయాలని కెసిఆర్ వ్యూహాత్మకంగా విపక్షాలను ఉతికిఆరేశాడని పార్టీవర్గాలు అంటున్నాయి. సిఎం కెసిఆర్ మాట్లాడాక.. ప్రతిపక్షాలు మాట్లాడినా, మంత్రులుగా మేం మాట్లాడినా.. జనంలో ఆనదు.. ఆయన ఇంపాక్ట్ ప్రజల్లో బలంగా ఉంటుంది.. అని ఓ సీనియర్ మంత్రి గురువారం వ్యాఖ్యానించారు. ఈనెల 10న పోచంపాడులో నిర్వహించే బహిరంగసభ ద్వారా మరిన్ని అస్త్రాలు బయటకు తీయనున్న సిఎం.. త్వరలో ప్రజల్లోకి వస్తా.. జిల్లాలు చుట్టేస్తా అని ప్రకటించారు. సిఎం జిల్లాల యాత్రకు శ్రీకారం చుడితే.. క్షేత్రస్థాయి పార్టీలో మరింత జోష్ వస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా దాని ప్రభావం బలీయంగా ఉంటుందని పార్టీవర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

వెంకయ్యకు తెలుగు ఎంపీల సంఘీభావం



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీయే కూటమి తరపున బరిలో దిగిన ఎం. వెంకయ్య నాయుడుకు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్లమెంటు సభ్యులంతా కలిసి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్రంలో బద్ధ విరోధులైనప్పటికీ ఒక తెలుగు నేత ఉప రాష్ట్రపతి కానున్న సందర్భంగా అందరూ కలసికట్టుగా సమావేశమయ్యారు. గురువారం ఉదయం వెంకయ్య నాయుడు నివాసానికి చేరుకున్న ఎంపీలంతా ఆయన్ను కలిసి మద్ధతు ప్రకటించారు.బీజేపీ, తెదేపా , వైకాపా, టీఆర్ఎస్ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అల్పాహార సమావేశం అనంతరం ఎంపీలంతా వెంకయ్య నాయుడుతో కలిసి సరదాగా ఫొటోలు దిగారు.

టక్..టక్... రైలు బండి



ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్న జర్మనీలోని ఈస్ట్ ప్రెషియాలో ఇప్పటికీ గుర్రపు రైలునే స్థానికులు తమ వాహనంగా వాడుతున్న పరిస్థితి ఉంది. కఠినమైన రహదారిలో కూడా పర్యాటకులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఈ గుర్రపు రైళ్లదే కీలక పాత్ర... పాపం గుర్రాలు కదా!

రేపు ఢిల్లీకి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఈ నెల 5న ఢిల్లీలో జరగనున్న జిఎస్‌టి మండలి సమావేశానికి ఆర్థిక మంత్రి ఈటెలకు బదులుగా కెటిఆర్ పాల్గొననున్నారు. వివిధ అంశాలపై తెలంగాణ ప్రభుత్వ వైఖరిని వివరించనున్నారు. గత సమావేవానికి కూడా మంత్రి ఈటెలకు బదులు కేటీఆర్‌జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి హాజరైన విషయం తెలిసందే.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

శుక్రవారం 4 ఆగస్టు 2017

మంచిమాట వృద్ధాప్యం నాటికి ఇప్పుడే ఆదా చెయ్యి. ఉదయం ఎన్నడూ సాయంత్రం దాకా కొనసాగదు కదా. ● బెంజమిన్ ఫ్రాంక్లిన్

భార్గవ పదవులకోసం అధికార గణం చుట్టూ తిరగలేదు. ఆయనలోని విజ్ఞాన ప్రతిభను గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మ భూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలను అందించింది. నిర్మొహమాట వైఖరి వల్ల వ్యక్తిగతంగా చేటు జరిగినా ఆయన లెక్క చేయలేదు. ఆధునిక సమాజంలో పెచ్చు పెరిగిపోతున్న కపట జీవన విధానాన్ని (హిపోక్రసీని) ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఎంత పెద్దవారి ముందైనా సరే తాను చెప్పదల్చుకున్నవి నిర్మొహమాటంగా స్పష్టం చేసేవారు.

మూఢ నమ్మకాలపై గండ్రగొడ్డలి!

శాస్త్రవిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ దేశంలో మూఢనమ్మకాలు పెరిగిపోతున్నాయి. ఎవరినీ బాధపెట్టనంత వరకూ ఎవరి నమ్మకాలు వారికి ఉండటంలో ఇబ్బంది లేదు. పరిశోధనల్లో మునిగితేలే వారికి తమ చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునే వ్యవధి, ఆసక్తి ఉండవు. అంత ఏకాగ్రచిత్తంతో పరిశోధనలు సాగించే వారిలో కూడా సమాజం గురించి ఆలోచించేవారు, సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న అసహన ధోరణులను పారద్రోలాలని కంకణం కట్టుకున్నవారూ ఉంటారు. వారినే మానవతా వాదులంటారు. అలాంటి మానవతా మూర్తి పిఎం భార్గవ మన మధ్యనుంచి వెళ్ళిపోయి అప్పుడే నాలుగు రోజులైంది. ఆయన తొమ్మిది పదులు దాటినా నిరంతరం దేశం కోసం, సమాజం కోసం ఆలోచించారు. హైదరాబాద్‌లో సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) అనే సంస్థను నెలకొల్పడమే కాకుండా, దానికి విశ్వవ్యాప్తంగా ఖ్యాతిని ఆర్జించి పెట్టారు. స్టెమ్ సెల్స్ (మూల కణాల) విభజన, పరిశోధనపై ఆయన ఎంతో పరిశోధన చేశారు. ఆ సంస్థను హైదరాబాద్‌లో నెలకొల్పడం వల్ల నగరానికి అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. విశ్వనగరంగా హైదరాబాద్ అర్హత సంపాదించడానికి ప్రోది చేసిన అంశాల్లో ఇది కూడా ఒకటి. భార్గవ పదవులకోసం అధికార గణం చుట్టూ తిరగలేదు. ఆయనలోని విజ్ఞాన ప్రతిభను గుర్తించే కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ వంటి అత్యున్నత పురస్కారాలను అందించింది. నిర్మొహమాట వైఖరి వల్ల వ్యక్తిగతంగా చేటు జరిగినా ఆయన లెక్క చేయలేదు. ఆధునిక సమాజంలో పెచ్చుపెరిగిపోతున్న కపట జీవన విధానాన్ని (హిపోక్రసీని) ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఎంత పెద్దవారి ముందైనా సరే తాను చెప్పదల్చుకున్నవి నిర్మొహమాటంగా స్పష్టం చేసేవారు. ఆయన తరచూ వెలిబుచ్చిన అభిప్రాయాలను ప్రాతిపదికగా తీసుకుని ఆయన వామపక్షభావజాలం గలవారనే ముద్రవేసినవారు లేకపోలేదు. అయితే, తాను రాజకీయాలకు అతీతంగా మానవాభ్యుదయం గురించే ఆలోచిస్తాననీ, మనిషిలో చాందసభావాలను తొలగించి, వారిలో శాస్త్రవిజ్ఞానం గురించి అవగాహన పెంచడమే తన లక్ష్యమని ఆయన ఒక సందర్భంలో స్పష్టం చేశారు. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెరిగిన అసహన ధోరణులను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు.

హేతువాద దృక్పథాన్ని అందరూ అలవర్చుకోవాలని ప్రబోధించారు. మహారాష్ట్రలో హేతువాద ఉద్యమ నాయకులైన నరేంద్ర దభోల్కర్, గోవింద్ పన్సారే, కర్నాటకలో కుల్బుర్గి హత్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. మతం, నమ్మకాలు మాటను అలా ఉంచి, ప్రజాస్వామిక వ్యవస్థలో అందరి అభి ప్రాయాలకూ చోటుండాలనీ, తమకు అప్రియమైన వాదాలనూ, అభిప్రాయాలను అణగదొక్కడానికి పాలకులు ప్రయత్నిస్తే ప్రతిఘటించేందుకు పౌరులంతా సంసిద్ధం కావాలని ఆయన ఆ సందర్భంలో పిలుపు ఇచ్చారు. హేతువాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆయన ప్రభుత్వం తనకు ఇచ్చిన పద్మభూషణ్ పురస్కారాన్ని వాపస్ చేశారు. ఆ సమయంలో చాలా మంది రచయితలూ, మేధావులూ, శాస్త్రజ్ఞులూ తమ అవార్డులను వెనక్కి ఇచ్చేశారు. అంతేకాక, ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినతర్వాత పాఠ్యప్రణాళిక (సిలబస్)లను మార్చే ప్రయత్నాలు జరిగినప్పుడు వాటిని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రజల్లో మూఢనమ్మకాలనూ, దురాచారాలను వ్యాపింపజేసే పాఠ్యప్రణాళికలను తిరిగి ప్రవేశపెట్టే యత్నాలను ప్రగతిశీల ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఏటా జనవరి నెలలో అఖిలభారత సైన్స్ కాంగ్రెస్ మహాసభలు జరుగుతూ ఉంటాయి. వీటిని ప్రధాని పదవిలో ఎవరుంటే వారు ప్రారంభిస్తూ ఉంటారు. విజ్ఞాన శాస్త్రం మానవ కల్యాణానికి ఉపయోగపడాలని ఉద్బోధలు చేస్తూ ఉంటారు. సైన్స్ కాంగ్రెస్ మహాసభలను ప్రారంభించే కార్యక్రమాల్లో సంప్రదాయరీతులను పాటించడాన్ని భార్గవ వ్యతిరేకించారు. తిరిగి మళ్ళీ మూఢనమ్మకాల వైపు జనాన్ని నడిపించే ప్రయత్నమని ఆయన విమర్శించారు. సమాజంలో అట్టడుగు వర్గాల వారిలో నానాటికీ పెరుగుతున్న అభద్రతా భావాన్ని తొలగించేందుకు పాలకులు కృషి చేయాలే తప్ప, వాటిని పెంచి పోషించే సంస్థలకు వెన్నుదన్నుగా నిలవరాదని ఆయన సంఘ్ పరివార్ సంస్థల ఒత్తిళ్ళకు ప్రభుత్వం లొంగిపోతోందన్న భావం వచ్చేట్టు విమర్శించారు. అంతేకాక, దేశ ప్రజలంతా శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలనడమే కాదు, ఈ పదాలను 42వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చడానికి ఆయన ఎంతో కృషి చేశారు. గౌరవాలు, పురస్కారాల కోసం కాకుండా, మానవుని ఉన్నతే ప్రధాన లక్ష్యంగా ఆయన పలుకార్యక్రమాలను నిర్వహించారు. ఎన్‌డిఏ-1 హయాంలో జ్యోతిష్యాన్ని పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించిన వారిలో ఆయన అగ్రభాగంలో ఉన్నారు. ఆయన మంచి చిత్రకళాభిమాని. తాను నెలకొల్పిన సీసీఎంబీని ఒక చిత్రకళా శాలగా మార్చి అందరి ప్రశంసలు అందుకున్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న ఆర్యోక్తిని తుచ తప్పకుండా ఆచరణలో చూపిన మహోన్నత మానవతా మూర్తి భార్గవ.





New Delhi
24 July, 2017

Dear Pranab Da,

As you begin a new phase of your distinguished journey, I cannot but express my profound sense of admiration and gratitude for your immense contribution to the nation, particularly as President of India over the last five years. You have inspired us with your simplicity, high principles and exemplary leadership.

Three years ago, I came to New Delhi as an outsider. The task before me was huge and challenging. In these times, you have always been a father figure and a mentor to me. Your wisdom, guidance and personal warmth have given me greater confidence and strength.

That you are a repository of knowledge is well known. I have always marveled at your insights on various subjects, ranging from policy to politics, economics to external affairs, and security issues to subjects of national and global importance. Your intellectual prowess has constantly helped my government and me.

You have been so warm, affectionate and caring to me. Your one phone call asking me "I hope you are taking care of your health" was enough to fill me with fresh energy, after a long day at meetings or on a campaign tour.

Pranab Da, our political journeys took shape in different political parties. Our ideologies, at times, have been different. Our experiences are also varied. My administrative experience was from my state, whereas you have seen the expanse of our national polity and politics for decades. Yet, such is the strength of your intellect and wisdom that we were able to work together with synergy.



During your political journey and your presidency, you placed the wellbeing of the nation over everything else. You opened Rashtrapati Bhavan to initiatives and programmes that recognized innovation and the talent of India's youth.

You belong to a generation of leaders for whom politics was simply a means to selflessly give back to society. You stand as a great source of inspiration for the people of India. India will always be proud of you, a President who was a humble public servant and an exceptional leader.

Your legacy will continue to guide us. We will continue to draw strength from your democratic vision of taking everyone along, which you have developed over a long and illustrious public life. As you enter a new phase of your life, I convey my best wishes for your future endeavours.

Thank you once again for your support, encouragement, guidance and inspiration. Thank you for the very kind words you said about me at the farewell in Parliament a few days ago.

Rashtrapati Ji, it has been an honour to work with you, as your Prime Minister!

Jai Hind

Yours sincerely,

(Narendra Modi)

Shri Pranab Mukherjee
The President of India

మీ స్ఫూర్తికి ప్రణామం

మీ ఫోన్‌కాల్ శక్తిని నింపేది
భిన్న సిద్ధాంతాలున్నా అవగాహన అపూర్వం
మాజీ రాష్ట్రపతికి ప్రధాని మోడీ ఉద్వేగభరిత లేఖ

అనుబంధాలు.. ఆత్మీయతలు.. తెచ్చి పెట్టుకుంటే రావు. మనసులో ఉండాలి. అన్నదమ్ముల మధ్యయినా.. ఇతర బంధుత్వాల మధ్యయినా.. మనసుకు హత్తుకునే అనుబంధాలు.. పదవులతో వచ్చే బంధాలను నిర్వచించడం కష్టం. కానీ ఇష్టాఇష్టాలను కని పెట్టి.. ఒకరినొకరు నొప్పించుకోకుండా జాతి శ్రేయస్సే పరమావధిగా సాగితే ప్రభుత్వాధినేతకూ.. ప్రథమ పౌరునికి అంతకుమించి ఏం కావాలి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీల నడుమ అవగాహన ఎంతగా పెనవేసుకుపోయిందో ప్రణబ్ ఈ రోజు చేసిన ట్వీట్ వెల్లడించింది. గతంలో ఎన్నడూ లేని సంప్రదాయానికి తెరలేపిన నరేంద్రమోడీ భవిష్య తరాలకు పెద్దలతో ఎలా మెలగాలో దారిచూపించారు.

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తనకు రాసిన లేఖను ప్రణబ్ ముఖర్జీ ట్విట్టర్‌లో షేర్ చేశారు. ఆ లేఖ పూర్తి పాఠం.. ఎంతో స్ఫూర్తిమంతంగానూ.. అధినేతలు ఎలా మెలగాలో తెలిసే మాదిరిగానూ ఉంది. మోడీ లేఖ తన హృదయాన్ని హత్తుకుందనీ, అత్యంత ఆప్యాయంగానూ, తన పట్ల ఉన్న శ్రద్ధనూ ప్రతిబింబించిందనీ ప్రణబ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇద్దరూ రెండు భిన్న ధృవాలు. భిన్న సిద్ధాంతాలున్న పార్టీల వారు. అయినా ఇద్దరి మధ్య అనుబంధం స్థాయిని ఆ లేఖ తెలిపిందన్నారు ప్రణబ్.

2012 నుంచి 2017వరకూ 13వ దేశాధ్యక్షుడిగా వ్యవహరించిన ప్రణబ్ ముఖర్జీ రాజకీయాల్లో ఆరు దశాబ్దాలున్నారు. రాష్ట్రపతిగా ప్రమాణ స్వీకారానికి ముందు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 81ఏళ్ళ వయసులో రాష్ట్రపతి భవన్‌ను వీడి వెడుతున్నప్పుడు ప్రణబ్ ప్రధానినుద్దేశించి ప్రశంసాపూర్వకమైన వ్యాఖ్యలు చేశారు. సువిశాల భారతదేశంలో కీలకమైన మార్పులను చేయడంలో మీ శక్తి, అనురక్తి అపూర్వమని తెలిపారు. మన ఇద్దరి మధ్య అనుబంధంలోని ప్రియమైన స్మృతులను నాతో తీసుకువెడుతున్నానంటూ పేర్కొన్నారు. నరేంద్రమోడీ చూపిన సుహృద్భావపూర్వక నడవడికను మరువలేనని ప్రణబ్ తెలిపారు.

ప్రణబ్‌కు ప్రధాని మోడీ రాసిన లేఖ..

ప్రియమైన పితృసమానులైన ప్రణబ్‌గారికి,

మీ జీవితంలో విభిన్నమైన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఈ తరుణంలో.. మిమ్మల్ని వారించలేను. కానీ, మీపట్ల నాకున్న అంతులేని ఆప్యాయతను, కృతజ్ఞతనూ వ్యక్తీకరిస్తున్నాను. దేశాభివృద్ధిలో మీ భాగస్వామ్యం తృణీకరించలేనిది. రాష్ట్రపతిగా మీరు గత ఐదేళ్ళుగా చేసిన సేవ ప్రత్యేకమైనది. మీ నిరాండబరత్వం, అత్యున్నత విలువలు, అసాధారణ నాయకత్వ ప్రతిభతో మాకు స్ఫూర్తినిచ్చారు.

మూడేళ్ళ క్రితం నేను అపరిచితుని వలే ఢిల్లీలో అడుగుపెట్టా. నాముందున్న పని అతిపెద్దది, సవాలుతో కూడుకున్నదీ.

ఈ సమయంలో మీరు తండ్రిలా, మార్గదర్శకుడిలా నా వెంట నిలిచారు. మీ ప్రతిభ, మార్గదర్శకత్వం, వ్యక్తిగత ఆప్యాయత నాకు ఎంతో ఆత్మవిశ్వాసాన్నీ, బలాన్నీ ప్ర సాదించాయి. మీరు ఓ విజ్ఞాన భాండాగారం. వివిధ అంశాలపై మీ అంతశ్శీలత నన్ను అబ్బురపరిచేది. విధానపరంగానూ, ఆర్థిక శాస్త్రం నుంచి విదేశీ వ్యవహారాల వరకూ..రక్షణ నుంచి దేశీయ, ప్రపంచ ప్రాముఖ్యతాంశాల వరకూ మీ ప్రతిభ అనన్య సామాన్యం. మీ మేధో సంపత్తి నిరంతరం నాకు, నా ప్రభుత్వానికి సహాయపడింది.

నా పట్ల మీరు ఎంతో ఆప్యాయతనూ, వాత్సల్యాన్నీ, శ్రద్ధనూ చూపారు. సమావేశాలతో అలసిపోయిన రోజున లేదా ప్రచార పర్యటనలో ఉన్నప్పుడు.. నీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటున్నావు కదా అన్న మీ ఒక్క ఫోన్ కాల్ చాలు నాలో పూర్తి శక్తిని నింపేది.

పితృసమానులైన ప్రణబ్ గారూ, మన రాజకీయ ప్రయాణాలు రెండు భిన్నమైన పార్టీలలో సాగాయి. మన సిద్ధాంతలు ఒక్కోసారి పూర్తిగా భిన్నంగా ఉండేవి. మన అనుభవాలలోనూ వ్యత్యాసముంది. నా పాలనానుభవం నా రాష్ట్రానికే పరిమితం. మీరు జాతీయ విధానంలో, రాజకీయాలలో దశాబ్దాలుగా విశేషమైన అనుభవాన్ని గడించారు. మీ మేధస్సు.. ప్రతిభలతో కూడిన బలం కారణంగానే మనమిద్దరం సమష్టిగా పనిచేయగలిగాం.

మీ రాజకీయ ప్రయాణంలోనూ, రాష్ట్రపతిత్వంలోనూ దేశాన్ని అన్ని అంశాల్లో మీరు అత్యంత పటిష్టంగా ఉంచారు. మీ నేతృత్వంలో రాష్ట్రపతి భవన్ సృజనకు, ప్రతిభకూ తలుపులు తెరిచింది. వివిధ కార్యక్రమాలపై చొరవ చూపింది. భారతీయ యువత మనసులను గెలుచుకుంది.

నిస్వార్థంగా సమాజానికి సేవ చేసిన నాయకుల నాటి తరానికి చెందిన వారు మీరు..భారత్‌కు మీరు సర్వదా గర్వకారణం. అణకువతో కూడిన రాష్ట్రపతిగా, మీ నేతృత్వం విలక్షణమైనది. మీరిచ్చిన ప్రోత్సాహాన్నీ, నిర్దేశకత్వాన్నీ, స్ఫూర్తినీ మరువలేను.. అందుకు శతధా కృతజ్ఞుణ్ణి.. మీ వారసత్వం భారత్‌ను నడిపించేందుకు కొనసాగుతుంది.మమ్మల్ని నడిపించడంలో మీ వారసత్వం కొనసాగుతుంది. మీరు కనబరిచిన ప్రజాస్వామ్య దార్శనికత నుంచి మేం బలాన్ని పొందుతూనే ఉంటాం. అందర్నీ కలుపుకుని సాగుతాం.

మీ సుదీర్ఘ, సాహసోపేత ప్రజా జీవితంలో మాకోసం ఎంతో అభివృద్ధి చేసి ఉంచారు. కొత్త జీవన విధానంలోకి అడుగుపెడుతున్న మీకు నా అభినందనలు తెలియచేసుకుంటున్నాను. మీ భవిష్య కార్యక్రమాలు జయప్రదం కావాలని అభిలషిస్తున్నాను.మీరిచ్చిన మద్దతు, ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, స్ఫూర్తికి మరోసారి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. వీడ్కోలు కార్యక్రమంలో మీరు నాపట్ల పలికిన పలుకులకు కృతజ్ఞతలు. రాష్ట్రపతి గారూ! ప్రధానమంత్రిగా మీతో పనిచేయడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను.

జైహింద్

మీ విశ్వసనీయుడు
నరేంద్ర మోడీ

అక్షరాలా కరుణశ్రీ!


నేడు 105వ జయంతి

కరుణశ్రీ! అది కేవలం ఒక కలం పేరు మాత్రమే కాదు. అది కొన్ని దశాబ్దాల పాటు తెలుగు రసజ్ఞ హృదయాలను కరుణ రసప్రవాహాలతో ఆర్ద్ర కవిత్వాలతో ఒక ఊపు ఊపిన జంధ్యాల పాపయ్య, సమాజ అన్యాయాలను, కులాధిక్యతలను చీల్చిచెండాడే ఆధునిక కవికోకిల జాషువాగారి స్ఫూర్తిని పొందిన కవి కరుణశ్రీ, చెళ్ళపిళ్ళ, జాషువా, తుమ్మల, కరుణశ్రీ వంటివారు పద్యకవితా ప్రక్రియలో ప్రజాకవులు. ప్రజాకవి అనే పదం ఆచితూచి వాడవలసినదే మరి. ఆధునిక భావజాలాలకు అనుగుణంగా, సమర శీల ప్రబోధ కవిత్వాలు వ్రాసి అడవుల్లోనో, మైదానాల్లోనో కడు ఇడుములు పడి వ్రాసిన ప్రజాకవులు కొందరు.

అయితే మానవ కల్యాణం వాంఛతో చెడును నిరసిస్తూ, సమాజాన్ని మెత్తపరుస్తూ, మంచిదారులకు మళ్ళించే మరికొందరు ప్రజాకవులూ ఉంటూంటారు. పద్య ప్రక్రియలో మహాకావ్యాలు కొన్ని పక్క పక్కన వస్తున్నా ఖండకావ్య ప్రభంజనం కాలంపై ముద్రలు వేసింది. జాషువా ఖండకావ్యాలు. తుమ్మల రాష్ట్రగానం, విశ్వనాథ ఆంధ్రప్రశస్తి, పాపయ్య శాస్త్రి గారి ఉదయశ్రీ, కరుణశ్రీ వంటి ఖండకావ్యాలు ప్రజలు కొనుగోలు సాహిత్యంలో అనేక ముద్రణలు కోరుకున్నారు. సన్మానాలు, పదవులు వంటివి కవులకు జరగడం, రావడం వంటివి అభిలషణీయాలే. అంతకుమించి తమ కవిత్వాలు ప్రజల నాలుకలపై నృత్యం సాగిస్తుంటే కవిని మించి, కవిత్వం ప్రఖ్యాతిని పొందుతుంటే అంతకుమించిన చరితార్థత ఇంకేముంటుంది కవులకు? కవులలో చరితార్థుడైన కవి కరుణశ్రీ, ఎంతోమంది సామాన్యులు నేను కరుణశ్రీని అని తెలియకుండానే నా ఎదుట నా పద్యాలు అలా అలవోకగా చదివి ఆనందిస్తుంటే నాగుండె తబ్బిబ్బయ్యింది అని గుంటూరులో వారింట్లో కరుణశ్రీ నాతో అన్నప్పుడు ఆయన కళ్ళల్లో వేలాది కళ్ళు ప్రతిఫలించడం చూశాను. ఆయన పుష్పవిలాపం లక్షల ప్రతులు అమ్ముడయ్యాయి. ఆయనకి చెప్పకుండా కొందరు గుజలీ ప్రతులుగా అచ్చువేసి, అమ్ముకుని బాగుపడితే వారిపట్ల కరుణ చూపిన కరుణశ్రీ ఆయన. ఘంటసాల పాడడం వల్లా,కరుణశ్రీ వ్రాయడం వల్లా - పుష్పవిలాపం అంతగొప్పదైందని రసజ్ఞుల్లో చర్చలు రేపిన చిన్న గొప్పకావ్యమది. ఊలు దారాలతో గొంతుకురి బిగించి / గుండెలో నుండి సూదులు గ్రుచ్చి కూర్చి/ ముడుచుకొందురు ముచ్చట ముడులలోన/ అక్కటాదయతోవారు మీ ఆడువారు/ అని పూలు విలపించాయి. ఏడ్చాయి. కరుణశ్రీ తన పుష్పవిలాప రసగుళికల పద్యాలతో లక్షల మంది సామాన్యుల్ని ఏడ్చేలా చేశారు. ప్రేయసి ఏడుపుదో కృష్ణ శాస్త్రి మనల్ని ఏడిపిస్తే, పూలవిలాపంతో కరుణశ్రీ మనల్ని ఏడిపించారు.

అదియొక రమణీయ పుష్పవనం మానవ మందొక మేడ ఇలా సాగిన ఆయన వ్రాసిన కుంతీకుమారి ఘట్టం ఒక చిన్న సినిమా చూపడమే. గొప్పశిల్పం. తేలిక తేలిక మాటలు. రసదృష్టి, భావుకత, ప్రజల కందే పద్య నిర్మాణం ఎలా ఉండాలి అనే ఇంగితజ్ఞానం, ఇన్ని కలసి వెరసి కరుణశ్రీ కవిత్వం, పదలాలిత్య సౌందర్యం. సుకుమారభావ ప్రకటన, సూటి సూటి తెలుగు మాటలు మీటితే వచ్చే నడక అందం - తగిన ఛందం ఇన్నిటి మేళవింపు ఆయన ద్రాక్షాపాక కవిత్వంలో ఇమిడి ఉన్నాయి.

ధనుర్భంగం (సీతాస్వయంవరం) ఘట్టం ఆయన రచన నిర్మాణ దక్షతకు దర్పణం - స్వయంవర సభలో - బారులు తీరి భూపతులు బంగరు గద్దియలందు కూరుచున్నారు వెలుంగు చుండె నయనవర్యుల ముందాక పెద్ద విల్లు / శృంగార మధూక మాలికను గైకొని జానకి చూచువారి మనో రూరగ తండ్రి ప్రక్కనిలుచున్నది ముద్దుల పెండ్లికూతురై వంటి పద్యాలు మనోహర దృశ్యమాలికలు. రాముడు శివధనుస్సు విరిచాడు, సీత మనసు గెలిచాడు. అప్పుడు సిగ్గు బరువున శిరము వంచినది ఒక్క/ సీతయే కాదు సభలోని క్షితివరులును అన్నారు.రాజులు ధనుస్సు ఎక్కుపెట్టలేక పోయామనే అవమానంతో శిరస్సు వంచారు. సీతసిగ్గు శ్రీరామ వరదర్శనపు సిగ్గు - ఇలా ఒకటా రెండా పద్యాలు! ఎన్ని ఖండికలు! ఎన్ని దృశ్యాల కథారస పేటికలు. ఓసారి ఒక అర్జంటుగా చేరవలసిన కవరు శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు కేరాఫ్ సన్నిధానం నరసింహశర్మ, శ్రీ గౌతమీ గ్రంథాలయం రాజమహేంద్రవరం చిరునామాకు కరుణశ్రీ పంపించారు. గురువుగారి ఉత్తరం నా కేరాఫ్‌కు పంపినందుకు మొగమాటపడి కేరాఫ్‌ను కొట్టివేసి కవరు మధునాపంతుల వారికిస్తే ఆయన నా కేర్‌ను నువ్వు తీసుకుంటావని జంధ్యాల వారు పంపిస్తే కేరాఫ్‌ను



కొట్టి వేసి కేర్‌లెస్‌గా ప్రవర్తిస్తావా అని చమత్కరించారు. ఒక తరగని ప్రజాకవిత్వ రసధుని, భావాల గని కరుణశ్రీ. మలపుతట్టల్ని మోసుకువెళ్ళే పాకీ మహిళను ప్రక్కకు తొలగని రిక్షాలో వెళ్ళి ఆయన ఆమెనంటే అతడు కుక్షిస్థం బహు కుళ్ళెరుంగడు.. ఓ పాకీ మహిళా నీ బాకీ అతను తీర్చలేడు. నీవు జగదంబవమ్మా అని మానవత్వం పరిమళించే కవిత వ్రాసిన సామాన్యులకు చెందిన మహాకవి ఆయన. అక్షరాలా ఆయన కరుణశ్రీ. ఆయన గూర్చి డాక్టర్ డి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం సాధికార పరిశోధనా గ్రంథం వంటివి వెలికి వస్తే ఆయన జీవితం, కవిత్వాల లోతులు మరిన్ని తెలుస్తాయి.

-సన్నిధానం నరసింహ శర్మ
9292055531

పాఠకీయం

క్విట్ ఇండియా సబ్సిడీ కట్ ఇండియా

ప్రధాని తన ప్రసంగంలో పేదరికానికి, అవినీతికి, కులతత్వానికి క్విట్ ఇండియా అని చెబుదామన్నారు. కానీ ఆచరణలో మాత్రం పేదలకు సబ్సిడీ కట్ ఇండియా అమలు చేస్తున్నారు. దశల వారీగా వంట గ్యాస్‌పై ఇస్తున్న రాయితీని ఎత్తివేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజావ్యతిరేక చర్య. అర్హులైన పేదలకు వంట గ్యాస్‌ని రాయితీ ధరకే ఇవ్వడం దయాదాక్షిణ్యాలకు సంబంధించిన విషయం కాదు. అది ప్రభుత్వపు కనీస బాధ్యత. తద్వారా వంట చెరుకు భారం తగ్గి పర్యావరణ రక్షణకి, పొగ ద్వారా వచ్చే ఊపిరితిత్తుల వ్యాధులు తగ్గి ప్రజారోగ్యానికి వెరసి సమాజానికి పరోక్షంగా లాభం చేకూరుతుంది. రాయితీ ఉపసంహరణతో పైకి ఖజానాకు కొంత చిల్లర మిగులుతున్నట్టు కనిపించినా వాస్తవానికి ఎంతో భారంపై కారణాలతో. కాబట్టి ఇది ఏరకంగా చూసినా అవివేక చర్య ఇప్పటికే ఆర్థిక భారంతో కుదేలవుతున్న సామాన్యుణ్ణి మరింతగా ధరలతో క్రుంగదీసి, దేశాన్ని ముందుకెలా పరుగులు పెట్టిస్తారో, పేదరికమా, క్విట్ ఇండియా అని ఎవరితో అనదల్చుకొంటున్నారో ప్రధాని స్పష్టం చేయాలి. అప్పులతో, ఆకలితో మూడొంతుల ప్రజానీకం అల్లాడుతుంటే ప్రభుత్వం చెయ్యాల్సిన మొదటి పని పేదలకు అన్ని నిత్యావసర వస్తువుల ధరలు తక్కువ ధరలలో ఉండేలా చర్యలు తీసుకోవడం. అంతే కానీ ఒక్కొక్క రాయితీని రద్దు చెయ్యడం కాదు.

-డా. డి.వి.జి.శంకరరావు, మాజీ ఎంపీ, పార్వతీపురం

6.6 కోట్ల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం

● సింగరేణి జీఎంలకు చైర్మన్ శ్రీధర్ ఆదేశం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సింగరేణి సంస్థ ఈ ఏడాది నిర్దేశించుకున్న 660 లక్షల టన్నుల బొగ్గుఉత్పత్తి, రవాణా సాధించడానికి ప్రతీగని, ప్రతీ ఏరియా లక్ష్యాలు తమకు కేటాయించిన లక్ష్యాలను సాధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సింగరేణి చైర్మన్ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. ఆరు జిల్లాల్లోని 11ఏరియాల జనరల్ మేనేజర్లతో గురువారం సింగరేణి చైర్మన్ సమీక్ష జరిపారు. సింగరేణి భవన్‌లో ఈ సమీక్షా సమావేశం జరిగింది. బొగ్గు ఉత్పత్తితో పాటు బొగ్గురవాణాకు కూడా ప్రాధాన్యతనిస్తూ నిర్దేశిత లక్ష్యాలు సాధించాలన్నారు. ఏరియాల వారీగా ఒక్కొక్క జిఎంతో ఆయన సమీక్ష నిర్వహించి లక్ష్యాల సాధనకు గల అవరోధాలు, వాటి పరిష్కారాల గురించి డైరెక్టర్లతో అప్పటికపుడే చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఏడాది రాష్ట్రం నుండే కాక ఇతర రాష్ట్రాల విద్యుత్ కర్మాగారాల నుండి సింగరేణి బొగ్గుకు మంచి డిమాండ్ వచ్చిందన్నారు. దీనిని అందుకోవడానికి పూర్తిస్థాయిలో ప్రయత్నం జరగాలని, వినియోగదారులకు ఒప్పందాల ప్రకారం బొగ్గు అందించేందుకు కృషి చేయాలన్నారు. తెలంగాణ హరితహారంలో కోటిమొక్కలు నాటాలన్న సింగరేణి లక్ష్యాన్ని అనతికాలంలోనే అధిగమించేందుకు తగిన కృషి చేయాలన్నారు. ఇప్పటివరకు సుమారు 45లక్షల మొక్కలు నాటడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో చైర్మన్‌తో పాటు డైరెక్టర్ (పా) పవిత్రన్ కుమార్, డైరెక్టర్ (పిఅండ్ పి) భాస్కర్ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్.చంద్రశేఖర్, డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎస్‌శంకర్, ఈడి ఎన్‌శ్రీనివాస్, జీఎం మార్కెటింగ్ కిషన్‌రావు, జీఎం (సిపిపి) ఆంథోనిరాజా, జీఎం (సిఎన్‌సి) రాజేశ్వర్ రెడ్డితో పాటు 11ఏరియాల జిఎంలు పాల్గొన్నారు.

గొర్రెలు, చేపల పెంపకంపై
మంత్రివర్గ ఉపసంఘం భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : గొర్రెలు, చేపల పెంపకం పై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం సచివాలయంలో భేటీకాబోతుంది. ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెలు, చెరువుల్లో విడిచిన చేపపిల్లల అంశం పై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై పలు కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇప్పటికే జిల్లా కలెక్టర్లతో సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గత సంవత్సరం 3,939 చెరువులు, రిజర్వాయర్లలో 27 కోట్ల చేప పిల్లలను వేయడం జరిగింది. గొర్రెల పెంపకం దారులకు 75 శాతం సబ్సిడీపై ఒక యూనిట్‌కు 21 గొర్రెల చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు పంపిణీ చేసిన గొర్రెల పరిస్థితి, చేప పిల్లల ఎదుగుదల తదితర అంశాలు చర్చించి రాబోవు కాలంలో జరగాల్సిన పంపిణీ పై కీలక నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉంది. ఈ సంవత్సరం 24,200ల చెరువుల్లో 70 కోట్ల చేప పిల్లలను విడుదల చేయడం జరుగుతుందని మంత్రి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

అధికార పార్టీ పెద్దల అండతోనే
భాగ్యనగరంలో అక్రమ హోర్డింగులు

● మూడేళ్లలో 4 కోట్ల నష్టం: జేఏసీ చైర్మన్ కోదండరాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రభుత్వంలోని పెద్దల కనుసన్నల్లోనే నగరంలో అక్రమ హోర్డింగ్‌లు వెలిశాయని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ పేర్కొన్నారు. అనుమతి లేని హోర్డింగ్‌ల వల్ల జీహెచ్‌ఎంసీకి ఏటా రూ. 1.50 కోట్లు నష్టం వస్తోందని, ఈ మూడేళ్లలో రూ. 4 కోట్ల నష్టం వచ్చిందని ఆయన వివరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. నగరంలో దాదాపు 2 వేలకు పైగా అనుమతి హోర్డింగ్‌లు ఉన్నాయన్నారు. అనుమతి ఉన్న హోర్డింగ్‌లో కూడా సైజ్‌ను పెంచి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. హోర్డింగ్‌ల వల్ల జరుగుతున్న నష్టాన్ని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటి జీహెచ్‌ఎంసీ దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేకుండా పోయిందని, చివరకు కోర్టులు మొట్టికాయలు వేసినా అధికారుల్లో చలనం లేదన్నారు. ప్రకాశ్ ఆర్ట్స్ పేరుతో నడుస్తున్న సంస్థ వల్లే ఏటా రూ. లక్షల నష్టం వస్తోందన్నారు. ఈ సమావేశంలో టీజేఏసీ కన్వీనర్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, భైరీ రమేశ్, తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటి నాయకులు హరి, శ్యాంసుందర్ మాట్లాడారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


● ప్రభుత్వ కార్యదర్శి బుర్రా వెంకటేశం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన మూడవ స్టూడెంట్స్ ఒలింపిక్స్ ఇంటర్నేషనల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి తిరుపతి నాయక్ జూడో విభాగంలో గోల్డ్ మెడల్ సాధించినందుకు తెలంగాణ టూరిజం, క్రీడాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అభినందించారు. తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించడమే లక్ష్యంగా సాగాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. తిరుపతినాయక్ భవిష్యత్ క్రీడాపోటీలలో పాల్గొనేందుకు అవసరమైన సాయం అందించాలన్న విజ్ఞప్తికి వెంకటేశం సానుకూలంగా స్పందించారు.

గిద్దలూరు ఎమ్మెల్యేపై
కేసు ఉపసంహరణ లేదు

● హైకోర్టుకు నివేదించిన ఏపీ ప్రభుత్వం



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ప్రకాశం జిల్లా, గిద్దలూరులోని అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో శుక్రవారం జరగనున్న విచారణలో ఎమ్మెల్యే ఎం. అశోక్ రెడ్డిపై నమోదైన కేసును విరమించబోమని ఏపీ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది కృష్ణప్రకాశ్ హైకోర్టుకు హామీ ఇచ్చారు. కోర్టుకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఎమ్మెల్యేపై కేసును ఉపసంహరించుకుంటే ఏం చేయాలో తమకు తెలుసని హైకోర్టు హెచ్చరించింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా వేసింది. పోలీసు జీపు తగులబెట్టడం, అధికారిక విధులకు ఆటంకం కలిగించారనే కారణంతో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డిపై 2014లో జులై1న గిద్దలూరు పోలీస్ ఠాణాలో కేసు నమోదు అయింది. ప్రస్తుతం ఆ కేసును గిద్దలూరు కోర్టు విచారణ జరుపుతోంది. ఎమ్మెల్యేపై కేసును ఉపసంహరించుకోవాలని స్థానిక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ని ఆదేశిస్తూ గత మే 9న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ...గిద్దలూరు కు చెందిన మాజీ సైనిక ఉద్యోగి షేక్ మస్తాన్ వలీ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది నాగూరు నాగరాజు వాదనలు వినిపిస్తూ కేసు ఉపసంహరణకు గల కారణాలను ప్రభుత్వం ఆ జీవోలో పేర్కొనలేదన్నారు. కేవలం రాజకీయ కారణాలతో కేసును ఉపసంహరించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీనికి ఏపీ ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది బదులిస్తూ..ఈ కేసు వ్యవహారంలో ఎమ్మెల్యే పాత్ర అతి స్వల్పమేనని విన్నవించారు. పైగా ఏపీపీ అభిప్రాయం తీసుకున్న తర్వాతే జీవో జారీ చేసినట్లు నివేదించారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ ..ప్రజాప్రతినిధులపై కేసుల ఉపసంహరణకు సంబంధించి సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాల వ్యవహారంలో ఇటీవల ఆంగ్ల పత్రికల్లో వచ్చిన వార్తలను చూసినట్లు ధర్మాసనం గుర్తు చేసింది.

తెలుగు వర్సిటీలో ప్రశ్నపత్రం లీక్

● ఎం.ఫిల్, పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో ముందుగానే బయటకు వచ్చిన వైనం ● ఆందోళనకు దిగిన విద్యార్థులు-ఓఎమ్మార్ సీట్లు దగ్ధం ● లీకేజీపై త్రిసభ్య కమిటీ ఏర్పాటు ● జర్నలిజం విభాగంలో ఇద్దరు అధ్యాపకుల మధ్య గొడవే రాద్ధాంతానికి కారణమా? ● పరీక్ష రద్దుకు విద్యార్థుల పట్టు ● పరిణామాలపై సర్కార్ సీరియస్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగంలో అక్రమాలు చోటుచేసుకున్న సంఘటన మరవక ముందే హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గురువారం నిర్వహించిన ఎం.ఫిల్ పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం బయటకు పొక్కింది. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగడంతో పాటు పరీక్షను రద్దుచేసి ప్రశ్నాపత్రం లీకేజీకి కారకులైన వారిపై కేసులు నమోదు చేయాలని పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సంఘటనపై విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ విచారణకు ఆదేశించారు. ముగ్గురు ఆచార్యులతో కమిటీని నియమించి ప్రశ్నాపత్రం లీకేజీపై విచారణ జరిపించాలని ఆదేశించారు.

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వివిధ కోర్సుల్లో ఎం.ఫిల్, పీహెచ్‌డీలో ప్రవేశాలకు గురువారం ఉదయం రీసెర్చ్ మెథడాలజీ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు హాజరైన ఓ విద్యార్థి తన ఎడమ చేతిపై కొన్ని ప్రశ్నలకు జవాబులు రాసుకుని వచ్చారు. ఇది గమనించిన పరీక్ష నిర్వాహకులు ఆ విద్యార్థిని నిలబెట్టి బయటకు పంపే ప్రయత్నం చేశారు. సదరు విద్యార్థి విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం కంప్యూటర్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ప్రవేశ పరీక్షకు హాజరైనట్టు తెలుస్తోంది. ఈ విభాగం ద్వారానే ప్రశ్నాపత్రం పరీక్షకు ముందే బయటకు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. కంప్యూటర్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి పరీక్షకు హాజరవుతుంటే ఆయనపై విశ్వవిద్యాలయం నిఘా పెట్టలేదని ఇదే అదునుగా భావించిన సదరు ఉద్యోగి ముందుగానే ప్రశ్నలను తెలుసుకుని వాటికి తన ఎడమ చేతిపై జవాబులు రాసుకుని వచ్చినట్టు తెలుస్తోంది. ఎక్కడా అనుమానం రాకుండా ఆ ఉద్యోగి ఫుల్‌చొక్కాను ధరించి వచ్చాడని అధికారులు అంటున్నారు. విశ్వవిద్యాలయంలోని జర్నలిజం విభాగంలో ఇద్దరు ఆచార్యుల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఉంది. ఈ ఇరువురు ఆచార్యుల మధ్య గత పదిహేనేళ్లుగా వైరం ఉన్నట్టు తెలుస్తోంది. ఇందులో ఒక అధ్యాపకుడు విశ్వవిద్యాలయంలో కీలక పదవిలో ఉండగా, మరొకరు పరీక్షల విభాగంలోని కంప్యూటర్ సెల్‌కు ఇన్‌ఛార్జిగా ఉన్నారు. కంప్యూటర్ సెల్‌లో ఉద్యోగిగా పనిచేస్తూ ఎం.ఫిల్, పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షకు హాజరైన అభ్యర్థి తాను పనిచేసే విభాగానికి ఇన్‌ఛార్జిగా ఉన్న అధికారితో అత్యంత సన్నిహితంగా ఉండేవాడని, తనకు పరీక్షలో వచ్చే ప్రశ్నలు ముందే తెలుసుకున్న ఆయన వాటికి జవాబులు రాసుకుని వచ్చాడని ప్రచారం జరుగుతోంది. తనతో వైరం ఉన్న అధ్యాపకుడిని ఎలాగైనా దెబ్బ తీయాలన్న ఉద్దేశంతో ఉన్నత పదవిలో ఉన్న మరో అధ్యాపకుడు పరీక్షా కేంద్రంలోకి వచ్చి జవాబులు రాసుకొచ్చిన ఉద్యోగిని నిలబెట్టి ఆయనపై దుర్భాషలాడినట్టు ప్రచారం జరుగుతోంది. పరీక్షహాలులో ఓ విద్యార్థిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మరో అధ్యాపకుడు చెప్పడంతో ఇరువురి మధ్య మాటామాట పెరిగినట్టు సమాచారం.

గత ఏడాది ఉపకులపతిగా నియమితులైన సత్యనారాయణకన్నా ముందే జర్నలిజంలోని అధ్యాపకుడు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. తన విభాగంలో పనిచేస్తున్న ఇరువురి మధ్య సఖ్యత లేకపోవడం, ఒకరంటే మరొకరికి గిట్టకపోవడంతో విశ్వవిద్యాలయంలో పరిస్థితి దయనీయంగా మారినట్టు విద్యార్థులు చెబుతున్నారు. ఉపకులపతిని ఇబ్బంది పెట్టేందుకే ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారం జరిగిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాగా, ఉపకులపతి ఏర్పాటు చేసిన విచారణ కమిటీ గురువారం సాయంత్రం 5 గంటలకు తమ నివేదికను అందజేసింది. పరీక్షలో ఎటువంటి అక్రమాలు జరగలేదని జవాబులు తన చేతిపై రాసుకువచ్చిన అభ్యర్థిని విచారించగా ఆయన కేవలం ఐదు ప్రశ్నలు మాత్రమే జవాబులు రాసుకువచ్చినట్టు తెలిసింది. దీంతో పరీక్షను రద్దు చేయవలసిన అవసరం లేదన్న అభిప్రాయానికి అధికారులు వచ్చినట్టు సమాచారం. పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీలో జరిగిన విధంగానే గత నెల వరంగల్‌లోని కాకతీయ వర్సిటీ పీహెచ్‌డీ పరీక్షలో అవకతవకలు జరిగాయి. దీంతో విద్యార్థులు ఉపకులపతి కార్యాలయంపై దాడిచేసి ఫర్నీ చర్‌ను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో వరుసగా సంఘటనలు చోటు చేసుకుంటుండడంతో ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్టు సమాచారం. అక్రమాలు జరగడానికి గల కారణాలను అన్వేషించాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఇప్పటికే ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన రంజీవ్ ఆర్.ఆచార్యను ఆదేశించినట్టు సమాచారం.

వర్సిటీలోని ఇద్దరు అధ్యాపకుల మధ్య ఉన్న గొడవవల్లే ఎం.ఫిల్, పీహెచ్‌డీ పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ప్రచారం ఉందని భావిస్తున్నారు. కాగా కలకలం రేపిన ప్రశ్నాపత్రం లీకేజీ అంశంపై ఉపకులపతి విచారణ కమిటీని నియమించినా విద్యార్థులు మాత్రం శాంతించడం లేదు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తియే మాస్ కాపీయింగ్‌కు పాల్పడడం, ప్రశ్నాపత్రాన్ని ముందే తెలుసుకుని వాటికి జవాబులు రాసుకుని రావడం వెనక వర్సిటీ అధికారుల హస్తం ఉందని ఆరోపిస్తున్నారు. పరీక్షను రద్దు చేయకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఉపకులపతి పరీక్షను వాయిదా వేయడం కాదని, రద్దుచేసి తాజాగా తేదీలను ప్రకటించి తిరిగి పరీక్షను జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్ల నిర్మాణాలన్నీ రేరాలోకే

● జీవో జారీ చేసిన సర్కార్


● బిల్డర్ల అక్రమాలకు చట్టంతో చెక్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రియల్ ఎస్టేట్ రంగంలో జరుగుతున్న మోసాలకు రాష్ట్ర ప్రభుత్వం ముకుతాడు వేసేందుకు రేరా చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ మేరకు గురువారం జీవో 202ను జారీ చేసింది. తాజాగా వచ్చిన రేరా చట్టం ప్రకారం కొత్తగా ఏర్పాటు చేసే లేఅవుట్లు, 500 చదరపు మీటర్ల కన్నా ఎక్కువ వైశాల్యంలో నిర్మించే అపార్టుమెంట్ల నిర్మాణాల వివరాలను రేరా అథారిటీలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేస్తుంది. ఈ చట్టంలో అనేక నిబంధనలను పొందుపరిచింది. ముఖ్యంగా కొనుగులు దారులు ఎలాంటి మోసాలకు గురికాకుండా ఉండేందుకు పకడ్బంది చర్యలు తీసుకుంది. కొనుగోలుదారులతో కుదుర్చుకున్నఒప్పందాలకు బిల్డర్లు కట్టుబడి ఉండాలి. అలాగే సొమ్ము తీసుకుని కూడా అనుకున్న సమయానికి ఇంటిని అందించకపోతే మాత్రం బిల్డర్లు తీవ్ర పరిణామాలను ఎదుర్కొనాల్సి ఉంటుంది. ఈ అలస్యానికి ప్రతిగా బిల్డర్ కొనుగోలు దారు ఇచ్చిన సొమ్ముకు రెండు శాతం చొప్పున వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. ఇక భవన నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడం వంటి మోసాలకు పాల్పడితే సదరు బిల్డర్‌కు జరిమానతో పాటు మూడేళ్ళు జైలుశిక్ష కూడా పడే అవకాశం ఉంటుంది. పైగా డెవలపర్లు సంబంధిత ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతాను విధిగా తెరవాల్సి ఉంటుంది. కొనుగోలుదారుల నుంచి వచ్చే మొత్తంలో 70 శాతం ఆ ప్రాజెక్టు కోసం వినియోగించాల్సి ఉంటుంది. అలాగే ఒప్పందం ప్రకారం గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలి. సదరు ప్రాజెక్టుపై వెచ్చించాల్సిన నిధులను డెవలపర్లు ఇతర ప్రాజెక్టులకు మళ్ళీస్తే జరిమానాను ఎదుర్కొనాల్సి ఉంటుంది. అన్ని రకాల అనుమతులు తీసుకున్న తరువాతనే ప్రాజెక్టును ప్రారంభించాల్సి ఉంటుంది. అనుమతులు తుదిదశలో ఉన్నట్లు చెబుతూ డబ్బులు తీసుకున్న తరువాత కొనుగోలుదారులను మోసం చేసే అవకాశం ఉండదు. నిర్మాణంలో ఏవైనా మార్పులు, చేర్పులు చేయాల్సి వస్తే మూడింట రెండువంతులు కొనుగోలుదారుల ఆమోదం తప్పనిసరి. వారి అనుమతి లేకుండా బిల్డర్ ఎలాంటి మార్పులు చేయడానికి వీలులేదు. అలాగే ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతీది వెబ్‌సైట్ అబ్‌డేట్ చేయాలి. దీంతో కొనుగోలు దారుడు తమ ఫ్లాట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఈ రేరా చట్టం ద్వారా కల్పించింది.

ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్లకు మాత్రం రేరా చట్టం వర్తించదు. ఇవన్నీ గత నిబంధల మేరకు నిర్మాణం అవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వాటికి మినహాయింపు నిచ్చింది. అలాంటి నిర్మాణాలు గ్రేటర్ పరిధిలోనే సుమారు వెయ్యివరకు ఉన్నట్లు అధికారులు రమారమిగా భావిస్తున్నారు. అయితే పూర్తి లెక్కలు ఇంకా తేలాల్సి ఉంది. కొత్తగా తీసుకు వచ్చిన ఈ రేరా చట్టంతో ప్రస్తుతం కొనసాగుతున్న బిల్డర్ల అక్రమాలకు చెక్ పడుతుందా? లేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి తిరిగి పాత పద్ధతిలోనే కొనుగోలుదారులను మోస్తాం చేస్తారా? అన్న విషయం తేలాలంటే కొంత కాలం పాటు వేచి చూడాల్సిందే. కనీసం రేరాతోనైనా తమకు భరోసా లభిస్తుందన్న ధీమా కొనుగోలుదారుల్లో వ్యక్తమవుతోంది.

ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా
పాపిరెడ్డి కొనసాగింపు

● వైస్ చైర్మన్లుగా ప్రొ. లింబాద్రి, ప్రొ. వెంకటరమణ ● కార్యదర్శిగా డా. శ్రీనివాసరావు ● ఉత్తర్వులు జారీ



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా ఆచార్య తుమ్మల పాపిరెడ్డిని కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు చైర్మన్‌గా కొనసాగిన ఆయనకు మరో దఫా అవకాశం కల్పించారు. వైస్ చైర్మన్-1 గా ప్రొఫెసర్ లింబాద్రి, వైస్ చైర్మన్-2గా ప్రొఫెసర్ వై వెంకటరమణను నియమించారు. ఉన్నత విద్యా మండలి కార్యదర్శిగా ప్రస్తుతం కార్యదర్శిగా కొనసాగుతున్న డాక్టర్ ఎన్ శ్రీనివాసరావును తిరిగి నియమించారు. ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు భౌతికశాస్త్రంలో పిహెచ్‌డీ చేశారు. వైస్ చైర్మన్-1గా ఉన్న ప్రొఫెసర్ లింబాద్రి ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ఓఎస్‌డిగా పనిచేస్తున్నారు. గతంలో తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖలో ఆచార్యులుగా 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వైస్ చైర్మన్-2గా నియమితులయిన ప్రొ. ఎదుల్ల వెంకటరమణ ఉస్మానియా యూనివర్సిటీ మాజీ వీసీగా పనిచేసి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్‌గా పనిచేసిన ప్రొఫెసర్ వై రామకిష్టయ్య తనయుడు. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబా ద్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ శాఖలో డీన్‌గావ్యవహరిస్తున్నారు.నల్గొండజిల్లాకు చెందిన ప్రొ.వెంకటరమణ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్‌గా గత 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు.

త్వరలో కిరోసిన్ సబ్సిడీకి మంగళం?

రాయితీ ఎత్తివేతకు కేంద్రం యోచన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వం కిరోసిన్ పై సబ్సిడీని ఎత్తివేసే అలోచనలో ఉంది. ఇప్పటికే వంట గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీలో కోత విధించింది. మార్చి 2018 నాటికి వంటగ్యాస్ సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయాలని భావిస్తుంది. ఈ వ్యూహంలో భాగంగానే సబ్సీడీ వంటగ్యాస్ సిలిండర్ ధర ప్రతి నెల రూ. 4ల చొప్పున పెంచాలని జూలై 31న కేంద్ర ప్రభుత్వం చమురు కంపెనీలను ఆదేశించింది. అంతకు ముందే సబ్సిడీ చక్కెరను నిలిపివేసింది. కేంద్ర నిర్ణయంతో తెలంగాణతో పాటు మరి కొన్ని రాష్ట్రాలు చౌక ధరల దుకాణాల ద్వారా చక్కెర సరఫరాను నిలిపివేశాయి. కిరోసిన్‌పై సబ్సిడీని ఎత్తివేసే అంశంపై చమురు శాఖ కసరత్తు చేస్తుంది. ఇంధనాల మార్కెట్ ధరలను సమాజంలోని పేద వర్గాలకు అనుగుణంగా ఉండేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే కిరోసిన్ పై సబ్సిడీని ఎత్తి వేయబోతుందని తెలుస్తోంది. సబ్సిడీ కిరోసిన్ ధరలను ప్రతి 15 రోజులకు 25 పైసల చొప్పున పెంచాలని చమురు కంపెనీలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. పూర్తిగా సబ్సిడీలు తొలగించేంత వరకు లేదా తదుపరి ఆదేశాలు అందేంత వరకు ఈ ఆదేశాలను అమలు జరపాలని కోరింది. వినియోగ వస్తువుల ధరలను మార్కెట్ ధరల స్థాయికి తేవడానికి ప్రభుత్వం సబ్సిడీలలో కోత పెడుతుంది. కిరోసిన్ వినియోగదారులు ఎల్పిజీకి మారడానికి కూడా కిరోసిన్ పై సబ్సిడీ ఎత్తివేత దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు. కిరోసిన్‌పై సబ్సిడీ అమలవుతున్నప్పటికీ డిమాండ్ భారీగా తగ్గిందని చమురు కంపెనీల ప్రతినిధులు పేర్కొన్నారు. 2016 -17 ఆర్థిక సంవత్సరం కాలంలో కిరోసిన్ వినియోగం 66 శాతం క్షీణించిందని వెల్లడించారు. దాదాపు 78,447 లీటర్ల కిరోసిన్ కొనుగోలు పడిపోయిందన్నారు. ప్రస్తుతం ఢిల్లీ, చండీగడ్‌లు కిరోసిన్ రహిత నగరాలుగా ఉన్నాయి. రాబోవు కొద్ది రోజుల్లోనే హైదరాబాద్‌తో పాటుగా దేశంలోని అన్ని మహానగరాలను కిరోసిన్ రహిత నగరాలుగా మార్చబోతున్నారు.

కాకినాడకు 6 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాచిగూడ - కాకినాడ మధ్యన ఆరు ప్రత్యేక రైళ్లను నడిపించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. ఈ ప్రత్యేక రైళ్లు కాచిగూడ నుండి ఈ నెల 10, 12 తేదీల్లో బయలుదేరుతాయి. తిరుగు ప్రయాణంలో కాకినాడ నుండి 11, 13 తేదీలలో బయలుదేరి మరుసటి రోజు కాచిగూడకు చేరుకుంటాయి. అదే విధంగా ఈ నెల 14న కాచిగూడ నుండి బయలుదేరే ప్రత్యేక రైళ్లు మరుసటి రోజు కాకినాడకు చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలో కాకినాడ నుండి 15వ తేదీన బయలుదేరి మరుసటి రోజు కాచిగూడకు చేరుకుంటాయని తెలిపారు. మార్గమధ్యలో మల్కాజిగిరి, నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో నిలుపుదల చేస్తారు. ప్రత్యేక రైళ్లకు 20 కోచ్‌లు ఉంటాయి. ఒక ఏసీ టూ టైర్, మరో త్రి టైర్ ఏసీ బోగి కూడా ఉంటుంది. ప్రత్యేక రైళ్లను సద్వినియోగం చేసుకోవాలని ప్రయాణికులకు రైల్వే విజ్ఞప్తి చేసింది.

హైదరాబాద్ - నర్సాపూర్ వేళల్లో స్వల్ప మార్పులు

హైదరాబాద్ - నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు విజయవాడ - నర్సాపూర్ మధ్య ప్రయాణం చేసే వేళల్లో స్వల్ప మార్పులు చేశారు. ఈ మార్పు వెంటనే అమలులోకి వస్తుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. హైదరాబాద్ - నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం విజయవాడకు 4.35 చేరుకొని 4.50 గంటలకు బయలుదేరుతుంది. ఇప్పటి వరకు విజయవాడకు 4.25చేరుకొని 4.40 గంటలకు బయలుదేరేది. ఈ మార్పును గమనించాలని దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికులకు విజ్ఞప్తి చేసింది. అదే విధంగా ఇక మీదట గుడివాడకు 5.40లకు చేరుకొని 5.42 గంటలకు బయలుదేరుతుంది. అన్ని స్టేషన్లల్లో ఒకనిమిషం తేడాతో రావడం, బయలుదేరుతాయని ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపీలో భారీగా యురేనియం

● లోక్‌సభలో కేవీపీ ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక జవాబు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్‌లో యురేనియం నిల్వలు గణనీయంగా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని అడిగిన ప్రశ్నకు అణు ఇంధన శాఖ లిఖితపూర్వక సమాధానమిచ్చింది. రాష్ట్రంలో అణు ఇంధన నిల్వలున్నాయని, వాటిలో యురేనియం ఖనిజాన్ని తాము ఇప్పటికే వెలికి తీస్తున్నామని కేంద్రం వెల్లడించింది. అణు ఇంధన శాఖకు చెందిన అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ (ఏఎండీ) దేశవ్యాప్తంగా అణు ఇంధన నిల్వలను గుర్తించడం, వాటిని వెలికి తీయడం కోసం పని చేస్తుంది. యురేనియం, థోరియం, నియోబియం, ట్యాంటాలం, బెరీలియం, లిథియం, జిర్కోనియం, టైటానియం సహా యురేనియం, థోరియంతో కూడిన అరుదైన మట్టి నిల్వలను ఏఎండీ గుర్తిస్తుంది.

గత ఆరున్నర దశాబ్దాలుగా జరుగుతున్న అన్వేషణలో ఆంధ్రప్రదేశ్‌లోని కడప, గుంటూరు జిల్లాల్లో యురేనియం ఖనిజ నిల్వలను గుర్తించినట్టు కేంద్ర ప్రభుత్వం వివరించింది. కడప జిల్లా, తుమ్మలపల్లి వద్ద 1,41,780 టన్నుల యురేనియం ఖనిజం (యూ3 ఓ8) కార్బొనేట్ రాళ్ల రూపంలో నిక్షిప్తమై ఉందని తెలిపింది. దీన్నుంచి 1,20,229 టన్నుల శుద్ధ ఖనిజాన్ని వెలికి తీయవచ్చని పేర్కొంది. ఇక్కడి నిల్వలన్నీ ఏక రూపంలో ఒకే నాణ్యత కలిగి ఉండడంతో ప్రపంచంలోనే ప్రత్యేకతను తీసుకొచ్చాయని కేంద్రం వెల్లడించింది. భూ ఉపరితలం నుంచి నిలువుగా 1,100 మీటర్ల లోతున తవ్వకాలు జరుపుతూ ఖనిజాన్ని వెలికి తీస్తున్న 2 గనులు ప్రస్తుతం పని చేస్తున్నాయని వివరించింది. ఇక్కడికి తూర్పు దిశలో రాచకుంటపల్లి తూర్పు - వెలమవారిపల్లి సమీపంలో సుమారు 12 కి.మీ. విస్తీర్ణంలో ఈ తరహా ఖనిజ నిల్వలున్నాయని, వాటినింకా వెలికి తీయాల్సి ఉందని వెల్లడించింది. ఈ గనులన్నింటినీ ప్రభుత్వ రంగ సంస్థ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోందని తెలిపింది.

ఈ నిల్వల కారణంగా దేశంలో అణు ఇంధన అవసరాలు చాలా వరకు తీరుతున్నాయని ప్రభుత్వం సమాధానంలో పేర్కొంది. గుంటూరు జిల్లా కొప్పునూరు యురేనియం నిల్వలు ప్రస్తుతం వెలికితీసే దశలో ఉన్నాయని సమాధానమిచ్చింది.



పతంజలి బ్రాండెడ్ దుస్తులు



న్యూఢిల్లీ : బాబా రాందేవ్ దేశీయ మార్కెట్లో ఆహార పదార్థాలు, మందులను విడుదల చేసి పెద్ద పెద్ద బహుళజాతి కంపెనీలకు చుక్కలు చూపెట్టారు. ప్రస్తుతం బ్రాండెడ్ దుస్తుల రంగంలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నారు. తాజాగా మీడియాలో వచ్చిన కథనం ప్రకారం వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ స్వదేశ్‌బ్రాండ్ పేరు పురుషులకు, స్త్రీలకు చిన్నిపిల్లల దుస్తులను మార్కెట్లో విడుదల చేయబోతున్నారు. ప్రారంభంలో దేశవ్యాప్తంగా 250 ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్లను ప్రారంభించి మొదటి ఏడాది రూ.5,000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పతంజలి బ్రాండెడ్ దుస్తులు బిగ్‌బజార్‌లో కూడా విక్రయిస్తారని కంపెనీ అధికార ప్రతినిధి ఎస్ తిజారావాలా చెప్పారు. సంప్రదాయమైన కుర్తా పైజామాతో పాటు విదేశీ దుస్తులు ఉదాహరణకు జీన్స్‌కూడా మార్కెట్లో విడుదల చేస్తామని గత ఏడాది ఇండోర్‌లో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సదస్సులో మాట్లాడుతూ చెప్పిన విషయం తెలిసే ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం తమ టర్నోవర్‌ను రెట్టింపు రూ.20వేల కోట్లకు పెంచుకోవాలని చూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కును 12వేల కు పెంచుతున్నట్లుతెలిపారు. కాగా ఈ ఆర్థికసంవత్సరం బాబా రాందేవ్ కంపెనీ టర్నోవర్ రూ.10,561 కోట్లు సాధించింది.

ఇన్ఫోసిస్‌లో నిధుల గోల్‌మాల్?

• రూ.1,280 కోట్ల దుర్వినియోగం • పానాయా నివేదికను బహిరంగపర్చండి • ఇన్ఫోసిస్ బోర్డుకు మూర్తి డిమాండ్ • ససేమిరా అంటున్న యాజమాన్యం • వ్యవస్థాపకులకు .. కంపెనీకి మధ్య తీవ్ర విభేదాలు





బెంగళూరు : దేశంలోనే అతి పెద్ద ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్‌లో లొసుగులు మళ్లీ బహిర్గతం అయ్యాయి. కంపెనీ వ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణమూర్తికి టాప్ సీఈవోలకు మధ్య అభిప్రాయభేదాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. కంపెనీలో సుపరిపాలనపై మూర్తి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గిబ్సన్, డన్ అండ్ క్రుట్చర్ నివేదిక బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నారాయణమూర్తి ఇటీవల ఇన్ఫోసిస్ బోర్డుకు లేఖరాస్తూ.. కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు ఉదాహరణకు రితికా సూరి కంపెనీ నుంచి ఎందుకు నిష్క్రమించారని ప్రశ్నించారు. రితికా ఇజ్రేల్‌కు చెందిన పానాయాను టేకోవర్ చేసిన బృందంలో ఒకరు. కాగా గ్లోబల్ లా కంపెనీ క్లిన్ చిట్ ఇచ్చిన వెంటనే ఆమె కంపెనీకి రాజీనామా చేసి వెళ్లిపోయారు.

రితికా సూరి విషయానికి వస్తే ఆమె ఎస్ఏపీ (సాప్)లో ప్రస్తుతం ఇన్ఫోసిస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విశాల్ సిక్కా మాజీ సహోద్యోగి. సిక్కా ఇన్ఫోసిస్‌లోకి వచ్చిన వెంటనే ఆమె కూడా ఇన్ఫోసిస్‌లో చేరారు. కంపెనీలో కార్పొరేట్ డెవెలప్‌మెంట్ అండ్ వెంచర్స్ హెడ్‌గా పనిచేశారు. పానాయా డీల్ ఏప్రిల్ 2015లో కుదరినప్పుడు ఆమె ఈ డీల్‌పై సంతకాలు చేశారు. కాగా ఇన్ఫీ నుంచి ఈ ఏడాది జూన్‌లో నిష్క్రమించారు.

ఆమె నిష్క్రమణ తర్వాత ఇన్ఫోసిస్‌లో పలువురు టాప్ ఎగ్జిక్యూటివ్‌లు ఒకరి తర్వాత ఒకరు క్యూ కట్టారు. వారిలో ప్రధానంగా చెప్పుకోవాలంటే అమెరికా హెడ్ సందీప్ దల్డానీ, అనిబేన్ దే, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఎడ్జ్‌ప్రాడక్ట్స్, ఎడ్ వెర్వ్, యూసుఫ్ బషీర్, గ్లోబల్ హెడ్ ఇన్ఫోసిస్‌కు చెందిన 500 మిలియన్ ఇన్నోవేషన్ ఫండ్ హెడ్‌గా పనిచేశారు.

ఇక కంపెనీలో సుపరిపాలనతో పాటు టాప్ ఎగ్జిక్యూటవ్‌లు ఇష్టం వచ్చినట్లు ఖర్చులు పెడుతుండటంతో మార్కెట్ నియంత్రణా సంస్థ సెబికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో జూన్‌లో ఇన్ఫోసిస్ ఒక నివేదికను బహిర్గతం చేసింది. వాటిలో మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్ కంపెనీ నుంచి రాజీనామా చేసి వెళ్లిపోతే కోట్లాది రూపాయలు నజరానా ఇవ్వడంపై పెద్దెత్తున విమర్శలు వచ్చాయి.

అలాగే కంపెనీ ఎండీ, సీఈవో విశాల్ సిక్కా కూడా విపరీతమైన ఖర్చులు చేయడంపై కూడా కంపెనీ వ్యవస్థాపకులు ప్రశ్నల వర్షం కురిపించారు. భారత్ మార్కెట్ నియంత్రణా సంస్థ సెబీనే కాకుండా అమెరికా సెక్యూరిటీ ఎక్స్చేంజీ కమిషన్ కూడా ఇజ్రెల్ కంపెనీ పానాయా టేకోవర్‌లో సుమారు 200 మిలియన్ డాలర్లు భారత కరెన్సీ ప్రకారం రూ.1,280 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని తేల్చింది.

అయితే ఇక్కడే అసలు చిక్కంతా వచ్చిపడింది. కంపెనీ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి పానాయా నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తుంటే.. కంపెనీ మాత్రం నివేదికన బహిర్గతం చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది.

నిధుల దుర్వినియోగంపై జరిగిన విచారణలో సుమారు 50 మందిని భారత్‌తో పాటు అమెరికా, ఇతర దేశాల్లో విచారించింది. జూన్‌లో కంపెనీ వెబ్‌సైట్‌లో విడుదల చేసిన అంశాల విషయానికి వస్తే కంపెనీ విధానాలు, బోర్డు మినిట్స్, పబ్లిక్ ఫైలింగ్, ఇంటర్నల్ డాక్యుమెంట్లు, కలెక్షన్స్, గిబ్సన్ డన్ అటార్నీలు నిర్వహించిన సమీక్షలు, వేలాది ఇంటర్నల్ మెయిల్స్, అటాచ్‌మెంట్లు, ఫోరెన్సిక్ అకౌంటింగ్ నిపుణుల విశ్లేషణలు, టెక్నికల్; ఫైనాన్షియల్ సమాచారం, మీడియాలో వచ్చిన వార్తలు దేశంలో పాటు విదేశీ మీడియాల్లో వచ్చిన వార్తలను, కామ్ నివేదికల సమీక్ష, దానికి అనుబంధ డాక్యుమెంట్లు, ఇతర విచారణ సంస్థల నివేదికలు ఇన్ఫోసిస్ తమ వెబ్‌సైట్‌లో ప్రదర్శించింది.

కంపెనీ మాజీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఒకరు మాట్లాడుతూ.. ఇటీవల కంపెనీ నుంచి నిష్క్రమించిన ఎగ్జిక్యూటివ్‌లు ప్రధానంగా ఇన్ఫోసిస్ టేకోవర్ చేసిన లావాదేవీలపై వచ్చిన ఆరోపణలు దానిపై వెలువడిన నివేదికను బహిర్గతం చేయడానికి వెనుకంజవేయడంతో మరిన్ని అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు.

ఈ ఏడాది ప్రారంభం నుంచే నారాయణమూర్తి కంపెనీలో కార్పొరేట్ గవర్నెన్స్ (సుపరిపాలన) క్షీణించిందని బహిరంగంగానే ఆందోళన వ్యక్తం చేయడంతో కంపెనీ గత్యంతరం లేక కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొన్ని నిబంధనలు మార్చుకోవాల్సి వచ్చింది. కొన్ని నిబంధనలు బహిర్గతం చేయాల్సి వచ్చింది. దీంతో బోర్డులోకి డీఎన్ ప్రహ్లోద్‌ను నామినేట్ చేయాలన్న డిమాండ్‌ను, రవి వెంకటేశన్‌ను ఇండిపెండెంట్ డైరెక్టర్ నుంచి సహ చైర్మన్‌గా పదోన్నతి కల్పించాలని పట్టుబట్టడంతో బోర్డు తలూపకతప్పలేదు. దీంతో ప్రస్తుతం చైర్మన్ ఆర్ శేషసాయి వచ్చే ఏడాది రిటైర్ అవుతున్నట్లు బహిరంగంగా ప్రకటించాల్సి వచ్చింది. ఇక్కడ ఆశ్చర్యం కలిగించే అంశం ఏమిటంటే మూర్తి బోర్డుకు ఘాటుగా లేఖలు రాస్తుంటే, కంపెనీ సీఈవో విశాల్ సిక్కా మాత్రం ఇన్ఫోసిస్‌లో మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు సంబరాలు జరుపుకుంటున్నారు. ఉద్యోగులకు గురువారం పంపిన ఈ-మెయిల్‌లో మూర్తితో కొనసాగుతున్న అభిప్రాయభేదాలను దృష్టిలో ఉంచుకొని .. పాత అంశాలను మరచిపోయి .. కొత్త రూటులో పోదామని లేఖలో పేర్కొన్నారు. ఇన్ఫోసిస్‌లో పనిచేస్తున్న సుమారు 2 లక్షల మందికి సిక్కా మెయిల్‌లో ఇటీవలే తన 50వ జన్మదినోత్సవం సందర్భంగా తన టీచర్ హెర్మాన్ హెస్సీ ... జర్మనీకి చెందిన కవి రచయిత రాసిన పుస్తకం బహుమతిగా అందజేశారని, ఆ పుస్తకంలో కొన్ని ముత్యాల్లాంటి పదాలను గమనించానని చెప్పారు. మనలో కొందరు మనల్ని చేరదీసి గొప్పవారిని చేసామనుకుంటున్నారని.. అయితే కొన్ని సార్లు వారే మనల్ని గాలికి వదిలేస్తారని అని లేఖలో పేర్కొన్నారు. ఉద్యోగులను భవిష్యత్తు గురించి ఆలోచించాలని సలహా ఇచ్చారు. భవిష్యత్తు మనమే అందంగా నిర్మించుకోవాలని, ప్రస్తుతం మనం ఊహల్లో ఉన్నామని, అయితే మనకు వచ్చిన అవకాశాన్ని, సవాలుగా తీసుకొని ముందుకు వెళ్లాలని ఉద్యోగులకు రాసిన లేఖలో సూచించారు.



కాగ్నిజెంట్ నికరలాభంలో 86 శాతం వృద్ధి

• జూన్ త్రైమాసికంలో 470 మిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన కాగ్నిజెంట్ టెక్నాలజీస్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 86 శాతం వృద్ధితో 470 మిలియన్ డాలర్లు ఆర్జించింది. ప్రధానంగా హెల్త్‌కేర్ రంగం నుంచి మంచి ఆదాయం లభించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 252 మిలియన్ డాలర్లు ఆర్జించినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. రెవెన్యూ విషయానికి వస్తే 8.9 శాతం పెరిగి 3.67 బిలియన్ డాలర్లకు చేరింది. మార్కెట్ విశ్లేషకుల అంచనా 3.63 -3.68 బిలియన్ డాలర్లకు ఇంచుమించు చేరింది. కాగా మొత్తం ఆర్థిక సంవత్సరానికి 9-10 శాతం పెరిగి 14.70 నుంచి 14.84 బిలియన్ డాలర్లకు చేరుతుందని రెవెన్యూ అంచనాను కూడా సవరించింది. గతంలో రెవెన్యూ 8-10 శాతం వృద్ధి సాధించవచ్చునని అంచనా వేసింది. మూడవ త్రైమాసానికి రెవెన్యూ 3.73 నుంచి 3.78 బిలియన్ డాలర్లకుగా అంచనా వేసింది. ఫలితాలపై సీఈవో ఫ్రాన్సిస్కో డిసౌజా మాట్లాడుతూ రెండవ త్రైమాసికంలో కూడా మంచి ఫలితాలను సాధించామని క్లయింట్లకు విలువైన సేవలందించామని, వారి వ్యాపారాలకు డిజిటల్ సేవలందించామని ఆయన తెలియజేశారు. కంపెనీకి చెందిన కీలక విభాగాల్లో పెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టి లాభాల మార్జిన్ పెంచుకుంటామని కంపెనీ సీఎఫ్ఓ కరేన్ మాక్ లుగ్లీన్ చెప్పారు.

కోచిన్ షిప్‌యార్డు ఐపీవోకు విశేష స్పందన

COCHIN SHIPYARD LTD

న్యూఢిల్లీ : కోచిన్ షిప్‌యార్డు ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్‌కు ఇన్వెస్టర్ల నుంచి విశేషస్పందన లభించింది. గురువారం చివరి రోజు 72.49 రెట్లు ఓవర్ సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఐపీవో ఇష్యూ సైజు 3.39 కోట్ల షేర్లు కాగా 246 కోట్ల షేర్లకు బిడ్‌లు దాఖలయ్యాయి. ప్రభుత్వ రంగానికి చెందిన ఈ కంపెనీ మార్కెట్ల నుంచి రూ.1468 కోట్లు సేకరించాలని నిర్ణయించింది. కాగా షేరు ధర రూ.424 నుంచి 432 మధ్య నిర్ణయించింది.

వేతనాల్లో ఫార్మా, రిటైల్ రంగాలు టాప్

Wisdom IT Services

హైదరాబాద్ : సరాసరి వేతనాల్లో పెద్ద పెరిగన దాఖలాలు లేవు. అయితే కొన్ని రంగాలు ఉదాహరణకు ఫార్మా, రిటైల్, హెల్త్‌కేర్ రంగాల్లో వేతనాలు పెరిగాయని విస్డమ్ జాబ్స్ డాట్‌కామ్ ఆన్ రిక్రూట్‌మెంట్ పోర్టల్ వెల్లడించింది. ఇక వేతనాల విషయానికి వస్తే ఫార్మా రంగంలో 10.9 శాతం, హెల్త్‌కేర్, రిటైల్ రంగాల్లో 10.8 శాతం, ఆతిథ్యం, ఐటి రంగాల్లో వరుసగా 9.9 శాతం, 9.8 శాతం వేతనాలు పెరిగాయని, ఎఫ్ఎంసీ.ఈ, టెలికం రంగాల్లో చెరో 9.6 శాతం,ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, (మౌలికరంగం, తయారీ రంగాల్లో) వేతనాలు వరుసగా 9.2 శాతం, 9 శాతం పెరిగాయని ఒక ప్రకటనలో వెల్లడించింది.

పసిడికి పెరిగిన డిమాండ్

• జూన్ త్రైమాసికంలో 167 టన్నులు

• క్యూ 1లో 37 శాతం పెరుగుదల



ముంబై : ఈ ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో పసిడి డిమాండ్ 37 శాతం పెరిగి 167 టన్నులకు చేరింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 122 టన్నులు మాత్రమే. దీనికి ప్రధాన కారణం జులై 1 నుంచి కొత్త జీఎస్టి అమల్లోకి వస్తున్న నేపథ్యంలో నగల వ్యాపారులు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి పెట్టుకున్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ గురువారం నాడు విడుదల చేసిన నివేదిక ప్రకారం జూన్ త్రైమాసికంలో నగల డిమాండ్ 41 శాతం పెరిగి 127 టన్నులకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇది కేవలం 90 టన్నులు మాత్రమే.. విలువ ప్రకారం చేస్తే 36 శాతం పెరిగి రూ.33,000 కోట్లకు ఎగబాకిందని పేర్కొంది.

బంగారం ధరల విషయానికి వస్తే 10 గ్రాములు 13 శాతం పెరిగి రూ.27,013కు చేరగా.. క్రితం ఏడాది రూ.23,903గా ఉంది. రూపాయి బలహీనపడ్డంతో బంగారానికి డిమాండ్ పెరిగింది. బంగారం రీసైక్లింగ్ విషయానికి వస్తే 30 టన్నులకు చేరగా.. క్రితం ఏడాది 24 టన్నులుగా నమోదైంది. బంగారం దిగుమతుల విషయానికి వస్తే 248 టన్నులకు ఎగబాకగా.. క్రితం ఏడాది 120 టన్నులు మాత్రమే. గతేడాదితో పోల్చుకుంటే దిగుమతులు రెట్టింపయ్యాయి. కొత్తగా జీఎస్టి అమల్లోకి వస్తున్నందు వల్ల నగల వ్యాపారులు పెద్దమొత్తంలో కొనుగోలు చేసిన నిల్వలు పెంచుకున్నారు. బంగారం దిగుమతులు రెండవ త్రైమాసికం నుంచి క్రమంగా తగ్గముఖం పడతాయని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ అంచనా వేస్తోంది. పసిడి డిమాండ్ పెరుగుదల గురించి వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ మేనేజింగ్ డైరెక్టర్ సోమసుందరం పీఆర్ స్పందిస్తూ.. జీఎస్టిపై ఉన్న అనుమానాలు, ఆందోళనలు నివృత్తి అయ్యాయి.

ప్రభుత్వం తీసుకున్న పారదర్శకమైన చర్యలు, పెద్దనోట్ల రద్దు తర్వాత పూర్తిస్థాయిలో మార్కెట్లో దాదాపు ద్రవ్యలభ్యత రావడం, రుతుపవనాలు అనుకూలంగా ఉండటంతో రాబోయే రోజుల్లో పసిడికి డిమాండ్ మరింత పెరుగుతుందని అంచనా వేశారు. ఈ ఏడాది మొత్తం పసిడి డిమాండ్ 650 -750 టన్నుల వరకు ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం జీఎస్టిని కట్టుదిట్టంగా అమలు చేస్తే దేశవ్యాప్తంగా పసిడి అమ్మకాలు ఎంతో ఒక్క బటన్ నొక్కితే తేలిపోతుందని సోమసుందరం చెప్పారు. దీంతో పాటు అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయవచ్చునని అన్నారు. అదే సమయంలో ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పది శాతం నుంచి తగ్గిస్తే ప్రజలు స్మగుల్డ్ బంగారం జోలికిపోరని ఆయన అన్నారు. ఇక ప్రపంచవ్యాప్తంగా చూస్తే పసిడి డిమాండ్ పది శాతం తగ్గి 953 టన్నులకు దిగివచ్చింది. గత ఏడాది ఇదే జూన్ త్రైమాసికంలో 1056 టన్నులుగా ఉంది.

ఎస్‌బీఐ వడ్డీరేట్ల కోత సబబే

• ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ




న్యూఢిల్లీ : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) పొదుపు ఖాతాలపై 0.5 శాతం వడ్డీరేట్ల కోతను ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం నాడు సమర్థించారు. ఎస్‌బీఐ రూ.1 కోటి కంటే తక్కువ డిపాజిట్లపై వడ్డీ రేటును నాలుగు శాతం నుంచి 3.5 శాతానికి తగ్గించిన విషయం తెలిసిందే. అదే రూ.1 కోట్ల డిపాజిట్లపై ఎలాంటి కోత లేదు. అయితే సీనియర్ సిటి జన్లప్రయోజనం కాపాడ్డానికి 8 శాతం కంటే ఎక్కువ వడ్డీరెటును ఆఫర్ చేస్తున్నామని పార్లమెంటులో జీరో అవర్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇంతకు జైట్లీ చెప్పేదేమిటంటే ద్రవ్యోల్బణం 10-11 శాతం ఉన్నప్పుడు పొదుపు,ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధికవడ్డీరేట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఎప్పుడైతే రుణాలపై బ్యాంకులు వడ్డీరేట్లు తగ్గిస్తాయో అదే సమయంలో పొదుపు ఖాతాలపై కూడా వడ్డీరేట్లు తగ్గుతాయని ఆయన వివరించారు. సీనియర్ సిటిజన్లకు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రభుత్వం పెన్షన్ స్కీంను తీసుకొచ్చిందని. దీనిపై ఖచ్చితంగా ఎనిమిది శాతం వడ్డీరేటు లభిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ డిసెంబర్‌లో ప్రధాన్‌మంత్రి వ్యయ వందనా యెజనా (పీఎంవీవైవై)ను ప్రారంభించారు. ఈ స్కీంను ఈ ఏడాది మేలో ప్రారంభించారు ఎల్ఐసీ ఈ స్కీంను నిర్వహిస్తుంది. వడ్డీరేటు 8.3 శాతం వరకు లభిస్తుందని జైట్లీ వివరించారు.

రామ్‌కో సిమెంట్ లాభం రూ.156 కోట్లు

RAMCO SUPER GRADE As strong as family bonds

న్యూఢిల్లీ : రామ్‌కో సిమెంట్ జూన్‌తో ముగిసిన త్రైమాసికం స్టాండ్‌ఎలోన్ నికరలాభంలో స్వల్పంగా తగ్గి రూ.155.81 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.155.93 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. అమ్మకాల విషయానికి వస్తే రూ.1150.49 కోట్లు కాగా, క్రితం ఏడాది రూ.1092.82 కోట్లని .. అమ్మకాల్లో 5.27 శాతం వృద్ధి కనిపించిందని తెలిపింది. రాబోయే రోజులో సిమెంట్ డిమాండ్ గురించి ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం మౌలికరంగంతో పాటు చౌకగృహాలపై పెద్దెత్తున వ్యయం చేయబోతున్న నేపథ్యంలో సిమెంట్ డిమాండ్ పెరుగుతుందని భావిస్తోంది. రూ.1,095 కోట్లతో వైజాగ్, ఒడిషాలో కోలాఘాట్‌లో యూనిట్లను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపింది. బీఎస్ఈలో దీని షేరు 1.96 శాతం క్షీణించి రూ.686 వద్ద ట్రేడ్ అయ్యింది.

జీఎస్టీ అమలుతో సేవల రంగం పీఎంఐ ఢమాల్!



న్యూఢిల్లీ : జులై నెల సేవలరంగం నాలుగు సంవత్సరాల కనిష్ఠానికి దిగివచ్చింది. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన వస్తు సేవల పన్ను (జీఎస్టి) ప్రభావం సేవలరంగంపై పక్కాగా పడిందని తాజా సర్వే తెలియజేస్తోంది. నిక్కీ ఇండియా సర్వీసెస్ పర్చేజ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) నెలవారి సూచి జులైలో ఏకంగా 45.9 పాయింట్లకు దిగివచ్చింది. చివరగా సెప్టెంబర్ 2013 స్థాయికి దిగివచ్చింది. అదే జూన్ నెలలో ఎనిమిది నెలల గరిష్ఠానికి 53.1 పాయింట్లు ఎగబాకింది. ఇక జులై నెల సర్వీసెస్ పీఎంఐ ఈ ఏడాది మొట్టమొదటిసారి తిరోగమనబాటపట్టింది.


జూన్ వరకు దేశంలో సేవల రంగం జోరందుకోగా.. జులై నుంచి తిరోగమనబాటపట్టిందని పోల్లాయన్నా డిలీమా ప్రిన్సిపల్ ఎకనమిస్ట్ ఐహెచ్ఎస్ మార్కిట్ తెలియజేశారు. కొత్తగా జీఎస్టి అమల్లోకి రావడంతో కొత్త ఆర్డర్లు తగ్గడంతో కార్యకలాపాలు మందగించాయని సర్వే వెల్లడించింది. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత తయారీరంగం కూడా డీలాపడింది. కంపెనీలకు కొత్త ఆర్డర్లు కరువయ్యాయి. ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ప్రైవేట్ రంగంలో కార్యకలాపాలుకూడా క్రమంగా తగ్గాయని లిమా వివరించారు. అయితే భారత్ సేవల రంగం వచ్చే 12 నెలల కాలంలో తిరిగి కోలుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జీఎస్టి ప్రభావం ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలంలో ఎలా ఉంటుందన్న ఆందోళన నుంచి క్రమంగా గట్టెక్కుతోందన్నారు. కొత్త జీఎస్టి వ్యవస్థఅమల్లోకి వచ్చినందుకు వల్ల భవిష్యత్తు మెరుగ్గానే ఉంటుందని లిమా తెలిపారు. ఇదిలా ఉండగా బుధవారం నాడు రిజర్వుబ్యాంకు కీలక వడ్డీరేట్లను 0.25 శాతం తగ్గించింది. దీంతో గృహ, వాహనాల వడ్డీరేట్లు తగ్గముఖం పడతాయి. వడ్డీరేట్లు తగ్గముఖం పట్టడంతో రుణాలకు డిమాండ్ పెరిగి ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందని ఆమె అన్నారు.

నష్టాల్లోనే మార్కెట్లు

• 239 పాయింట్లు పతనం

• లూపిన్ షేరు 4 శాతం డౌన్



ముంబై : వరుసగా రెండో రోజు గురువారం స్టాక్ మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి. రిజర్వుబ్యాంకు భవిష్యత్తులో వడ్డీరేట్లు తగ్గించే అవకాశాల్లేవన్న అంచనాతో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాతో పాటు ఇతర బ్యాంకు నష్టాలతో ముగిశాయి. కాగా బుధవారం నాడు రిజర్వుబ్యాంకు రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6 శాతానికి సవరించిన విషయం తెలిసిందే. అయితే భవిష్యత్తులో వడ్డీరేట్లు తగ్గింపు అనుమానాలు తలెత్తడంతో మార్కెట్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. కాగా ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ వడ్డీరేట్లను 0.50 శాతం తగ్గుతాయని ఆశిస్తే.. ఆర్‌బీఐ మాత్రం 0.25 శాతం తగ్గించి చేతులు దులుపుకుంది. ద్రవ్యోల్బణం అత్యంత కనిష్టానికి దిగిరావడంతో పాటు వృద్ధిరేటు మందగమనంలో కొనసాగుతుండటంతో ఆర్‌బీఐ వడ్డీరేట్లు ఎక్కువ మొత్తంలో తగ్గిస్తాయని మదుపరులు ఆశించారు.

ఇక జులై నెల సేవల రంగం గణాంకాలు నాలుగు సంవత్సరాల కనిష్ఠానికి దిగివచ్చాయి. ప్రభుత్వం జులై 1 నుంచి కొత్తగా జీఎస్టి అమల్లోకి తేవడంతో కొత్త ఆర్డర్లు లేక మొత్తం గందరగోళం నెలకొంది. ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపుపై స్పష్టత లేకపోవడంతో బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు నష్టపోయాయని ఈ రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మొత్తానికి బీఎస్ఈ 238.86 పాయింట్లు క్షీణించి 32,237.88 వద్ద ముగిసింది. నిఫ్టీ 67.85 పాయింట్లు నష్టపోయి 10,013.65 మార్కుకు దిగివచ్చాయి.

బీఎస్ఈ సూచిల విషయానికి వస్తే చమురు సహజ వాయువు సూచి తప్పించి మిగిలిన రంగాలన్నీ నష్టాలతో ముగిశాయి. లోహ సూచి ఏకంగా 1.68 శాతం, బ్యాంకింగ్ 1.66 శాతం, హెల్త్‌కేర్ 1.03 శాతం, రియల్టీ 0.73 శాతం.. దీనికి వ్యతిరేకంగా లాభాలను నమోదు చేసిన సూచిలు చమురు సహజవాయువు 1.35 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్ 0.11 శాతం వరకు పెరిగాయి. బీఎస్ఈలో అత్యధికంగా లాభపడిన షేర్లు ఇలా ఉన్నాయి. భారతి ఎయిర్‌టెల్ 2.01 శాతం, రిలయన్స్ 1.38 శాతం, బజాజ్‌ఆటో 1.17 శాతం, హీరోమోటోకార్ప్ 1.02 శాతం, టీసీఎస్ 0.9 శాతం కాగా దీనికి వ్యతిరేకంగా నష్టపోయిన షేర్లు ఇలా ఉన్నాయి. లూపిన్ 3.8శాతం, కోల్ ఇండియా 3.36 శాతం, స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా 2.24 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.02 శాతం, యాక్సిస్ బ్యాంకు 2.01 శాతం వరకు ఉన్నాయి. ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపుపై స్పష్టత కొరవడినందుకు బ్యాంకింగ్ రంగానికి చెందిన షేర్లు నష్టోయాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మిగిలిన అంశాల విషయానికి వస్తే ఈ ఏడాది రుతుపవనాలు అనుకూలంగా ఉన్నాయి. ద్రవ్యోల్బణం ఇంకా కొంత దిగివచ్చే వరకు ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు జోలికిపోకపోవచ్చునని చెబుతున్నారు. హౌసింగ్ డెవెలప్‌మెంట్ కార్పొరేషన్ అత్యధికంగా 1.71 శాతం క్షీణించి రెండు సూచిలను మరింత కిందికి లాగాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా రెండు శాతం, కెనెరా బ్యాంకు 2.8 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంకు 4 శాతం వరకు నష్టపోయాయి.

ఐఓసీ లాభంలో 45 శాతం ఆవిరి!


IndianOil

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభంలో 45 శాతం క్షీణించి రూ.4,549 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.8,269 కోట్లని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

దీనికి ప్రధాన కారణం అధిక మొత్తంలో సరకు నిల్వల నష్టంతో పాటు, రిఫైనింగ్ మార్జిన్ తగ్గడంతోదాని ప్రభావం లాభాలపైనే కనిపించిందని తెలిపింది. ముడిచమురు శుద్ధిపై పీపాకు 4.32 డాలర్లు లాభం రాగా క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 9.98 డాలర్ల లాభం ఆర్జించింది. అదీ కాకుండా త్రైమాసికంలో చమురు ధరలు ఒడిదుడుకులకు గురయ్యాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో బెంచ్‌మార్కు బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 9.3 శాతం తగ్గింది.

కాంగ్రెస్‌లోకి వెళ్లేది లేదు

●మీడియాలో అడ్డగోలు రాతలు: ఎంపీ డి.శ్రీనివాస్



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మళ్లీ సొంతగూటికి చేర తారంటూ టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు ధర్మపురి శ్రీని వాస్ (డీఎస్)పై వస్తున్న కథనాలను ఆయన ఖండించారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో మీడియా సమావేశంలో డీఎస్, సోషల్ మీడియా కథనాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఆర్ఎస్‌లో సంతోషంగా లేనని, కాంగ్రెస్‌లో చేరబోతున్నానని తనపై అడ్డగోలుగా వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. దాగుడు మూతలు ఆడా ల్సిన అవసరం తనకు లేదన్నారు. ఈ రాతలు ఇప్పటికైనా ఆపకపోతే సదరు వైబ్ సైట్లు, పత్రికలపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అలాగే తన సలహా ప్రకారమే దిగ్విజయ్ సింగ్‌ను తీసేసారని జరు గుతున్న ప్రచారాన్ని కూడా ఆయన కొట్టిపడేశారు. ''అసలు ఆయన ఉంటే ఏంటి, పోతే నాకేంటి'' అం టూ డీఎస్ వ్యాఖ్యానించారు. టీఆర్ఎస్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ తనను చాలా గౌరవించారని ఈ సందర్భంగా డీఎస్ అన్నారు. తన అనుభవానికి తగ్గట్టు రాజ్యసభ సభ్యుణ్ణి చేశారని కొనియాడారు. కేసీఆర్, బంగారు తెలంగాణ చేస్తారన్న విశ్వాసం తనకుందని డీఎస్ పునరుద్ఘాటించారు. ''నాకు ముఖ్యమంత్రికి మధ్య మంచి అనుబంధం ఉంది, నాకు ఏ బాధ్యత అప్పగించాలో అదే ఆయన అప్పగిస్తున్నారు.'' అని డీ. శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఆలోచన మీది... ఆచరణ మాది

ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పాటుపై గీతారెడ్డి



న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఆలోచన మీది, ఆచరణ మాది అంటోంది కాంగ్రెస్ పార్టీ. సమాజంలోని వివిధ వర్గాలకు మరింత చేరువయ్యే క్రమంలో కొన్ని ప్రత్యేక విభాగాలను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ తాజాగా ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పేరుతో మరో విభా గాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీనికి ఎంపీ శశి థరూర్ నేతృత్వం వహిస్తుండగా, దక్షిణ భారత దేశం బాధ్యతల్ని మాజీ మంత్రి గీతారెడ్డికి అప్పగించారు. ఈ క్రమంలో గురువారం ఢిల్లీలో సమావేశమైన విభాగం నేతలు అనంతరం ఏపీ భవన్లోని గురజాడ హాల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీతారెడ్డి ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏర్పాటు వెనుక ఉద్దేశాన్ని వివరించారు. దేశంలో చాలా మంది ప్రొఫెషనల్స్ ఉన్నప్పటికీ వారంతా రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇలాంటి వారందరినీ సమన్వయపరుస్తూ, వారి ఆలోచనల్ని అమలు చేస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని గీతారెడ్డి తెలిపారు. చాలామందికి రాజకీయాల గురించి అనేక ఆలోచనలుంటాయి. అయితే వాటిని బయటపెట్టే వేదిక దొరకదు. దీంతో వారంతా వీలుంటే సామాజిక మాధ్యమాల్లో లేదంటే నాలుగు గోడల మధ్య చర్చలకే పరిమితమవుతున్నారు. తమ ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఇలాంటి వారందరికీ వేదికవుతుందని గీతారెడ్డి తెలిపారు. నిజానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఈ ఆలోచన రావడం వెనుక ఓ కారణముంది. నోట్ల రద్దు నిర్ణయం తర్వాత తాజాగా జీ ఎస్టీతో ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, వృత్తి నిపుణులు ''బ్రింగ్ బ్యాక్ కాంగ్రెస్'' పేరుతో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేపట్టారు. రాజకీయాలతో సంబంధం లేని ఎంతోమంది ఈ ఆన్‌లైన్ క్యాంపెయిన్‌లో భాగస్వాములయ్యారు. ఈ విషయం గమనించిన అధిష్టానం, ఆలోచన మీది - ఆచరణ మాది అంటూ ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఆదాయపు పన్ను శాఖ ఇచ్చే పాన్ కార్డు కలిగి ఉండి, విద్యావంతులైన వారికి తమ విభాగంలో సభ్యత్వం ఇస్తామని ఈ విభాగం అధ్యక్షుడు శశిథరూర్ తెలిపారు. వారి ఆలోచనలను పార్టీ అభివృద్ధికి ఉపయోగపడేలా సమన్వయపరుస్తూ తమ విభాగం పనిచేస్తుందని ఆయన వివరించారు.

చిత్రపరిశ్రమ లేఖ బహిర్గతం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: డ్రగ్స్ వ్యవహారంలో చిత్ర పరిశ్రమకు చెందిన వారికి నోటీసులు రావడం, సిట్ అధికారుల విచారణ పూర్తి కావడం తెలిసిందే. అయితే ఈ సమస్యను సున్నితంగా పరిష్కరించాలంటూ సీఎం కేసీఆర్‌కు తెలుగు చిత్రపరిశ్రమ బుధవారం ఓ లేఖ రాసింది. ఈ లేఖను ప్రముఖ హీరో పవన్ కల్యాణ్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. గౌరవనీయులైన తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ కేసీఆర్ గారికి చిత్ర పరిశ్రమ నుంచి చేస్తున్న విన్నపం అంటూ ఈ లేఖను పవన్ పోస్ట్ చేశారు. మాన్యశ్రీ గౌరవ ముఖ్యమంత్రి గారికి తెలుగు సినిమా 2000కోట్ల రూపాయలు దాటిన సంతోషంలో.. ఒక దర్శకుడికి దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వచ్చిన ఆనందంలో తెలుగు సినీ పరిశ్రమ వెలిగిపోతున్న సమయంలో మమ్మల్ని కమ్మిన గ్రహణం మాదక ద్రవ్యాల కేసు అంటూ ఈ లేఖ కొనసాగింది.

ఇకపై అంతా నేనే చూసుకుంటా : కాజల్

డ్రగ్స్ వ్యవహారంలో ప్రముఖ హీరోయిన్ కాజల్ మేనేజర్ రోనీని ఇటీవల పోలీసులు అరెస్టు చేయడం, అతని వ్యక్తిగత విషయాల గురించి తనకు తెలియదని ఆమె చెప్పడం తెలిసిందే. తాజాగా, కాజల్ స్పందిస్తూ ఇకపై తనకు తానే మేనేజర్‌గా వ్యవహరిస్తానని, ఎవరినీ మేనేజర్‌గా నియమించుకోనని చెప్పింది. అయితే ఒక సహాయకుడిని మాత్రం నియమించుకుంటానని, కథలు, పారితోషికం వంటి విషయాలను ఇకపై తానే చూసుకుంటానని కాజల్ చెప్పింది. కాగా,కాజల్‌తో పాటు మరి కొందరి హీరోయిన్లకు కాల్‌షీట్స్ వ్యవహారాలను కూడా రోనీ చూసుకునవాడు. డ్రగ్స్ వ్యవహారంలో రోనీ అరెస్టు కావడంతో ఆ పోస్ట్ నుంచి అతడ్ని కాజల్ పక్కన బెట్టింది.

పూరీని చూస్తే చాలా అసూయగా ఉంది : సుకుమార్

పూరీ జగన్నాథ్.. సుకుమార్ మంచి స్నేహితులు. కథల ఎంపికలోనూ.. కథనాన్ని నడిపించడంలోనూ ఎవరి దారి వారిదే. ఈ విషయంలో ఎవరి స్కూల్ వారిది. ఎవరి తీరు వారిది. అయినా ఒకరి సినిమాలను ఒకరు చూడటం, అభినందించడం జరుగుతూ ఉంటాయి. అలాంటి పూరీని చూస్తే తనకి చాలా అసూయగా ఉందని తాజాగా ఒక సందర్భంలో సుకుమార్ అన్నారు. పూరీ డ్రగ్స్ కేసులో విచారణను ఎదుర్కోవడం గురించి సుకుమార్‌ను ప్రశ్నించగా, తనదైన శైలిలో ఆయన స్పందించారు. డ్రగ్స్ విషయంలో తన పేరు వినిపించడం పూరీకి కొంత బాధ కలిగించినా.. తనకి మరో కథ దొరికిందని ఆయన సంతోషపడి ఉంటాడని సుకుమార్ అన్నాడు. అలా ఆయనకు కథ దొరకడం తనకి చాలా అసూయను కలిగిస్తోందని చమత్కరించాడు. వాస్తవ సంఘటనల ఆధారాంగా పూరీ సినిమాలు వుంటాయనే సంగతి తెలిసిందే.

తెలంగాణకు సహకరిస్తాం:యాస్మిన్




హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత్‌లో యూనిసెఫ్ ప్రతినిధి నియమితులైన డాక్టర్ యాస్మిన్ హేక్ గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్‌ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మకమైన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కేసీఆర్ కిట్, ఒంటరి మహిళలకు పింఛన్లు, ప్రభుత్వ ఆసుప్రతుల ఆధునీకరణ తదితర కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా యాస్మిన్‌కు ఆయన వివరించారు. రాష్ట్రంలో మహిళా శిశు సంక్షేమంపై అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు కూడా ఎస్పి సింగ్ తెలిపారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన మంచినీరు అందిస్తామని, దీనిద్వారా పిల్లలు, మహిళల పరిస్థితుల్లో ఎంతో మార్పు వస్తుందని చెప్పారు. ఈ పథకానికి యూనిసెఫ్ మద్దతు అవసరమని ఎస్పి సింగ్ కోరారు. ప్రభుత్వ పథకాలను తెలుసుకుని ముగ్ధుడైన యాస్మిన్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు తెలంగాణలో ఐదేళ్ళపాటు తమ సహాయం కొనసాగుతుందని హామీ ఇచ్చారు. శుద్ధమైన మంచినీటితో పాటు పారిశుధ్యం కూడా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆయన పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో పిల్లల సంరక్షణకు అన్ని వ్యవస్థలను ఒకే వ్యవస్థ కిందకు తీసుకురావలసిన అవసరం ఉందని చెప్పారు.

డిగ్రీ డిటెన్షన్‌పై కమిటీ

•అటానమస్ కాలేజీలతో సమావేశం అనంతరం కమిటీ ఏర్పాటు

•నివేదిక ఆధారంగా సీబీసీఎస్‌లో డిటెన్షన్‌పై నిర్ణయం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో గత ఏడాది నుంచి డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రారంభించిన చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం(సిబిసిఎస్)లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడం కోసం కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఇప్పటికే సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్న అటానమస్ కాలేజీల అనుభవాలను పరిగణనలోకి తీసుకోవాలని గురువారం జరిగిన ఉపకులపతుల సమావేశంలో నిర్ణయించారు. త్వరలోనే డిగ్రీలో సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తున్న అటానమస్ కాలేజీలతో సమావేశాన్ని ఏర్పాటు చేయ నున్నారు. సమావేశంలో వారి అనుభవాలను తెలుసుకుని వాటిని పరిశీలించడం కోసం ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

ఆ కమిటీ అటానమస్ కాలేజీల వారి అనుభవాను పరిగణనలోకి తీసుకుని ఆయా యూనివర్సిటీల్లో సిబిసిఎస్ విధానంలో డిటెన్షన్ విధానం అమలుపై నివేదికను రూపొందిస్తారు. నివేదిక ఆధారంగా డిటెన్షన్ విధానంపై నిర్ణయం తీసుకోనున్నారు. అయితే యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) సూచించిన మాదిరిగా సిబిసిఎస్‌లో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడం కాకుండా 20 నుంచి 30 శాతం వరకు వాటి నుంచి మినహాయింపును రాష్ట్రంలోని విద్యార్థులకు ఇవ్వాలనే ఆలోచనలో తెలంగాణ ఉన్న త విద్యా మండలి ఉన్నట్టు తెలుస్తోంది. లాంగ్వేజెస్‌కు ఎక్కువ క్రెడిట్స్ ఉంటున్న నేప థ్యంలో యుజిసి అమలు చేసే విధానం యాధావిధిగా అమలు చేయడానికి కొన్ని రాష్ట్రా లకు ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో తెలం గాణ రాష్ట్రంలో కూడా అటువంటి ఇబ్బందే తలెత్తనున్న నేపథ్యంలో క్రెడిట్స్ ఉత్తీర్ణతపై కమిటీ నివేదిక అనంతరమే డిటెన్షన్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఇంజనీరింగ్ కోర్సుల్లో గత రెండు సంవత్సరాల క్రితం నుంచే సెమిస్టర్ విధానాన్ని అమలు చేయ డం, దాంట్లో క్రెడిట్స్ ఆధారంగా డిటెన్షన్ విధానాన్ని జెఎన్‌టియు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అదే విధానాన్ని యధావిధిగా డిగ్రీ సిబిసిఎస్ విధానంలో అమలు చేయకుండా యుజిసి సూచించిన వాటిలో కొన్ని మార్పులు చేసి అమలు చేయడం కోసం ఉన్నత విద్యా మండలి కసరత్తు చేస్తోంది. కమిటీ నియామకం, నివేదిక అనంతరం డిగ్రీలో డిటెన్షన్ విధానంపై స్పష్టత రానుంది.

విక్రమ్‌గౌడ్‌కు 14 రోజుల రిమాండ్

• చంచల్‌గూడ జైలుకు తరలింపు

• చికిత్సకు అనుమతి




హైదరాబాద్, ఆంధ్రప్రభ : మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ తనయుడు విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించారు. నియోజక వర్గ ప్రజల సానుభూతి కోసం తనపై కాల్పులు జరిపించుకోవడంలో కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం వహించింది విక్రమ్‌గౌడేనని నిర్ధా రించిన పోలీ సులు గురువారం ఉదయం విక్రమ్ గౌడ్‌ను అరెస్టు చేశారు. అనంతరం బంజారాహిల్స్ పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా, విచారించిన న్యాయ మూర్తి విక్రమ్‌గౌడ్‌కు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. విక్రమ్ బెయిల్ పిటిషన్‌ను న్యాయ స్థానం తోసిపుచ్చింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా నిందితుడికి బెయిల్ ఇవ్వొద్దని పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. దీంతో విక్రమ్‌గౌడ్‌ను పోలీసులు చంచల్ గూడ జైలుకు తరలించారు. కాల్పుల నేపథ్యంలో విక్రమ్‌గౌడ్‌కు వెన్నెముకలో తూటా ఉన్నందున ఆయనకు చికిత్స అవసరమని ఆయన తరపు న్యాయవాది న్యాయస్థానాన్ని కోరారు. దీనికి స్పందించిన న్యాయస్థానం విక్రమ్ గౌడ్‌ను చికిత్స నిమిత్తం గాంధీ లేదా ఉస్మానియా ఆసుపత్రికి తరలించాలని జైళ్లశాఖను ఆదేశించింది. విక్రమ్‌గౌడ్‌పై జరిగిన కాల్పుల మిస్టరీని పోలీసులు ఛేదించారు. విక్రమ్‌గౌడే నియోజకవర్గ ప్రజల సానుభూతి కోసమే ఈ నాటకమాడాడని పోలీసులు తెలిపారు. పోలీసులను తప్పుదోవ పట్టించినందుకు, అక్రమంగా ఆయు ధాన్ని కలిగి ఉండటం, దానిని వినియోగించినందుకు విక్రమ్ గౌడ్‌తో సహా ఆరు గురు నింది తులు ఎస్.నందకుమార్, షేక్ అహ్మద్, కోకంటి బాబు జన్, గోవిం ద్‌రెడ్డి, రయీస్‌ఖాన్‌లను అరెస్టు చేశామని పోలీసులు వెల్లడించారు. విక్రమ్ గౌడ్ ఆసుపత్రిలో ఉన్నందున కోలుకున్నాక అతడిని అరెస్ట్ చేస్తామని సీపీ మహేం దర్‌రెడ్డి తెలిపారు. నేరంలో భాగస్వామ్యులైన వెంకటరమణ అలి యాస్ చిన్నా, గౌసెలు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. కాగా, గురువారం ఉదయం ఆసుపత్రి వర్గాలు విక్రమ్‌గౌడ్ ఆరోగ్యపరిస్థితి మెరుగైందని తెలపడంతో బంజారాహిల్స్ పోలీసులు విక్రమ్‌గౌడ్‌ను అరెస్ట్ చేశారు. విక్రమ్‌గౌడ్‌ను కోర్టుకు తరలించే క్రమంలో విక్రమ్‌గౌడ్ అంబులెన్స్ సౌకర్యం కోరగా అందుకు పోలీసులు అంగీకరిం చలేదు. పోలీసు కస్టడీలో ఉన్నందున విక్రమ్‌గౌడ్‌ను పోలీసు వాహనంలోనే కోర్టుకు తరలిం చారు. విక్రమ్‌గౌడ్ బీఎండబ్ల్యూ కారును పోలీసులు సీజ్ చేశారు. కాగా, విక్రమ్‌గౌడ్ తండ్రి ముఖేష్‌గౌడ్ మంత్రిగా ఉన్నప్పుడు యువనేతగా సెటిల్‌మెంట్లు చేసిన విక్రమ్‌గౌడ్ తన అనుచరులతో పలు దౌర్జన్యాలకు పాల్పడ్డారనే ఆరోపణ లున్నాయి. బాలానగర్, మియాపూర్, అఫ్జల్‌గంజ్ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదైనా వాటి విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. చేస్తున్న వ్యాపారాల్లో రూ.కోట్లలో నష్టం రావడం, అప్పు ఇచ్చినవారి నుంచి ఒత్తిడి అధికమవు తుండటంతో వీటన్నింటినీ అధిగమించి ప్రజానాయకుడిగా స్వీయహత్యా యత్నం పథకం రచించాడని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం విక్రమ్‌కు రూ.50 కోట్ల వరకూ అప్పులున్నాయని అతడి సన్నిహితులు విచారణ అధికారులుకు వివ రించారు. అతను గనుల్లోను పెట్టుబడులు పెట్టాడు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

నిర్మల్ టౌన్, కెఎన్ఎన్ : నిర్మల్ పట్టణంలోని గాయత్రీపురం కాలనీకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సాకేత్ గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న కిషన్ ప్రసాద్ కుమారుడైన సాకేత్ ఇటీవలె ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణుడయ్యారు. ఎంసెట్ ర్యాంకు సాధించడంతో కౌన్సిలింగ్‌కు హాజరైన సాకేత్ ఇంజనీర్ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. అయితే ఇంజనీరింగ్ చదవడం ఇష్టంలేక మానసిక క్షోభకు గురైన సాకేత్ రెండు, మూడు రోజులుగా తీవ్ర మనస్తాపానికి గురయ్యారన్నారు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతసేపటికి గదిలో నుంచి సాకేత్ బయటకు రాకపోవడంతో కుటుంబసభ్యులు అనుమానంతో గదిలోకి వెళ్లగా ఫ్యాన్‌కు వేళాడుతూ సాకేత్ శవాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు.

బీసీ బిల్లుకు ప్రయత్నించండి

బీజేపీ నేత మురళీధర్‌రావుకి బీసీ సంఘాల విజ్ఞప్తి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వెనుకబడిన తరగతుల వారు రాజకీయంగా ఎదగడం కోసం పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టేలా చూడాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరరావుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చూడాలని సంఘం నేతలు బిజెపి నేతలతోపాటు కాంగ్రెస్, టిడిపి నేతలను గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. రాజకీయ నాయకులను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ నీల వెంకటేష్, గుజ్జ రమేష్, ఎస్ రామలింగం, నరసింహాగౌడ్ తదతరులు ఉన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 67 సంవత్సరాలు పూర్తి అయిన ఇప్పటి వరకు బీసీలు రాజకీయంగా ఎదగలేకపోతున్నారని బీసీ సంఘం నేతలు విమర్శించారు. బీసీలు రాజకీయంగా ఎదగాలంటే చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేస్తే తప్ప న్యాయం జరగదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 2600 బీసీ కులాలు ఉంటే వాటిలో 2550 కులాల వారు ఇప్పటికీ పార్లమెంటులో అడుగు పెట్టలేదన్నారు. రాజకీయ రిజర్వేషన్లు వస్తే వారు చట్టసభలకు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యార్థులకు సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లో శిక్షణ ఇచ్చేందుకు తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), రెడ్‌హ్యాట్ ఇన్ కార్పొరేషన్‌లు ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. టాస్క్ పార్టనర్లుగా ఉన్న కాలేజీలలో రెడ్‌హ్యాట్ ఎంటర్‌ప్రైజెస్ లైనెక్స్ శిక్షణా సర్వీసుల కోసం ల్యాబ్స్‌ను ఏర్పాటు చేస్తుంది. క్లౌడ్ కంప్యూటింగ్, కంటెనర్స్, మొబైల్, ఆర్టి ఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లర్నింగ్ తదితర అత్యాధునిక సాఫ్ట్‌వేర్ సొల్యూ షన్స్‌లో రెడ్‌హ్యాట్ సంస్థ ఓపెన్ సోర్స్ సొల్యూషన్లు అందించనుందని టాస్క్ సీఈవో సుజీవ్ నాయర్ చెప్పారు. రానున్న రెండేళ్ళలో 1500 మంది విద్యార్థులకు డెవ్‌ఆప్స్, క్లౌడ్, ఐటి ఆటోమేషన్ తదితర విభాగాల్లో ఓపెన్ సోర్స్ స్కిల్స్ సర్టిఫికేషన్‌లో శిక్షణ ఇవ్వనుందని తెలిపారు. తెలంగాణలో డిజిటల్ ట్రాన్సర్మేషన్ తేవాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కొత్త టెక్నాలజీలో శిక్షణ ఇప్పిస్తున్నామని నాయర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రెడ్‌హ్యాట్ ఇండియా ఎండి రాజేష్ ర్యాగే మాట్లాడుతూ, ఐటి మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న డిమాండ్‌కు తగ్గట్లు గా టాస్క్ విద్యార్థులకు టెక్నాలజీలో శిక్షణ ఇస్తామన్నారు.

బ్యూటీషియన్ యంత్రాలపై సదస్సు

హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్ర నాయిబ్రాహ్మణ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆధునిక హేర్‌స్టైల్స్, బ్యూటిషియన్ యంత్రాల ప్రదర్శన, డెమో నిర్వహిస్తున్నట్లు ఆ కార్పొరేషన్ ఎండీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 8న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బేగంపేట ప్యాలస్, యు.ఎస్ కౌన్సెట్‌లో ఉటుందని, ఈ కార్యక్రమానికి మంత్రులు ఈటెల రాజేందర్, జోగు రామన్న హాజరవుతారని పేర్కొన్నారు. ఆధునియ యంత్రాల పని విధానంపై సుశిక్షితులైన టెక్నీషియన్స్‌తో సెమినార్ ఉంటుందన్నారు.

బీఎస్ఎన్ఎల్ రాఖీ ఆఫర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాఖీ పండుగ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ ప్రీ పెయిడ్ కస్టమర్ల కోసం కొత్త ఆఫర్‌ను ప్రకటించింది. రాఖీ పై సౌగాత్ పేరుతో ఈ ఆఫర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ ఆఫర్ కింద రూ. 74లతో కాంబో వోచర్ రీచార్జీ చేసుకోవలసి ఉంటుంది. ఈ ఆఫర్ వోచర్ రీచార్జీతో 1జిబి డేటా ఉచితంగా అందుకోవచ్చు. బిఎస్ఎన్ఎల్ నెట్ వర్కుకు అపరిమితంగా కాల్స్ చేసుకోవచ్చు. బిఎస్ఎన్ఎల్ నుండి మరో నెట్ వర్కుకు రూ. 74ల టాక్ టైమ్ లభిస్తుంది. ఈ టాక్ టైమ్ వ్యాలిడిటీ ఐదు రోజులు మాత్రమే. రాఖీ ఆఫర్ ఈ నెల 3 నుండి 12 రోజులు మాత్రమేనని ఒక ప్రకటనలో బిఎస్ఎన్ఎల్ పేర్కొంది.

రేపు ఉపరాష్ట్రపతి ఎన్నిక

రేసులో వెంకయ్య నాయుడు, గోపాలకృష్ణ గాంధీ



న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికకు రంగం సిద్ధమైంది. హమీద్ అన్సారీ పదవీకాలం ఈనెల 10వ తేదీతో ముగియనుంది. ఈలోగా ఎన్నిక ప్రక్రియను ముగించి, కొత్త ఉపరాష్ట్రపతిని ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. అధికార ఎన్డీయే, విపక్ష యూపీయే పార్టీల మధ్య ప్రధానంగా పోరు జరుగుతోంది. రెండు కూటములు తమ అభ్యర్థులుగా సమర్థులను బరిలోకి దింపాయి. ఎన్డీయే తరపున తెలుగు వ్యక్తి, సీనియర్ బీజేపీ నేత ముప్పవరపు వెంకయ్య నాయుడు పోటీలో ఉన్నారు. కాగా, యూపీఏ తరపున జాతిపిత మహాత్మాగాంధీ మనుమడు గోపాలకృష్ణ గాంధీని కాంగ్రెస్ రంగంలోకి దించింది. వీరిలో ఒకరు రాజకీయ అనుభవజ్ఞుడు కాగా, మరొకరు ఐఏఎస్ అధికారిగా, వివిధ దేశాల్లో భారత దౌత్యాధికారిగా పనిచేసిన నిష్ణాతులు. రేపు ఉదయం పార్లమెంటు సెంట్రల్‌హాలులో జరిగే ఎన్నికలో ఇరు సభల పార్లమెంటు సభ్యులు తమ తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. అదేవిధంగా రాష్ట్రపతి ఎన్నికలో ఓటేయని నామినేటెడ్ ఎంపీలు ఈసారి ఓటు వేయనున్నారు. రాష్ట్రపతి ఎన్నిక మాదిరిగానే ఇదికూడా పరోక్ష ఎన్నికే. వివిధ రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు ఉపరాష్ట్రపతిని ఎన్నుకోనున్నారు. ఉపరాష్ట్రపతి రాజ్యసభలో ఎక్స్ అఫిసియో చైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

ఎన్నిక ప్రక్రియ

- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నిక జరుగుతుంది.
- బ్యాలెట్ పేపర్‌పై పోటీ చేస్తున్న అభ్యర్థుల పేర్లు ఉంటాయి. పార్టీ గుర్తులు ఉండవు.
- ఓటు చీటీపై రెండు విభాగాలు ఉంటాయి. మొదటికాలంలో అభ్యర్థి పేరు,రెండవ కాలంలో ప్రాధాన్యత క్రమం ఉంటుంది.
- బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్యను బట్టి ప్రతి ఎంపీ ప్రాధాన్యత ఓట్లను ఎంతమందికైనా వేయొచ్చు.
- మొత్తం ఓట్లలో యాభై శాతానికి మించి ఓట్లు సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు.
- ప్రస్తుతం అర్హులైన ఓటర్లు 790 మంది ఉన్నారనుకుంటే, విజేతకు 396 ఓట్లు రావాలి.
- మొత్తం బ్యాలెట్ల పేపర్ల నుంచి చెల్లని ఓట్లను వేరుచేస్తారు.
- మొదటి ప్రాధాన్యత క్రమంలో ఆయా అభ్యర్థుల బ్యాలెట్ పేపర్లు విడివిడిగా ఉంచుతారు.
- మొదటి రౌండ్‌లో స్పష్టమైన మెజారిటీ లభిస్తే సరేసరి. లేదంటే ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. ఓట్ల విలువను గణించి విజేత ఎవరన్నది నిర్ణయిస్తారు.

పదవీకాలం..?

- రాష్ట్రపతి మాదిరిగానే ఐదేళ్లు పదవిలో కొనసాగుతారు.

అర్హతలు

- రాష్ట్రపతిగా పోటీచేసే అభ్యర్థులు భారత పౌరుడై ఉండాలి
- 35 సంవత్సరాల వయసు నిండివుండాలి
- కచ్చితంగా రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారై ఉండాలి
- కేంద్ర, స్థానిక సంస్థల్లో లాభాపేక్ష పొందే స్థానాల్లో ఉండకూడదు.
- అయితే, గవర్నర్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఈ పదవికి అర్హులు
- అదేవిధంగా సదరు అభ్యర్థి ప్రమాణపత్రాన్ని బలపరుస్తూ కనీసం 20 మంది ఎలక్టోరల్ కాలేజీ ఓటర్లు సంతకాలు చేయాలి.
- ఒక ఎంపీ ఒకరి కంటే ఎక్కువ మందిని బలపరచడానికివీల్లేదు.
- ఎన్నిసార్లయినా ఈ పదవికి పోటీ చేయవచ్చు. పదవిని చేపట్టవచ్చు.
- రాజీనామా, మరణం, తొలగింపు సందర్భాలలో మాత్రమే అర్థాంతరంగా ఉపరాష్ట్రపతి పదవి ఖాళీ అవుతుంది. మరొకరిని కొత్తగా ఎన్నుకుంటారు.
- అలాంటి సందర్భాల్లో మరొకరు ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యే వరకు రాజ్యసభ డిప్యూటీ చైర్మనే ఎక్స్ అఫిసియో బాధ్యతలు నిర్వహిస్తారు.
- అవిశ్వాస తీర్మానం ద్వారా ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తప్పిస్తారు. ఇందుకు 14 రోజులు ముందుగా సభ్యులు నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. 50శాతం కంటే ఎక్కువ సభ్యుల మద్దతుతో లోక్‌సభ తీర్మానాన్ని రాజ్యసభలో ప్రవేశపెడతారు.
- భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇంతవరకు ఏ ఒక్కరు కూడా అవిశ్వాసాన్ని ఎదుర్కోలేదు.

స్వాతంత్ర్య భారతంలో ఉపరాష్ట్రపతులు వీరే..

)పేరు	పదవీకాలం	ప్రత్యర్థి	మొత్తంఓట్లు	లభించిన ఓట్లు
హమీద్ అన్సారీ	2007-12	నజ్మా హెప్తుల్లా	790	455
	2012-17	జశ్వంత్ సింగ్	790	490
బైరాన్‌సింగ్ షెకావత్	2002-2007	సుషీల్‌కుమార్ షిండే	790	454
క్రిష్ణకాంత్	1997-2002	సూర్జిత్‌సింగ్ బర్నాలా	790	441
కేఆర్ నారాయణన్	1992-97	జోగిందర్‌సింగ్	790	700
శంకర్ దయాళ్‌శర్మ	1987-92	-	-	(ఏకగ్రీవం)
ఆర్ వెంకట్రామన్	1984-87	బీసీ కాంబ్లే	-	(విజయం)
హిదయతుల్లా	1979-84	-	-	(ఏకగ్రీవం)
బీజీ జట్టి	1974-79	ఎన్ఈ హోరా	-	(విజయం)
జీఎస్ పాఠక్	1969-74	-	679	(ఏకగ్రీవం)
వీవీ గిరి	1967-69	మహ్మద్ హబీబ్	679	483
జాకీర్ హుస్సేన్	1962-67	-	679	(ఏకగ్రీవం)
సర్వేపల్లి రాధాకృష్ణన్	1952-57-62	-	679	(ఏకగ్రీవం

ఒక్కో ఎంపీ ఓటు విలువ?

- రాష్ట్రపతి ఎన్నికలో మాదిరిగానే ఇక్కడా, ఎంపీల ఓటు విలువ ఒకేలా ఉంటుంది.
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు మొత్తం 790 మంది
- లోక్‌సభ సభ్యులు 545 (ఇద్దరు నామినేటెడ్ సభ్యులు), రాజ్యసభ ఓటర్లు 245 (12 మంది నామినేటెడ్ సభ్యులు)

పార్టీ ఫిరాయింపుల చట్టం పాత్ర?

స్థానిక సంస్థల ఎన్నికలకు భిన్నంగా ఈ ప్రక్రియ ఉంటుంది. పార్టీ ఫిరాయింపుల అంశం ఇక్కడ ప్రస్తావనకు రానేరాదు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలో ఏ ఓటరుకూ ఆయా పార్టీలు ఎలాంటి విప్‌లు (ఆంక్షలు) జారీచేయడానికి వీల్లేదు. పార్టీల ఆంక్షలను ఎంపీలు పాటించాల్సిన అవసరం ఆంతకంటే లేదు.

ఎన్నిక వివాదాలు?

ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన అన్ని వివాదాలను సుప్రీం కోర్టు పరిధిలోనే పరిష్కారం అవుతాయి. అభియోగాలు, ఆరోపణలపైనా విచారణకు ఆదేశించే అధికారం కూడా సర్వోన్నత ధర్మాసనానిదే. రాజ్యాంగంలోని ఆర్టికల్ 71 (1) ప్రకారం ఐదుగురు సభ్యుల సుప్రీం బెంచ్ ఈ వివాదాలను విచారిస్తుంది.

ఎన్నికల్లో అవకతవకలు, పోలింగ్‌లో అవాంతరాలు, బ్యాలెట్ పేపర్లలోని తప్పొప్పులు తదితర అంశాలపై సుప్రీం నిర్ణయమే అంతిమం. అభ్యర్థి ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే అనర్హుడిగా ప్రకటించే అధికారమూ సుప్రీంకే ఉంటుంది.

జీతభత్యాలు?

ఉపరాష్ట్రపతి పదవిలోని వ్యక్తి జీతభత్యాలపై స్పష్టమైన సమాచారం లేదు. కేవలం రాజ్యసభ ఎక్స్‌అఫిసియో సభ్యుడి హోదాలోనే ఆయన జీతభత్యాలు అందుకుంటారు.

ప్రస్తుతం నెలసరి వేతనం కింద రూ. 1.25లక్షలు లభిస్తుంది. దీనితోపాటు రోజువారీ భత్యాలు, అలంకృతమైన ఉచిత నివాస సదుపాయం, వైద్య, ప్రయాణ, ఇతర సౌకర్యాలు ఉంటాయి. ఒకవేళ ఏదేని పరిస్థితిలో రాష్ట్రపతిగా తాత్కాలిక బాధ్యతలు చేపడితే ప్రథమ పౌరుడికి లభించే వేతనం, పెన్షన్ యథాతథంగా ఇతనికీ వర్తిస్తాయి.

తెరాసకు అధికారం శాశ్వతం కాదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా



హైదరాబాద్,ఆంధ్రప్రభ : అధికారం ఏ ఒక్కరికో శాశ్వతం అనుకోవడం భ్రమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. సీఎం చంద్రశేఖ ర్‌రావు అధికార మదంతో కమ్యూనిస్టుల పై విమర్శలు చేయడం సరికాదని గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వానిపే ప్రజలు కన్నెర్రజేసే సమయం ఆసన్నమైందని ఆయన హెచ్చరించారు. ప్రగతి భవన్ ఎదుట హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే కాంట్రాక్టు కార్మికుల ఆందోళనకు కవరేజికి వెళ్లిన మీడియాపై పోలీసులు దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అధికార, విపక్ష పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు హుందాతనంగా ఉండాలన్నారు.

మీరాకుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు, మీడియా దాడిని ఖండిస్తున్నాం:తమ్మినేని

'కమ్యూనిస్టులది త్యాగాల చరిత్ర, పేదల పక్షాన పోరాటం చేసేది కమ్యూనిస్టులే. విమర్శలు చేసే ముందు సీఎం చంద్రశేఖర్ రావు వాస్తవాలు తెలుసుకోవాలి' అని సీపీఎం రాష్ట్ర తమ్మినేని వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. 2004, 2009, 2014 ఎన్నికల్లో కమ్యూనిస్టులు గొప్ప వాళ్లు, నిజాయితీ పరులని పొగిడి పొత్తు కోసం వెంపర్లాడిన విషయం గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. గురువారం టీ మాస్ సంస్థ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పైన ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తమ్మినేనితో పాటు టఫ్ అధ్యక్షురాలు విమలక్క, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు తదితరులు హాజరయ్యారు.

ముస్లిం రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు

ప్రధాన మంత్రి నరేంద్రమోడి ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకమేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు పేర్కొన్నారు. ముస్లిం రిజర్వేషన్లకు ప్రధాన మంత్రి ఒప్పుకున్నారని సీఎం చంద్రశేఖర్‌రావు చేసిన వ్యాఖ్యాలను ఆయన ఖండించారు. ముస్లింల రిజర్వేషన్లపై పార్టీలో ఒకే నిర్ణయం ఉంటుందన్నారు. కేసీఆర్ పాలనలో దళితులు బోర్డులు పెట్టుకోవాలా..? అని ఆయన నిలదీశారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మీడియా తో మాట్లాడారు. నేరెళ్ల బాధితులు జైల్ నుంచి విడుదల అవుతున్నారని, మీడియా దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్ సమావేశం ఏర్పాటు చేశారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని దళితులపై జరుగుతున్న దాడులకు టీఆర్‌ఎస్ బాధ్యత వహించాలన్నారు. ప్రగతి భవన్ ఎదుట జర్నలిస్టులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

రైతులను సర్కార్ విస్మరిస్తోంది



హుజూర్‌నగర్(రూరల్), కెఎన్‌ఎన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను విస్మరించడంతో అనేక ప్రాంతాలలో రైతులు ఆత్మహత్యాలు చేసుకుంటున్నారని తెలంగాణ పీసీసీ అధ్యక్షులు, హుజూర్‌నగర్ శాసనసభ్యులు నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. గురువారం నల్గొండ జిల్లా, హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగిరి గ్రామంలో సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 22 లక్షల 50వేల రూపాయలతో నిర్మించిన వ్యవసాయ గిడ్డంగిని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోర వైఫల్యం చెందిందని ఆరోపించారు. రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. నాలుగు విడతలగా రుణమాఫీ చేసినప్పటికి వడ్డీ ప్రభుత్వమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యంపై 50 శాతం అదనంగా ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని కోరారు. 2019లో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఒకేసారి రుణమాఫీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. బీజేపి పాలనలో ఉన్న మధ్యప్రదేశ్‌లో రైతులపై కాల్పులు జరిపారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యల పరిష్కారంలో విఫలం చెందాయని అన్నారు. లింగగిరి గ్రామ రైతుల అభ్యర్ధన మేరకు లిఫ్టు మంజూరి చేయడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా సహకార సంఘం చైర్మన్ పాండురంగారావు మాట్లాడుతూ సహకార బ్యాంకులు అన్ని రకాల అవసరాల కు రుణాలు అందజేస్తుందని తెలిపారు. వాహనాల కొనుగోలు, విద్యార్థుల చదువులకు, రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు.

కొట్లాడి సాధించాం

● ఎవరి దయాదాక్షిణ్యాల మీద తెలంగాణ రాలేదు ● కాంగ్రెస్‌ది దింపుడు కళ్లెం ఆశ

● నిరాశ, నిస్పృహాలతో పనికిమాలిన ఆరోపణలు ● నిప్పులు చెరిగిన ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాల మీద రాలేదని, బరిగీసి కొట్లాడినందువల్లే.. బలిదానాలు చేసి రక్తం చిందించడం వల్లే రాష్ట్రం వచ్చిందని రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం టిఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో చీఫ్‌విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లతో కలిసి మాట్లాడారు. రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమనేతకే ప్రజలు రాష్ట్రం బాగుచేసే బాధ్యత అప్పగించారని, అందుకు తగ్గట్లుగా దేశంలోనే ఆదర్శరాష్ట్రంగా నిలిచేందుకు ఎంతో కష్టపడి పనిచేస్తున్నామన్నారు. ఎక్కడ కూడా వేలెత్తి చూపకుండా పనిచేసి మూడేళ్ళలో ప్రజావిశ్వాసాన్ని పొందామన్నారు. కేంద్రప్రభుత్వమే కాదు దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలు తెలంగాణ వైపు చూస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక దశ, దిశ.. కమిట్‌మెంట్ ఉందని మెచ్చుకుంటున్నారన్నారు. ఇవన్నీ చూసి ఓర్వలేని కాంగ్రెస్ నేతలు సిఎం వేగాన్ని కాళ్ళల్లో కట్టెలు పెట్టి ఆపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. తమ పరిపాలనా దక్షతను జీర్ణించుకోలేని పార్టీ కాంగ్రెస్ అన్నారు. పదవే పరమావధిగా, అధికారమే ధ్యేయంగా బతికే పార్టీ కాంగ్రెస్ అని, తాము తెలంగాణను ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నం చేస్తుంటే అనేక రకాల కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మీరు ఏం చేసినా.. తమ కార్యదీక్షను, కమిట్‌మెంట్‌ను అడ్డుకోలేరని ఆయన విమర్శించారు. నిరాశానిస్పృహలతో ప్రతి చిన్న విషయానికి బురదజల్లే ప్రయత్నం చేసి మీరే అభాసుపాలవుతున్నారంటూ ఈటల ధ్వజమెత్తారు. 2004లో జలయజ్ఞం మొదలు పెట్టిన కాంగ్రెస్ నేతలు తెలంగాణలో ఎన్ని ప్రాజెక్టులు పూర్తిచేశారని, నాలుగువందల కోట్ల అంచనాలతో రెండేళ్ళలో పూర్తిచేస్తామని మొదలుపెట్టిన మిడ్‌మానేరును పదేళ్ళలో కూడా ఎందుకు పూర్తిచేయకుండా రైతుల కళ్ళల్లో మట్టికొట్టారన్నారు. తాము నిర్దేశిత ప్రణాళికతో పనులు పూర్తిచేస్తున్నామని, మిడ్‌మానేరును రెండేళ్ళలోనే పూర్తిచేసి పది టిఎంసిల నీరు నిలిపే స్థాయికి తెచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కాలయాపన వల్ల రూ.16వేల కోట్లతో ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ళ అంచనాలు రూ.35వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. అలాంటి పద్దతులకు తెలంగాణ ప్రభుత్వం పాతరేసిందన్నారు. అనుకున్న లక్ష్యాలతో తాము ముందుకు వెళుతున్నామని, కాంగ్రెస్ నేతల మాటలు విని ప్రజలు సిగ్గుపడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ఈ దేశాన్ని పాలించింది తామే అని అహంకారంతో ఉంటారని, కానీ కాంగ్రెస్ ఏలిన 45ఏళ్ళలో ప్రజల కనీస అవసరాలను తీర్చలేక చతికిలపడ్డారన్నారు. తాము అనుభవం లేకున్నా తమ పనితీరుతో శబాష్ అనిపించుకున్నామన్నారు. మూడేళ్ళలో 200సమస్యలు పరిష్కరించామని, తమకు కాంగ్రెస్ నేతలు మద్దతు ఇవ్వకున్నా ఫర్లేదని, కానీ కువిమర్శలు చేయవద్దన్నారు.

అన్నీ చేస్తున్నాం...

వెయ్యిరూపాయల పెన్షన్ ఇస్తాం అన్నపుడు డబ్బులు ఎక్కడివి అంటున్నారని, కానీ తాము ఇచ్చి చూపిస్తున్నామని మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆడపిల్ల పెళ్ళికి రూ.51వేలు ఇస్తామంటే డబ్బులు ఎక్కడివి అన్నారని కానీ రూ.75వేలు కూడా ఇస్తున్నామన్నారు. సన్నబియ్యం పథకం కూడా ఆగకుండా నడుస్తోందని, రెసిడెన్షియల్ స్కూల్స్‌కి దిక్కులేకపోతే తమ ప్రభుత్వంలో 504రెసిడెన్షియల్‌ని ఒకేసారి మొదలుపెట్టామన్నారు. ఆ రోజుల్లో పవర్ లేక పంటలు ఎండిపోతే ఇపుడు 24గంటలు పవర్ అందిస్తున్నామన్నారు. తెరాసకు ఉద్యమాలు తెలుసు.. నినాదాలు తెలుసు.. పరిపాలన ఏం తెలుసు అన్న వారికి గత మూడేళ్ల తమ ప్రభుత్వ పాలనే సమాధానమన్నారు. అనేక అడ్డంకులు అధిగమిస్తూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ గొప్పగా నిలుపుతున్నాడన్నారు. ప్రజల కోణంలో.. ప్రజావిశ్వాసంతో ప్రభుత్వాన్ని నడుపుతున్నామన్నారు. తమకు కాంగ్రెస్ నేతల్లాగా భూ ఆక్రమణలు చేసే నైపుణ్యం లేదని, పదవే పరమావదిగా బతికే నైపుణ్యం లేదన్నారు. తమకు నాలుగు ఆశలున్నాయని.. ఆకలికేకలు, ఆత్మహత్యలు లేని ఆకుపచ్చ తెలంగాణ సాధనే తమ లక్ష్యమన్నారు. అందరూ ఛీ కొడుతున్నా.. పదవి వస్తుందన్న దింపుడు కళ్ళం ఆశతో తెలంగాణలో కాంగ్రెస్ రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఒక పార్టీ గల్లంతైందని, కాంగ్రెస్‌కు కూడా అదే పరిస్థితి తలెత్తుతుందన్నారు. అనుభవం ఉన్న నాయకులు కూడా నోటికొచ్చినట్లు మాట్లాడడం తగదన్నారు.

కడుపు రగిలే... కేసీఆర్ మాటలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిర్వాకాలకు కడుపురగిలే ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడారని, ప్రాజెక్టులపై 168కేసులు కాంగ్రెస్ నేతలు వేసినవేనని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. గురువారం టిఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెకె మహేందర్‌రెడ్డి, రచనారెడ్డి వంటి నేతలు కాంగ్రెస్ కాదా అని ఆయన ప్రశ్నించారు. కొండపోచమ్మసాగర్ ప్రాజెక్టుకు 4630ఎకరాలు అవసరం కాగా, 4507ఎకరాల భూమి ఇప్పటికే సేకరించడం జరిగిందన్నారు. ఇంకా కేవలం 123ఎకరాలు సేకరించాల్సి ఉంటే మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడితో సహా ఆరుగురు కాంగ్రెస్ నేతలు కోర్టుకు వెళ్ళి అడ్డుపడుతున్నారన్నారు. షబ్బీర్ అలీ పదేపదే కెటిఆర్‌పై విమర్శలు చేస్తున్నారని, తాము తప్పు అని.. అనేకసార్లు వివరణలు ఇచ్చినా హిమాన్షుమోటార్స్ పేరును తరచూ ప్రస్తావించడం అనైతికమన్నారు. హిమాన్షుమోటార్స్‌లో 2007నుండి ఎలాంటి లావాదేవీలు జరగలేదన్నారు. ప్రతి చిన్న అంశానికి రాజకీయ రంగు పులమడమే లక్ష్యంగా కాంగ్రెస్ నేతలు పనిచేస్తున్నారని, ఇది శవాల మీద పేలాలు ఏరుకోవడమేనన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ము,ధైర్యం ఉంటే వాస్తవ ఆధారాలతో రావాలని, ఏ వేదికమీద అయినా తాము చర్చకు సిద్దమన్నారు. జానారెడ్డి వ్యాఖ్యలను కూడా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

రేవంత్ రాజకీయ ఉన్మాది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణలో టిడిపి అంతర్ధానమైందని, ఆ పార్టీ నాయకుడు రేవంత్‌రెడ్డి రాజకీయ ఉన్మాదిలా మాట్లాడుతున్నాడని టిఆర్‌ఎస్ ఎంపీ బాల్క సుమన్ విమర్శించారు. గురువారం తెలంగాణభవన్‌లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితుల గురించి మాట్లాడే అర్హత టిడిపికి లేదన్నారు. వారి ప్రభుత్వ హయాంలో దళితులను ఊచకోత కోసింది నిజం కాదా అని ఆయన ప్రశ్నించారు. కెసిఆర్ కుటుంబంలో అందరిమీదా ఆరోపణలు చేసిన రేవంత్ ఇపుడు సంతోష్ మీద చేస్తున్నారన్నారు. రేవంత్ తన పద్దతి మార్చుకోకుంటే తగిన గుణపాఠం తప్పదన్నారు. జానారెడ్డికి ఎందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ ఉన్నదే చెప్పారని, జానారెడ్డి ఏదో ఆవేశపడుతూ మాట్లాడడానికి ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ సుమన్ ఎద్దేవా చేశారు. కెసిఆర్ చెప్పిన దాంట్లో తప్పు ఏముందో చెప్పాలని జానారెడ్డిని కోరారు.

కేసీఆర్‌కు మానవత్వం లేదు

● సిరిసిల్ల ఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలి: ఎల్ రమణ

● నేడు బాధితులను పరామర్శించనున్న తెదేపా నేతలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఏ మాత్రం మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్. రమణ మండిపడ్డారు. ఆయన కుమారుడు కేటీఆర్‌కు రాజకీయ జన్మనిచ్చిన ప్రాంతంలోని ఆడబిడ్డలు కన్నీరు పెడుతుంటే కనీసం వారిని పరామర్శించే ప్రయత్నం కూడా చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పైగా సిఎం కేసీఆర్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశాన్ని రెండు గంటల పాటు నిర్వహించి నేరేళ్ళలో దళితులపై దాడి అనుకోకుండా జరిగిన సంఘటన అని అనడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం నేరేళ్ళకు వెళ్ళి బాధితులను పరామర్శించనున్నట్లు ఆయన తెలిపారు. వారికి అండగా ఉంటామన్నారు. పోలీసుల దాడుల్లో చనిపోయిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయాలపాలైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షలతోపాటు కార్పొరేట్ వైద్యం అందిచాలని రమణ డిమాండ్ చేశారు.

ప్రభుత్వ తీరు బాధాకరం: మోత్కుపల్లి

కేసీఆర్ పాలన నిజాంను మరిపించే విధంగా కొనసాగుతోందని పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. జైలు నుంచి బయటకు వచ్చిన ఎనిమిది మంది యువకులను పోలీసులు బెదిరించం, వారి భార్యలను అవమానపరిచే విధంగా కేసులు పెడతామని హెచ్చరించడం వంటి చర్యలను చూస్తుంటే అసలు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అంటూ ఒకటుందా? అన్న అనుమానం తలెత్తుతోందని విమర్శించారు. ప్రభుత్వ చర్యలను తెదేపా తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

దుర్యోధనుడిని మరిపిస్తున్నాడు: రేవంత్

'కేసీఆర్ వ్యవహార శైలి మయసభలో దుర్యోధనుడిని కూడా మరిపించే విధంగా ఆడంబరంతో అధికార మదంతో మాట్లాడారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో జరిగిన కీలక సంఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలపై సిఎం చెబుతారాని ఆశించామన్నారు. నయీం కేసు గురించి గానీ, మియాపూర్ భూ కుంభకోణం, ఇసుక, డ్రగ్స్ మాఫీయాలపై ప్రభుత్వంతీసుకున్న చర్యలు ప్రజలకు వివరిస్తారని ఆశించామన్నారు. కానీ దోపిడి దారులకు ఇంకా దోచుకునేందుకు ప్రొత్సహించే విధంగా సిఎం ప్రసంగం ఉందని తీవ్ర అసంతృప్తి, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నేరేళ్ళ ఘటనపై తెదేపా జాతీయ మానవ హక్కుల సంఘం, ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం
- ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఉద్యోగి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలనిడిమాండ్ చేస్తూముఖ్య మంత్రి క్యాంపు కార్యాలయం ముట్టడించారు. సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి ప్రయత్నించిన కాంట్రాక్ట్ ఉద్యోగులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్యోగుల్లో ఒకరు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ముట్టడికి ప్రయత్నించిన కాంట్రాక్ట్ సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు.

సీఎం చిల్లర మాటలు

● కాంగ్రెస్ పిశాచి అయితే... సోనియా కాళ్లెందుకు మొక్కావు? ● సీఎం స్థాయిని దిగజారుస్తున్నావు

● మీరాకుమార్, జైరాం రమేష్‌కు క్షమాపణ చెప్పాలి ● మండిపడ్డ కాంగ్రెస్ నేతలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్థాయిని మరచి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. విలేఖరుల సమావేశంలో సీఎం మాట్లాడిన తీరు చూస్తుంటే ప్రజలు చీకొడుతున్నారనే భయంతో నిరాశా, నిస్పృహలతో అవాకులు, చవాకులు పేలారని మండిపడింది. కేసీఆర్ ఆయన కుటుంబానికి ఇసుక లారీలు ముఖ్యమో..., ప్రజల ప్రాణాలు ముఖ్యమో తేల్చుకోవాలని సవాల్ చేసింది. తెలంగాణ బిల్లు ఆమోదానికి సహకరించిన మీరాకుమార్, కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేష్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. తెలంగాణ బిల్లు ముసాయిదా రూపొందించడంలో ముఖ్య పాత్ర పోషించిన జైరాం రమేష్‌పైనే కేసీఆర్ విమర్శలు చేయడం చూస్తుంటే ఆయన మానసిక స్థితి ఏ విధంగా ఉందో ఆలోచించుకోవాల్సి వస్తోందని అభిప్రాయపడింది. కాంగ్రెస్ పార్టీ పిశాచి అయితే తెలంగాణ ఇచ్చిన తర్వాత కుటుంబంతో సహా సోనియా గాంధీ కాళ్లెందుకు మొక్కావని ప్రశ్నించింది. ప్రజలు టీఆర్ఎస్ సర్కార్‌ను తరిమి తరిమి కొట్టే రోజు త్వరలో రాబోతోందని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ విమర్శలకు కాంగ్రెస్ నాయకులు గురువారం తీవ్రంగా స్పందించారు.

కేసీఆర్‌కు కళ్లు నెత్తికెక్కాయి:ఉత్తమ్

సీఎం కేసీఆర్‌కు కళ్లు నెత్తికెక్కి చిల్లర రాజకీయాలు చేస్తూ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. అహంకారం...అధికార మదం.., అసహనం.., ప్రజలు చీకొడుతున్నారనే భయంతో అడ్డగోలుగా కాంగ్రెస్‌పై విమర్శలుచేస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వారి నుంచి వస్తున్న వ్యతిరేకతతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. పోలీసులకు దళితుల అని తెలుస్తదా ..ఎలా తెలుస్తుంది...నుదుటి మీద రాసిపెట్టి ఉంటుందా ? లారీకి నిప్పుపెడితే పోలీసులు కొట్టరా ? అని కేసీఆర్ ఆరోపించడాన్ని ఆయన తప్పుబట్టారు. దళితులు కావచ్చుమరెవరైనా కావచ్చు... పోలీసులు కొట్టవచ్చా ? కొట్టే అధికారం వారికెవరు ఇచ్చారని ఉత్తమ్ ప్రశ్నించారు. తన అసమర్థత కప్పి పుచ్చుకోవడానికే కేసీఆర్ పోలీసులను వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు.

కోర్టులకు వెళ్లటం తప్పా?

ప్రజలు న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించడం తప్పెలా అవుతుందో కేసీఆర్ చెప్పాలని మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. భూనిర్వాసితులు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని కోర్టులకు వెళ్లారని, అదే విధంగా ప్రభుత్వం విధానాల పరంగా అన్యాయం జరుగుతోందని భావించి నిరుద్యోగులు కోర్టులకు వెళ్లటం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. అన్ని రంగాలను చేతుల్లో ఉంచుకున్న కేసీఆర్ జ్యూడీషియరీని కూడా చెప్పుచేతుల్లో ఉండాలని అనుకుంటున్నారని ఆరోపించారు.

కేసీఆర్‌ది పైశాచికం: జానారెడ్డి

సీఎం కేసీఆర్ అధికారమనే అహం తో పైశాచికంగా మాట్లాడుతున్నారని జానారెడ్డి విమర్శిచారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం చేసే మంచి కార్యక్రమాలకు మద్దతు ఇస్తున్నామని, అయినప్పటికీ, అడ్డగోలుగా కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేయడం సహించే ప్రసక్తి లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేకుండా చేయాలనే దురాలోచనతో ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు.

నీ గత చరిత్ర చూసుకో: షబ్బీర్

సీఎం కేసీఆర్ తన గత చరిత్ర చూసుకోకుండా విమర్శలు చేస్తున్నారని, యూత్ కాంగ్రెస్ కంటె ముందు ఏం చేసే వాడివో ఆలోచించుకోవాలని మండలిలో విపక్ష నాయకుడు మహ్మద్ అలీషబ్బీర్ కోరారు. గురువారం శాసనసభ కమిటీ హాలులో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని పిశాచి అంటావా ..? నీకు రాజకీయ జన్మఇచ్చింది కాంగ్రెస్ కాదా ? యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా హోదాను కల్పించిన పార్టీ మా పార్టీ కాదా ? అప్పుడే పిశాచి అయ్యిందా ? తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అప్పుడే చెడ్డపార్టీ అయ్యిందా అని ప్రశ్నించారు.

సంస్కారం అడ్డొస్తోంది:డీకే

సీఎం పదవిలో ఉన్న కదాని ఇష్టమొచ్చినట్లు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తే సహించే ప్రసక్తిలేదని సీనియర్ ఎమ్మెల్యే డీకే అరుణ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు కేసీఆర్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. గురువారం గద్వాలలో ఆమె విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో సీఎం మాట్లాడిన తీరు సిగ్గుపడే విధంగా ఉందని ఆరోపించారు.

న్యాయ వ్యవస్థను కించపర్చొద్దు : పొంగులేటి

న్యాయవ్యవస్థను కించపర్చే విధంగా సీఎం కేసీఆర్ మాట్లాడడం సరికాదని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డి ఆరోపించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తున్నారని విమర్శించారు. సీఎం పీఠాన్ని కించపర్చే విధంగా మాట్లాడడం కేసీఆర్‌కు తగదన్నారు.

ఇక డ్రగ్స్ మూలాలపైనే దృష్టి

● విచారణ ఎదుర్కొన్న స్టార్స్ అనుమానితులే... ● వీడియో రికార్డింగ్‌ను ఐదు గంటలకు కుదిస్తున్న సిట్ ● రెండో లిస్టు లేనట్లే...ఒత్తిళ్లే కారణమా??

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన డ్రగ్స్ కేసులో ఎక్సైజ్ సిట్ దూకుడుని కొనసాగిస్తోంది. డ్రగ్స్ మూలాలపై ప్రధానంగ దృష్టి కేంద్రీకరిస్తూనే మరోవైపు డ్రగ్స్ మాఫియాల భరతం పడుతూనే ఉంది. అయితే ఇప్పటివరకూ 12 మంది సినీస్టార్స్, 30 మంది ఇతర రంగాల వారిని, మరో 30 మంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను ఎక్సైజ్ సిట్ ప్రశ్నించింది. అయితే, వారిని అను మానితులుగానే గుర్తించి విచారణకు పిలిచామని సిట్ వర్గాలు చెబుతున్నాయి. విచారణ ఎదుర్కన్న వారిని మళ్లీ ఎప్పుడైనా పిలిచే అవకాశముందంటున్నాయి. కొంత మంది రక్త నమూనాలను సేకరించినట్లు, విచారణ సమయంలో వందల గంటల వీడియో రికార్డింగ్‌ను ఎక్సైజ్ సిట్ చేపట్టింది. ఒక్కొక్కరి వీడియో రికార్డ్ ఐదు గంట లు తగ్గకుండా ఎక్సైజ్ సిట్ ఫైనల్ ఎడిట్ చేసినట్లు తెలుస్తోంది. అంతేకాదు వీడియో రికార్డింగ్‌ను మొత్తం స్క్రిప్ట్ రూపంలో ఎక్సైజ్ సిట్ తయారు చేస్తున్నట్లు సమాచారం. రక్తనమూనాల నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు వుండే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఇప్పటివరకు విచారించిన వారి వద్దనుంచి లిఖిత పూర్వక స్టేట్‌మెంట్‌ను ఎక్సైజ్ సిట్ తీసుకోలేదని తెలుస్తోంది. తదుపరి విచారణలో వారి నుంచి లిఖిత పూర్వక స్టేట్‌మెంట్‌ను ఎక్సైజ్ సిట్ సేకరించే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే సెకండ్ లిస్టు నివేదిక సిద్ధమైందని, వారిలో ఇంకొందరు ప్రముఖ సినీ స్టార్స్ ఉన్నట్లు ప్రచారం జరిగినప్పటికీ రెండో లిస్టు ఇప్పట్లో ఉండబోదని సిట్ వర్గాలు వెల్లడిచేస్తున్నాయి. ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో రెండో లిస్టు విడుదల కొంత అనుమానమేన్న చర్చ కొనసాగింది. తాజాగా సిట్ వర్గాలు సైతం రెండో లిస్టు ఇప్పట్లో లేనట్లేనన్న సంకేతాలు వెలువరిస్తున్న నేపథ్యంలో ఈ వాదనకు బలం చేకూరినట్లయింది.

బీసీ బిల్లుకు సంపూర్ణ మద్దతు

చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి జోగు రామన్న



హైదరాబాద్,ఆంధ్రప్రభ: బీసీ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్ధతునిస్తుందని తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రూపొందించిన చలో ఢిల్లీ పోస్టర్‌ను మంత్రి తన నివాసంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు భిక్షపతి, దుర్గయ్య గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రంగౌడ్, కాలేరు నవీన్, జాజుల లింగం తదితరులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యువజన సంఘం జాతీయ నాయకుడు కర్రి వేణుమాధవ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య గురువారం బీసీ భవన్‌లో ఆవిష్కరించారు. గురువారం రెండు తెలుగు రాష్ట్రా లకు చెందిన యువజన సంఘాల విస్తృతస్థాయి సమావేశం బీసీ భవన్‌లో కర్రి వేణుమాధవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ ర్యాగ అరుణ్, గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, పృధ్వీగౌడ్, రాగిపణి రవీంద్ర చారి, కోట్ల శ్రీనివాస్, రామలింగం పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం పెంపు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : అసంఘటిత రంగ కార్మికులకు కేంద్రం తీపి కబురు చెప్పింది. దేశంలో అసంఘటిత రంగంలో ఉన్న వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, బీడి కార్మికులు, బొగ్గుగని కార్మికుల రోజువారీ కనీస వేతనాన్ని దాదాపు 42 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. నేషనల్ మినిమమ్ వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఎ.గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

'కమలం' కసరత్తు

● చురుగ్గా అసెంబ్లీ అభ్యర్థుల ఎంపిక

● ధనం, బలం, సామాజికంపై దృష్టి

● ఇప్పటికే దాదాపు 50 మంది గుర్తింపు

● సీనియర్ నేతకు నియోజక వర్గాల బాధ్యత

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాధారణ ఎన్నికలకు రెండేళ్ల సమయం ఉన్నప్పటికి.. అసెంబ్లీకి బరిలో నిలిచే నేతలపై కమలం పార్టీ కరసత్తు ప్రారంభించింది. 2019లో రాష్ట్రంలో అధికారం లోకి వస్తామని చెబుతున్న బీజేపీ నేతలు .. ఆ దిశగా పయనం సాగిస్తున్నారు. పార్టీ హైకమాండ్, ముఖ్యంగా పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా సూచనల మేరకు తెలంగాణలో పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ నియోజక వర్గాల పెంపు లేనట్లేనని.. పార్టీ హైకమాండ్ నుంచి రాష్ట్ర నాయకత్వానికి గతంలో సంకేతాలు వచ్చినట్లు, అందుకనే అభ్యర్థుల ఎంపికపై దృష్టిసారించినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఎన్నికల ముందు హడావుడిగా అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల ప్రజల్లోకి వెళ్లి ప్రతి ఓటరును కలిసే అవకాశం తక్కువగా ఉంటుందనే ఆలోచనతో ముందుస్తుగానే అభ్యర్థుల ఎంపిక దృష్టి సారించారు. గత ఎన్నికల్లో పోటీ చేసిన ఓడిన స్థానాలు, రెండో స్థానంలో ఉన్న నియోజక వర్గాలు, బరిలో నిలిచే బలమైన నాయకులను గుర్తించే పనిలో ప్రత్యేక టీం, అంతర్గతంగా పని చేస్తోంది. నియోజక వర్గంలో ఏ సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నాయి, ఆర్థికంగ బలంగా ఉండటమే కాకుండా ప్రజల్లో చొచ్చుకెళ్లే నాయకత్వంపై కూడా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు గాను దాదాపు 40 నుంచి 45 మంది అభ్యర్థులను పార్టీ గుర్తించినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో మీరే అభ్యర్థులు ఇప్పటి నుంచి కష్టపడి చేయడండి అంటూ మౌఖికమైన ఆదేశాలను కూడా ఇచ్చినట్లు తెలిసింది. ఇక పోతే ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డు నియోజక వర్గాలపైన కూడా బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రిజర్వ్‌డ్ నియోజక వర్గాలకు సంబందించి అభ్యర్థుల కసరత్తుపై గతంలో పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన సీనియర్ నేతకు అప్పగించినట్లు తెలిసింది. సదరు నేత ఇప్పటికే తనకు అప్పగించిన పనిని ప్రారంభించినట్లు సమాచారం. ఇదిలా ఉంటే అసెంబ్లీ బరిలో ఉండే వారి సంఖ్య ఒకరిద్దరి కంటే ఎక్కువగా ఉన్న నియోజక వర్గాల్లో మాత్రం ఎన్నికలకు ఆరు నెలలకు ముందు ప్రకటించాలనే ఆలోచనతో ఉన్నారు. ఇక పోతే పార్టీ పరిస్థితి, బలోపేతానికి తీసుకునే అంశాలపై ఫుల్‌టైం వర్కర్స్‌ను నియోజక వర్గానికి ఒకరిని చొప్పున నియమించిన విషయం తెలిసిందే. ఆ ఫుల్‌టైం వర్కర్స్‌కు ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో వాడిన లక్కీ బైక్‌లను దిగుమతి చేసి పంపిణి చేశారు. ఈ ఫుల్‌టైం వర్కర్స్ ఇప్పటికే రంగంలోకి దిగారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలుతో పాటు గత ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఇచ్చిన హామీల అమలు తీరుపై సేకరించే పనిలో ఉన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తేనే పార్టీపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని బీజేపీలోని ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు చేసిన కార్యక్రమాల కంటే.. ఇంకా స్పీడ్ పెంచాల్సి ఉంటుందని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు.

బ్రిక్స్‌కు ముందే 'డోక్లాం'



- ఇరుదేశాలకూ అదే మంచిదని చైనా భావన
- భారత్ తీరు కూడా చర్చల దారిలోనే

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరగనున్న బ్రిక్స్ సమావేశం కంటే ముందే డోక్లాంకు సంబంధించిన వివాదాన్ని భారత్‌తో పరిష్కరించు కోవాలని చైనా అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై భారత్‌తో ఆయన సమాలోచనలు జరుపనున్నట్లు ఆ దేశ అధికారవర్గాల సమాచారం. సరిహద్దులో స్నేహపూరిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఇరుదేశాలు చర్చలు ప్రారంభించాయి. చట్టపరంగా చైనా వాదనను భారత్‌కు తెలియజేయాలని చైనా భావిస్తోంది. ఇటీవల భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా జిన్‌పింగ్ ఇదే విషయంపై జిన్‌పింగ్‌తో చర్చలు జరిపారు. కాగా, ఈ వివాదంపై రెండు దేశాల జాతీయ ఛానళ్లు, పత్రికలు ప్రచురిస్తున్న కథనాలతో మరింత ఇబ్బందికర వాతావరణం నెలకొంటుంది. అయితే బ్రిక్స్ సమావేశాల కంటే మునుపే డోక్లాం వివాదం సద్దుమణుగు తుందన్న వార్తలు బీజింగ్ వస్తున్నా, ప్రస్తుత పరిణామాలు మాత్రం కొంత ఉత్కంఠగా ఉన్నాయి. పలు విషయాల్లో చైనా పాకిస్తాన్‌కు బహిరంగ మద్దతి వ్వాలని ప్రయత్నిస్తుండడమే అందుకు కారణం. ఇదివరకే ఇరుదేశాలు అణు రియాక్టర్లసరఫరా బృందంలో అడ్డగింపు, డోక్లాం వివాదంలో మునిగిన నేపథ్యంలో తాజాగా ఈ అంశంపై రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత బల హీనపరుస్తాయని దౌత్యవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ఇదిలా ఉండగా ఐక్యరాజ్యసమితి(ఐరాస) భద్రతా మండలిలో భారత్ ప్రతిపాదనకు చైనా మోకాలడ్డిన విషయం తెలిసిందే. మొత్తం 15 సభ్య దేశాల్లో 14 దేశాలు భారత ప్రతిపాదన ప్రకారం జమాత్ ఉద్ దవా అధినేత మసూద్ అజహర్‌ను ఉగ్రవాదిగా ప్రకటించేందుకు సంపూర్ణంగా మద్దతు ప్రకటించాయి. చైనా మాత్రం తన వైఖరి స్పష్టం చేయకుండా విషయాన్ని నాన్చుతుండడం తెలిసిందే. పఠాన్‌కోట్ ఉగ్రదాడుల కీలక సూత్రధారి మసూద్ అజహర్‌ను ఐక్యరాజ్యసమితిలో వెనకేసుకురావడంతో, ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు సంక్లిష్టంగా మారాయి. ఈ నేపథ్యంలో డోక్లాం ప్రతిష్టంభనకు దౌత్యపరమైన పరిష్కారం కనుగొనడం భారత్ కు కొద్దిగా ఇబ్బందికరమే. గత ఏడాది మార్చి నుంచి భారత్ ప్రతిపాదనకు తనకున్న వీటో అధికారంతో మసూద్ విషయంలో అడ్డుతగులుతున్న చైనా భారత దాయాది పాకిస్తాన్‌కు సాయం చేస్తోంది. దీంతో డోక్లాం విషయంలో చర్చలు సంక్లిష్టం కావడమే కాక, పీఓకేలో చైనా ప్రవేశం కూడా భారత్‌కు మింగుడు పడడం లేదు. ఇప్పటికే భారత్-చైనా మధ్య డోక్లాం వివాదం ముదురుతున్న నేపథ్యంలో ప్రస్తుత చైనా తీరు ఇరు దేశాల మధ్య విభేదాలను మరింత రెచ్చగొట్టే విధంగా ఉంది. దీంతో పాటు పీఎల్ఏ అధికారులు, అడపాదడపా చైనా అధ్యక్షుడు కూడా డోక్లాంను దృష్టిలో పెట్టుకుని భారత్‌ను బెదిరించే రీతిలో మాట్లాడుతున్నారు. ఇదంతా చైనా వాగాడంబరమేనని, భారత్ మాదిరిగానే ఆ దేశమూ మనతో యుద్ధానికి దిగే అవకాశం లేదని విశ్లేషకుల అంచనా. మనతో యుద్ధం చేస్తే తనకూ ఆర్థికంగా నష్టమే కాబట్టి చర్చలతోనే పరిష్కారానికి చైనా కూడా సిద్ధంగా ఉంది. కాకపోతే మాటల యుద్ధంతో ప్రత్యర్థిని బెదిరించి చర్చల్లో తనదే పైచేయి ఉండేలా చూసుకోవడంలో చైనాకున్న ప్రావీణ్యం ఎవరికీ ఉండదు. అయితే.. భారత్ కూడా అందుకు తగ్గ ఎత్తులతోనే కదులుతోంది. చర్చలు కావాలని చెబుతూనే డోక్లాంలో వెనక్కు తగ్గకుండా ఉంది. భూటాన్ తరపున తాను మాట్లాడి తీరుతానని స్పష్టం చేయడంతో.. పాక్ విషయంలో చైనా వైఖరిని పునరాలోచించుకునేలా చేసింది. ఈ విషయం ఆధారంగానే చైనా పాకిస్తాన్ నుంచి విరమించుకోక పోయినా, భవిష్యత్తులో భారత్, పాక్‌ల మధ్య వేలు పెట్టే రాజకీయాలు తగ్గించే అవకాశం ఉంది. మోడీ దౌత్యం కూడా ఆ దిశగానే సాగుతోంది. చైనా ఎంత బెదిరించినా తగ్గకుండా, మాట తూలకుండా ఉండడం దానినే సూచిస్తోంది.

చర్చలతోనే 'డోక్లం' పరిష్కారం: సుష్మా



ద్వైపాక్షిక చర్చల ద్వారానే డోక్లాం సమస్యను చైనాతో పరిష్కారం చేసుకుంటామని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ పేర్కొన్నారు. సరిహద్దు గొడవపై చైనాతో భారత్ యుద్ధం చేస్తుందన్న వాదనలను ఆమె కొట్టిపారేశారు. కాంగ్రెస్ సీనియర్ నేత ఆనంద్ శర్మ పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా గురువారం సుష్మా ఈ మేరకు వ్యాఖ్యానించారు. భూటాన్, భారత్‌కు సన్నిహిత దేశమన్నారు. ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' విధానం కేవలం భారతీయులకు మాత్రమే కాదని ఆ విధానం ఇరుగుపొరుగు దేశాలకు కూడా వర్తిస్తుందన్నారు. అందులో భాగంగానే భూటాన్ సరిహద్దు ప్రాంతమైన డోక్లాం సమస్యపై భారత్ జోక్యం చేసుకున్నట్లు చెప్పారు. చైనాతో కేవలం డోక్లాం అంశం మాత్రమే కాకుండా దౌత్యపరంగా నెలకొన్న ఇతర సమస్యలపై కూడా లోతుగా చర్చించాలని భావిస్తున్నట్లు చెప్పారు. చైనా కూడా శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆమె వెల్లడించారు. సమస్యకు యుద్ధం ఏ విధంగానూ పరిష్కారం కాదన్నారు. భారత విదేశాంగ విధానానికి మోడీ రూప కల్పన చేస్తున్నారని సుష్మా ఈ సందర్భంగా వెల్లడించారు. దాయాది పాకిస్థాన్ తీవ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని ఆరోపిస్తుందన్నారు. పాక్ తీవ్రవాదాన్ని విడిచిపెట్టేదాక ఆ దేశంతో చర్చలు జరిపేది లేదన్నారు.

పళనిపై పన్నీర్ ధ్వజం

చెన్నై: తమిళనాడులో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. కొద్ది రోజులనుండి పళని స్వామి, పన్నీరు సెల్వం వర్గాలు ఏకమవుతాయని ఒక రోజు, మరోరోజు ఇంకా చర్చలు కొనసాగుతున్నాయని, అసలు కలిసే ప్రసక్తే లేదని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం ముఖ్యమంత్రి పళని స్వామిపై గురువారం విరుచుకుపడ్డారు. పళని స్వామి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న బృవదానికి నాయకుడిగా ఉన్నారని విమర్శించారు. ఇరు వర్గాల కలయికపై పళని శిబిరం నుండి ఏ విధమైన సమాచారం రాలేదని పన్నీరు సెల్వం తెలిపారు. విలీనంపై వారు వారు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈవిషయంపై ఆయన చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి శశికళను, ఆమె కుటుంబసభ్యులు పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా దూరంగా పెట్టాలని ప్రధానంగా డిమాండ్ చేశారు. అయితే ఈ విషయాన్ని ఇప్పటికే పళని శిబిరానికి తెలియజేసినట్టు తెలిపారు. జూన్ 11న విలీనం విషయంపై చర్చలు జరపడానికి ఏర్పాటు చేసిన ఏడుగురు సభ్యుల కమిటీనీ ఆయన రద్దు చేశారు. ప్రత్యర్థి శిబిరంలోని నాయకులు బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని పన్నీరుసెల్వం తెలిపారు. ఇరు వర్గాలు కలిసి పని చేయడానికి మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆ తరువాత కోయంబత్తూరు ఎయిర్‌పోర్టులో విలేకరులతో మాట్లాడుతూ పళని ప్రభుత్వం అవినీతిమయంతో కూరుకుపోయిందని ఆరోపించారు. పళని ప్రభుత్వం అనుసరించే తీరు పార్టీ వ్యవస్థాపకుడు ఎంజీఆర్, దివంగత ముఖ్యమంత్రి జయలలిత (అమ్మ)కు ద్రోహం చేసే విధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి పళని స్వామి, దినకరన్‌ల మధ్య ఘర్షణ వాతావరణం ఉండటంతో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ఏఐడీఎంకేలో ఎక్కువమంది కార్యకర్తలు మాతోనే ఉన్నారని, మేము ఎంజీఆర్, జయలలిత మార్గాలను అనుసరిస్తున్నామన్నారు.

గ్రహాంతర కాలుష్యానికో అధికారి



వాషింగ్టన్: గ్రహాంతర వాసులు లేదా ఇతర గ్రహాలు భూమిని కలుషితం చేయకుండా చూసేందుకు నాసా ఒక అధికారిని నియామకం చేస్తోంది. ఆ పోస్టు పేరు ప్లానెటరీ ప్రొటెక్షన్ ఆఫీసర్ (పీపీఓ). పీపీఓ జీతమెంతో తెలుసా? ఏడాదికి 1,87,000 డాలర్లు (సుమారు రూ. కోటి12లక్షలు) ఇప్పుడేమన్నా భూమికి తక్కువ కాలుష్యం ఉందా? ఈ కాలుష్యాన్ని చూడకుండా ఉందో లేదో తెలియని కొత్త కాలుష్యాన్ని అరికట్టడానికి అంత డబ్బు పెట్టి ఆ అధికారి ఏమిటంటారా? అందుకు కారణం ఉంది. నాసా చేపట్టే అంతరిక్ష యాత్రల్లో వ్యోమగాములు, రోబోట్లు వ్యోమనౌక ఇతర గ్రహాలు, తోకచుక్కలు, ఉల్కలు వంటి వాటి నుంచి వచ్చే ప్రమాదకర జీవ, రసాయన పదార్థాల నుంచి కలుషితం కాకుండా కాపాడాలి. అంతరిక్షంలోకి వెళ్లిన వాళ్లు ఆయా పదార్థాలను భూమికి తీసుకొచ్చి భూమ్మీది మానవుల్లో లేదా నేలలో విడిచిపెడితే వచ్చే ప్రమాదమేమిటో మనకు తెలియదు. అందుకని అంతర్జాతీయ సమాజం 1967లోనే బాహ్య అంతరిక్ష ఒప్పందం (ఔటర్ స్పేస్ ట్రీటీ) ని ఏర్పాటుచేసుకుంది. అందులో యూరోపియన్ దేశాలతో సహా అమెరికా కూడా సంతకం చేసింది. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీలోనూ ఇలాంటి అధికారి ఉన్నారు. ఈ పోస్టును మూడేళ్ల కాల వ్యవధికి తీసుకుంటారు. కాంట్రాక్టును ఐదేళ్లకు పెంచే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆ ఉద్యోగం చేస్తున్న కాథరిన్ కోన్లీని నాసాలోని భద్రత విభాగానికి బదిలీ చేసారు. దీంతో కొత్త నియామకానికి అవసరం ఏర్పడింది.

జియింట్ గ్రహంపై వాతావరణం!



న్యూఢిల్లీ: సౌర వ్యవస్థకు అవల ఉన్నటువంటి జియింట్ అనే నూతన గ్రహంపై వాతావరణం ఉందని నాసా శాస్త్ర వేత్తలు కనుగొన్నారు. ఆ గ్రహంపై రోజు రోజుకి నీటి అణువులు పెరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే కొన్ని సమయాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని తమ అధ్యయనంలో తేలిందన్నారు. సుదూరంగా ఉన్నటువంటి గ్రహాల్లో భూమిపై ఉన్న వాతావరణాన్ని ఊహించలేమని యూనివర్సిటీ ఆఫ్ మార్యలాండ్ ప్రొఫెసర్ డ్రాకె డీమింగ్ వెల్లడించారు. సౌర వ్యవస్థకు అవల ఉన్నటువంటి ఆ గ్రహంలో ఉష్ణ వాతావరణం అధికంగా ఉన్నప్పటికీ, అక్కడ నీటి అణువులు వృద్ధి ఉంటున్నట్లు తమ అధ్యయనం తేలిందన్నారు. ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు నీటి అణువుల వృద్ధి ఉంటుందని తెలిపారు.

సైన్యాధికారులకు పాక్ చైనా మహిళల గాలం

న్యూ ఢిల్లీ: భారత సైన్యంలోని రహస్య సమాచారం రాబట్టుకునేందుకు పాకిస్థాన్, చైనా గూఢచార సంస్థలు ఎత్తులు వేస్తున్నాయని... వాటి నుంచి భద్రతా బలగాల ఉన్నతాధికారులు జాగ్రత్తగా ఉండాలని భారత గూఢచార సంస్థలు హెచ్చరించాయి. ఆకర్షణీయమైన మహిళలను ఎరగా వేసి, బలగాలకు చెందిన కీలక సమాచారం రాబట్టేందుకు చైనా, పాకిస్థాన్ చర్యలు ప్రారంభించాయని ఇంటెలిజెన్స్‌వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై సైన్యం అధికారులకు అవగాహన కల్పించాలని కోరాయి. ఉర్దూ, ఇంగ్లీష్‌లలో మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో పరిచయమవుతారన్నాయి. తాము సంపన్న కుటుంబమని చెప్పుకొని స్నేహం చేయమంటారని చెప్పాయి. అటుతర్వాత తమను సంతృప్తిపరచమంటూ అడుగుతారన్నాయి. ఏకంతంగా గడిపిన వీడియోను చిత్రీకరించి వేధింపులకు దిగుతారని హెచ్చరించాయి. దీంతో దేశానికి సంబంధించిన సమాచారం బహిర్గతమయ్యే ప్రమాదం ఉందన్నాయి. ఇటీవల కొన్ని కేసుల్లో ఇలాంటి సంఘటనలు జరిగాయని, కాబట్టి అటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నాయి. ఇలాంటి ఘటనలు దేశ రక్షణ వ్యవస్థకు సవాలుగా మారుతున్నాయని చెప్పొకొచ్చాయి.

భారత సంతతి డాక్టర్‌పై 118 కేసులు

లండన్: బ్రిటన్‌లో భారత సంతతికి చెందిన ఓ వైద్యుడిపై బ్రిటన్ ప్రభుత్వం సుమారు 118 కేసులు మోపింది. అందులో 65 లైంగిక దాడులు కాగా మిగతావి లైంగిక ఆరోపణలని వెల్లడించింది. ఉత్తర లండన్‌కు చెందిన పోలీసులు గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. నిందితుడు మనీష్ షాను లైంగిక నిరోధక చట్టం-2003 కింద అరెస్ట్ చేసి న్యాయవిచారణకు పంపించినట్లు వెల్లడించారు. 2004 నుంచి 2013 వరకు పలువురు మహిళలపై లైంగికంగా దాడులకు పాల్పడగా, అందులో ఓ పదమూడేండ్ల బాలిక కూడా ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అయితే, ఇవే ఆరోపణలపై మనీష్ ఇదివరకు కూడా అరెస్ట్ అయినట్లు తెలిపారు. ఆగస్టు 31వ తేదీన బార్‌కింగ్‌సైడ్ న్యాయస్థానంలో ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అయితే, నిందితుడు బెయిల్‌పై విడుదలైనట్లు వివరించారు.

50 ఏళ్లలో 400 భాషలు మాయం



న్యూఢిల్లీ: భారతదేశపు భాషా వైవిధ్యానికి ముప్పు ముంచుకొచ్చిందట. మన దేశంలోని 130 కోట్ల మంది మాట్లాడే భాషల్లో సగం వచ్చే యాభై ఏళ్లలో కనుమరుగైపోతా యట. దేశంలో ప్రస్తుతం వాడుకలో ఉన్న 780 భాషల్లో సుమారు 400 భాషలు త్వరలోనే సోదిలోకి కూడా లేకుండా పోతాయని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎస్ఎల్ఐ) ప్రకటించింది. ఆ సంస్థ చైర్మన్ డెవీ మాట్లాడుతూ ఒక భాష పోతే సంబంధిత సంస్కృతి కూడా నాశనమైపోతుందన్నారు. భారత్‌లో ఇప్పటికే 250 భాషలు నశించిపోయాయి. పీఎస్ఎల్ఐలో పరిశోధకుల బృందం ఒకటి భారత్‌లోని ప్రాంతీయ భాషలకు సంబంధించిన పత్రాలను సేకరించి భద్రపరుస్తుంది. ఇప్పటికే నశించిపోయిన, నశించిపోనున్న భాషలన్నీ గిరిజనులవే. వీరి పిల్లలకు చదువు లేకపోవడం, వారు చదువుకుంటున్నా, వీరికి ఇతర భాషల్లో పాఠశాలల్లో పాఠాలు చెప్పడం వల్ల వారి మాతృ భాషలో చదవడానికి రాయడానికి అవకాశం లేకుండా పోతోంది. మైథిలి అనే భాషను బీహార్లోని కొన్ని ప్రాంతాల్లో మాట్లాడతారు. ఈ భాషకు వెయ్యేళ్ల చరిత్ర ఉంది. అయితే.. ఇది అంతరించిపోవడానికి సిద్ధంగా ఉంది.

గంగా సింధు నదులకు గండం



వాషింగ్టన్: భారతదేశం ఆర్థికవ్యవస్థ మెరుగుపడుతోందని వార్తలు వస్తుంటే భవిష్యత్ గురించి భయపెట్టేస్తున్నారు శాస్త్రజ్ఞులు. భారత్ వంటి పెద్ద, అధిక జనాభా ఉన్న దేశానికి వ్యవసాయం చాలా ముఖ్యం. ఉష్ణోగ్రతలు అదుపులో ఉండి, వర్షపాతం అనువుగా ఉంటేనే వ్యవసాయంలో వృద్ధి కొనసాగుతుంది. అయితే.. పర్యావరణంలో విపరీత మార్పులు ఇలాగే కొనసాగితే ఉష్ణ మండల ప్రాంతాలకు ముప్పేనని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వచ్చే శతాబ్దానికి అంటే ఇప్పుడున్న మధ్యవయస్కుల్లో చాలా మంది మనవళ్లు మధ్యవయస్కులయ్యే నాటికి భారత దేశానికి ఉష్ణగ్రత ముప్పు తప్పదట. సుమారు 80 లేదా 90 ఏళ్లలో తీవ్రంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు భారతతో పాటు దక్షిణాసియాలోని పలు దేశాలను పట్టిపీడిస్తాయట. ముఖ్యంగా భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో ఉష్ణగ్రతలు మానవ మనుగడకే ప్రమాదం వాటిల్లేలా ఉంటాయని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన పరిశోధకుల అంచనా. ఈ కారణంగా సింధు, గంగా నదుల పరీవాహక ప్రాంతంలో వ్యవసాయం దెబ్బతినడం వల్ల పంట దిగుబడి తగ్గిపోయి జనం ఆకలితో మాడతారని వారు హెచ్చరిస్తున్నా రు. ఈ ప్రాంతాలన్నీ జనాభా సాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలే కావడంతో జాగ్రత్తలు తీసుకోకుంటే సమస్యలు తీవ్రంగా ఉంటాయని వారు చెబుతున్నారు.

పార్లమెంట్‌లో ప్రకటనలు

100 వంతెనలు ఎప్పుడైనా కూలొచ్చు



న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో జాతీయ రహదారులపై 100 వంతెనలు శిథిలావస్థకు చేరాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి లోక్‌సభకు తెలిపారు. ఇప్పటికే కేంద్రం 1.6 లక్షల వంతెనల భద్రతపై ఆడిట్ పూర్తిచేశామని అన్నారు. మరో వంద వంతెనల పరిస్థితి ప్రమా దకరంగా ఉంది. అవి ఏ క్షణాన్నైనా కూలిపోయే అవకాశం ఉంది. వాటి పటిష్టతకు తక్షణ చర్యలు అవసరం అని చెప్పారు. మహారాష్ట్రలోని బ్రిటీష్ నాటి వంతెనలు కూలి గతేడాది సవిత్ర నది వద్ద బస్సులు ప్రమాదానికి గురయ్యాయి. వరద ప్రవాహంలో కొట్టుకు పోయాయని ఈసందర్భంగా గుర్తుచేశారు. ప్రమా దాల నివారణకు మంత్రిత్వశాఖ గతేడాది నూతన ప్రాజెక్టును ప్రారంభించింది. వంతెనలు, కల్వర్టులకు వివరాలను సేకరించడం జరిగిందని మంత్రి చెప్పారు. భూసేకరణ, పర్యావ రణ అనుమతుల వల్ల ప్రాజెక్టుల్లో జాప్యం జరుగుతోందన్నారు.

నదుల అనుసంధానికి సిద్ధం: ఉమ

దేశవ్యాప్తంగా 16 నదుల అనుసంధాన ప్రాజెక్టులకు కేంద్రం ప్రణాళికలు సిద్ధంచేసిందని నీటివనరులశాఖ మంత్రి ఉమాభారతి లోక్‌సభలో ప్రకటించారు. మధ్యప్రదేశ్-ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు సంబం ధించి కెన్-బెత్వా అనుసంధాన ప్రాజెక్టు ఏక్షణంలోనైనా ప్రారంభి స్తామని



చెప్పారు. ఇందుకు రెండు రాష్ట్రాలు అంగీకరిస్తే వెంటనే పర్యా వరణ అనుమతుల ప్రక్రియ ప్రారంభం అవుతుంది. నీటి పంప కాలు, విద్యుత్ పంపిణీపై ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరాల్సి ఉంది. కెన్-బెత్వా ఇంటర్‌లింక్ ప్రాజెక్టు ద్వారా 30వేల మె.వా. విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గతంలో ఈ ప్రాజెక్టు గురించి కేంద్రం, రాష్ట్రాల మధ్య ట్రైపార్టీ మెమొ రాండంపై 2015 ఆగస్టు 25న సంతకాలు జరిగాయని ఉమాభారతి గుర్తుచేశారు.

రోడ్ల కోసం నదుల్లో పూడిక మట్టి

నదుల్లో పూడికతీసిన మట్టిని వాటి సమీప ప్రాంతంలోని రోడ్ల నిర్మాణానికి ఉపయోగిస్తామని కేంద్ర జలవనరుల శాఖ పేర్కొంది. పూడికతీసిన మట్టిని సాధార ణంగా భారీ వాహనాల సాయంతో సుదూర ప్రాంతాలకు తరలిస్తుంటారు. అయితే, తాజాగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం ఆయా నదులకు సమీపంలో గల ప్రాంతాల్లోనే పూడికతీసిన మట్టితో రోడ్లు నిర్మించనున్నారు. క్వశ్చన్ అవర్‌లో భాగంగా ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి ఉమా భారతి సమాధానమిచ్చారు. ఇదే విషయంపై ఆ శాఖ సహాయ మంత్రి సంజీవ్ బాలయన్ సైతం స్పందించారు. నదుల్లో పూడికతీసిన మట్టి వినియోగానికి సంబంధించి మాధవ్ కమిటీ సూచనల మేరకు చర్యలు తీసుకుంటుమన్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకొని శాస్త్రీయ పద్ధతిలో మట్టి వినియోగం చేస్తామన్నారు.

రహదారుల కుంభకోణంపై దర్యాప్తు

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులపై వచ్చిన ఆరోపణల విచారణ ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. అమెరికా సంస్థ నుంచి సుమారు 1.18 మిలియన్ డాలర్లు ముపుడుల రూపంలో అందాయన్న ఆరోపణల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి లోక్‌సభకు తెలిపారు. మిసెస్ సీడీఎం స్మిత్ అనే కంపెనీ దాని ఉద్యోగులు, ఏజెంట్లు, ఇండియాలోని ఆ సంస్థ ద్వారా ప్రభుత్వ అధికారులకు పెద్దమొత్తంలో లంచాలు అందినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. జూన్ 21 నాటి అమెరికా న్యాయ విభాగం,క్రిమినల్ డివిజనల్ లేఖ ఆధారంగా ఈ కథనాలు వెలువడ్డాయి. దీనికి సంబంధించిన ఆధారాలు సేకరించే ప్రక్రియకు సంబంధించి విదేశాంగశాఖ, అమెరికాలోని భారత దౌత్యకార్యాలయాల సహకారం తీసుకుంటున్నామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

చిట్‌ఫండ్ మోసాల నియంత్రణకో చట్టం


సామాన్య ప్రజల కష్టార్జితాన్ని దోపిడీ చేస్తున్న చిట్‌ఫండ్ మోసా లపై కేంద్రం స్పందించింది. చిట్ ఫండ్ అక్రమాల



నియంత్రణకు పటిష్టచట్టాన్ని రూపొందిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంటుకు తెలిపారు. త్వర లోనే ఈమేరకు ముసాయిదా బిల్లు ఉభయ సభల ముందుకు వస్తుందని చెప్పారు. బ్యాంకింగ్ సంస్కరణలపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ విషయాన్ని జైట్లీ వెల్లడించారు. పాన్ ఇండియా బిల్లు అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న చట్టాలకు అదనంగా మరికొన్ని నిబంధనలు జోడిస్తామన్నారు. ఇప్పటికే నమోదైన చిట్‌ఫండ్ కుంభకోణాలను సెబి పరిశీలిస్తోంది. బెంగాల్,ఒడిశా రాష్ట్రాల్లో స్థానిక చట్టాల ప్రకారం దర్యాప్తు సాగుతున్నదని చెప్పారు. అయితే, దేశవ్యాప్తంగా చిట్‌ఫండ్ వ్యాపారాలను నిర్వహిస్తున్న సంస్థల మోసాలపై చర్యలకు కేంద్రస్థాయిలో ప్రత్యేక చట్టం అవసరమని పేర్కొన్నారు. బ్యాంకుల కంటే అధిక వడ్డీ ఆశచూపుతూ చిట్‌ఫండ్ సంస్థలు మదుపరులను సులువుగా బుట్టలో వేసుకుంటున్నాయని జైట్లీ గుర్తుచేశారు. ఎల్ఐసీ పెన్షన్ ఫండ్ పథకాలు సేవింగ్స్‌కు ఉత్తమం అని, దీనిద్వారా వయోవృద్ధులకు గరిష్టంగా 8.3 శాతం వడ్డీ చెల్లించడం జరుగుతుందన్నారు.

సివిల్స్ విజేతల్లో సగంమంది ఇంజనీర్లే

ఇటీవల జరిగిన సివిల్స్ పరీక్ష విజేతల్లో సగం మంది ఇంజనీరింగ్ పట్టభద్రులేనని కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ ప్రకటించారు.



వారి లో చాలా మటుకు పబ్లిక్ అడ్మిని స్ట్రేషన్, సోషియాలజీ సబ్జెక్టులను ప్రాధాన్యంగా ఎంపిక చేసుకున్నారు. ఈ యేడాది టాప్ 20 మంది విజేతల్లో 19 మంది ఇంజనీర్లు ఉన్నారు. ఒక్కరు మాత్రమే డాక్టర్ అని వివరిం చారు. సివిల్ సర్వీస్ పరీక్షల్లో ఆయుర్వేదాన్ని ఆప్షనల్ పాఠ్యాంశంగా చేరుస్తున్నారా? అని సుబ్రహ్మణ్యస్వామి అడిగిన ప్రశ్నకు మంత్రి ఈ విధంగా జవాబిచ్చారు. ఆయుర్వే దం అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఇప్పటికి మొత్తం 48 ఆప్షనల్ సబ్జెక్టులు ఉన్నాయి. గ్రాడ్యుయేషన్ సమయంలో ఆయా సబ్జెక్టులను వారు చదివి వుండటం వల్ల సివిల్స్‌లో విజే తలవుతున్నారని వెల్లడించారు. వైద్యవిద్యను అభ్యసించిన వారిలో కనీసం పదిశాతం కూడా మెడికల్ సైన్స్‌ను ఆప్షనల్‌గా ఎంపిక చేసుకోవడం లేదన్నారు.

'బ్లూవేల్' పరిణామాలపై విచారణ

బ్లూవేల్ ఆన్‌లైన్ గేమ్ గురించి రాజ్యసభలో సభ్యులు ఆందోళన చేసారు. గురువారం ఎగువ సభలో వివిధ పార్టీలకు చెందిన పలువురు సభ్యులు సదరు గేమ్‌ను యాభై రోజుల పాటు ఆడిన బాలుడు ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వం చర్య తీసుకోవాలని డిమాండ్ చేసారు. దీంతో సభాధ్యక్ష స్థానంలో ఉన్న పీజే కురియన్ బ్లూవేల్ గేమ్ వల్ల జరుగుతున్న అనర్థాలపై విచారించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ముంబైకి చెందిన మన్‌ప్రీత్ సింగ్ అనే బాలుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బ్లూవేల్ ఆఖరి అంకంలో ఆ గేమ్ ఆడేవారు ఆత్మహత్య చేసుకునేందుకు గేమ్ పురిగొల్పుతుంది.

మంత్రి ఇంట్లో డబ్బుల గని

న్యూఢిల్లీ, బెంగళూరు: కర్నాటక ఇంధన శాఖ మంత్రి శివ కుమార్‌కు చెందిన ఇళ్లలో ఐటీ శాఖ తనిఖీలు రెండో రోజు కూడా కొనసాగాయి. గురువారం న్యూఢిల్లీలోని సఫ్దర్‌గంజ్ ప్రాంతంలోని మంత్రి నివాసంలో ఐటీ అధి కారులు మరోసారి తనిఖీలు చేశారు. ఆయన బంధువులు, అనుచరులకు చెందిన ఇళ్లల్లో రెండు రోజులుగా జరిగిన ఐటీ దాడుల్లో సుమారు రూ.11.42 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ సఫ్దర్‌జంగ్‌రోడ్డు లోని ఆయన ఇంట్లో రూ.8.33 కోట్లు, బెంగళూరులో రూ.2.5 కోట్లు, మైసూరులో రూ.60 లక్షలు సీజ్ చెసారు. ఇందులో రద్దైన పాత నోట్లతో పాటు కొత్త నోట్లున్నాయి. వీటిని లెక్కించేందుకు లెక్కింపు పరికరాలను విని యోగించారు. భారీగా బంగారు ఆభర ణాలతో పాటు కోట్ల విలువైన ఆస్తుల పత్రాలు అధికారుల చేతికి చిక్కాయి.

కశ్మీర్‌లో కల్లోలం



ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన సైనికులకు సైన్యాధికారుల నివాళులు

- అమరులైన ఆర్మీ మేజర్, జవాన్
- దాడులకు తెగబడిన ఇద్దరు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి పెట్రేగిపోయారు. గురువారం రెండు ప్రాంతాల్లో జవాన్లపై దాడులకు తెగబడ్డారు. కుల్గాం జిల్లాలో మిలిటెంట్ల ఎటాక్‌ను భద్రతా బలగాలు తిప్పికొట్టాయి. సైనికుల కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. గోపాల్‌పోరా గ్రామంలో ఉగ్రవాదులున్నట్లు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంలో కార్డాన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉగ్రవాదులు జవాన్లపై కాల్పులు జరిపారు. అయితే ఎదురు కాల్పుల్లో ఇద్దరు మిలిటెంట్లు మృతి చెందారు. వారిని హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన అకిబ్ హుస్సేన్, సోహైల్ అహ్మద్ రాథర్‌గా గుర్తించారు. వీరిలో ఒకరు మే1న డబ్బులతో వెళ్తున్న బ్యాంకు వాహనంపై దాడి చేసి ఐదుగురు పోలీసులు, ఇద్దరు బ్యాంకు సిబ్బందిని కాల్చి చంపినట్లు పోలీసులు తెలిపారు. అలాగే గత నెలలో కుల్గామ్ జిల్లాలోని యారిపోరా ప్రాంతంలో కానిస్టేబుల్‌ను హతమార్చినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు దక్షిణ కశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో గురువారం ఉదయం భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. జైనాపోరా వద్ద గస్తీ బృందంపై ఉగ్రవాదులు దాడి చేసి కాల్పులకు పాల్పడ్డారు. దీంతో ఓ ఆర్మీ అధికారితోపాటు ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఆర్మీ మేజర్ కమలేష్ పాండే, జవాన్ టాన్జిన్ చెల్టుమ్ అమరులయ్యారు. మరో జవాన్ కిర్పాల్ సింగ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదుల వరుస దాడుల నేపథ్యంలో భద్రతా బలగాలు మరింత అప్రమత్తమయ్యాయి. ఎన్‌కౌంటర్లు జరిగిన ప్రాంతాల్లో ముష్కరుల కోసం గాలిస్తున్నాయి.

ఈ యాప్‌తో మీరే ఒక ఫోటోగ్రాఫర్



బోస్టన్: స్మార్ట్ ఫోన్లతో తీసిన ఫోటోల్లో వృత్తిపరమైన నాణ్యత లోపించి బాధపడుతున్నారా? ఈ ఫోన్ ఉన్నా ఫోటోగ్రాఫర్ తప్పనిసరి అవుతాడేమా? అని ఆలోచిస్తున్నారా? ఆ ఆలోచనలకు బ్రేక్ పడే అవకాశం రానుంది. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు గూగుల్ తో కలిసి కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్‌వేర్ తయారు చేసారు. ఇది నిపుణుడైన ఫోటోగ్రాపర్లా మీరు స్మార్ట్‌ఫోన్‌తోతీసిన ఫోటోలను సరిదిద్దుతుంది. మరింత అందంగా కనబడేలా చేస్తుంది. సాధారణంగా ఫోటోగ్రఫీలో అనుభవం లేని వారు తీసిన ఫోటోలు ముడి పదార్థంగా భావిస్తారు. కొద్దోగొప్పో ఫోటోషాప్ లాంటి సాఫ్ట్‌వేర్ల తో అనుభ వం ఉన్నవారు కూడా ఫోన్లతో తీసిన ఫోటోలను సరిదిద్ది సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తారు. కానీ ఈ సాఫ్ట్‌వేర్ వస్తే ఆ అవసరం లేదు. మనం ఫోటో తీయంగానే అవసరమనుకుంటే దానిని సరిదిద్ది మరీ సేవ్ చేస్తుంది. ఫోటోషాప్ ను తయారు చేసిన అడోబ్ సిస్టమ్స్ డాటా సెట్ ఆధారంగా ఈ సాఫ్ట్ వేర్‌ను తయారు చేసారు. ఇది హైఎండ్ స్మార్ట్ ఫోన్లలోనే పని చేస్తుంది సుమా. ఎందుకంటే ఇది ఇన్‌స్టాల్ అయి పనిచేయా లంటే 12 జీబీ మెమరీ అవసరం. ఒక శుభవార్త.. ఫోన్ బ్యాటరీ పనితీరుపై ఈ యాప్ పెద్దగా ప్రభావం చూపదట



క్వార్టర్ ఫైనలో ప్రణయ్, సౌరభ్

• న్యూజిలాండ్ గ్రాండ్ ప్రి బ్యాడ్మింటన్ • కశ్యప్ ఓటమి

అక్లాండ్ : యుఎస్ ఓపెన్ విజేత హెచ్‌ఎస్ ప్రణయ్ తన అద్వితీయ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. న్యూజిలాండ్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ఆడుతున్న ప్రణయ్ గురువారంనాడు 10వ సీడ్ వెయి నాన్ (హాంకాంగ్)ను ఓడించి క్వార్టర్‌ఫైనల్‌లోకి అడుగుబెట్టాడు. నాలుగో సీడ్ ప్రణయ్ సుమారు 46 నిమిషాల పోరులో నాన్‌ను 21-18, 21-19 తో వరుస గేమ్‌ల్లో చిత్తుచేశాడు. మరోవైపు భారత్‌కు చెందిన సౌరభ్ వర్మ కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ పారుపల్లి కశ్యప్‌ను ఓడించాడు. ఏడోసీడ్ వర్మ 64 నిమిషాలపాటు పోరాడి అనూహ్యంగా కశ్యప్‌ను 21-18, 13-21, 21-16 తో ఓడించాడు. మరో భారతీయ ఆటగాడు సిరిల్ వర్మ సైతం 13-21, 14-21 తో చైనీస్ తైపే ఆటగాడు చియా హంగ్ లూపై 38 నిమిషాల్లో ఓడిపోయాడు. కాగా సౌరభ్ తదుపరి హాంకాంగ్‌కు చెందిన లీ చుక్‌తోనూ ప్రణయ్ 11వ సీడ్ చైనీస్ తైపే ఆటగాడు లిన్ యూ సియన్‌తో ఆడతారు.

'ఖేల్‌రత్న' అవార్డుకు సర్దార్‌సింగ్, జఝూరియా పేర్లు

• 'అర్జున'కు పుజారా, సాకేత్ మైనేని, హర్మన్ ప్రీత్ కౌర్ • సూచించిన అవార్డు కమిటీ



న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్ సర్దార్ సింగ్, పారాలింపియన్ దేవేంద్రజఝూరియా పేర్లను ఈ ఏడాది అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్నకు గురువారం రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డు కమిటీ సిఫార్సు చేసింది దేవేంద్ర పురుషుల జావెలిన్ త్రోలో రెండుసార్లు ఒలింపిక్ స్వర్ణ పతకాలను సాధించాడు. 2004 ఏథెన్స్ , 2016 రియో ఒలింపిక్స్‌లో ఈ పతకాలను వశం చేసుకున్నాడు. పారాలింపియన్‌ను ఖేల్‌రత్నకు సిఫార్సు చేయడం ఇదే తొలిసారి. కాగా రెండో నామినీగా కమిటీ సర్దార్ పేరును సూచించారు. వీరిద్దరికి సంయుక్తంగా అవార్డును ప్రకటించే అవకాశం ఉంది.

అర్జునకు 17మంది

అర్జున అవార్డుకు పుజారా, హైదరాబాదీ టెన్నిస్ ఆటగాడు సాకేత్ మైనేని, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్‌కౌర్ సహా కమిటీ 17 మంది పేర్లను సిఫార్సు చేసింది. తక్కినవారు...జ్యోతి సురేఖ (ఏపీ అథ్లెట్), మరియన్ తంగ వేలు (పారాలింపిక్ హైజంపర్), వరుణ్ భాటి (పారా అథ్లెట్), ఎస్ఎస్ పి చౌ రాసియా, ఖుష్‌బీర్ కౌర్ (రేస్‌వాకర్), ఆరోఖియా రాజీవ్ (లాంగ్ జంపర్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), ఎస్‌వీ సునీల్ (హాకీ), సత్యవ్రత్ కదియన్ (రెజ్లర్), అంథోనీ అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్), పీఎన్‌ప్రకాశ్ (షూటర్), జస్వీర్ సింగ్ (కబడ్డీ), దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), బెంబెమ్‌దేవి (ఫుట్‌బాల్).

ఆసీస్ వేతనాల వివాదానికి తెర

క్రికెట్ ఆస్ట్రేలియా, ఆటగాళ్ల మధ్య కుదిరిన ఒప్పందం

సిడ్నీ : గత కొంతకాలంగా వేతనాలపై క్రికెట్ ఆస్ట్రేలియా, ఆసీస్ ఆటగాళ్ల మధ్య నెలకొన్న వివాదానికి తెరపడింది. ఈ విషయమై ఇరువురు బుధవారంనాడు ఒకపరిష్కారానికి వచ్చి తాజా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో స్మిత్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జట్టు బంగ్లాదేశ్ వెళ్లడానికి గ్రీన్ సిగ్నల్ లభించినట్లయింది. ఆ తర్వాత ఇండియా, ఇంగ్లండ్ పర్యటనలు చేయనుంది. ఈ జీతాల కారణంగానే ఆస్ట్రేలియా ఏ జట్టు దక్షిణాఫ్రికాలో ముక్కోణపు వన్డే సిరీస్‌ను బహిష్కరించిన విషయం తెలిసిందే. కొత్త కాంట్రాక్టులో కొన్ని మార్పులు చేయడంతో ఇరు వర్గాల మధ్య వివాదానికి తెరపడిందని క్రికెట్ ఆస్ట్రేలియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ జేమ్స్ సుదర్లాండ్ ఆ తర్వాత తెలిపారు. ఐదేళ్ల కాలానికి సుమారు 396 మిలియన్ డాలర్లు చెల్లించేలా ఆస్ట్రేలియా ఆటగాళ్లు అంగీకరించి ఈ తాజా ఒప్పందంపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది.

230 ఆస్ట్రేలియా ఆటగాళ్లు సీఏతో చేసుకున్న 5 ఏళ్ల ఒప్పందం ఈ సంవత్సరం జూన్ 30 తో ముగిసిన విషయం తెలిసిందే. కొత్త కాంట్రాక్టులో కీలక మార్పులు చేయడంతో దానిపై ఆటగాళ్లు సంతకాలు చేయకుండా నిరాకరించడం జరిగింది.

మళ్లీ తెలుగు టైటాన్స్ ఓటమి



హైదరాబాద్: ప్రో కబడ్డీలో తెలుగు టైటాన్స్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. సొంతగడ్డపై టైటాన్స్ తన పోరును ఓటమితో ముగించింది. గురువారం జరిగిన పోరులో పాట్నా పిరేట్స్ 43-36 తేడాతో టైటాన్స్‌ను చిత్తుచేసింది. టైటాన్స్‌కిది వరుసగా ఐదోసారి ఓటమి. తెలుగు జట్టుపై పాట్నాకు రెండో విజయం. పర్‌దీప్ నర్వాల్, మోను గోయల్ అద్భుత ప్రదర్శనతో పాట్నాను గెలుపు బాటలో నడిపించారు. మ్యాచ్ తొలి అర్ధంలో పిరేట్స్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. రెండో అర్ధంలో టైటాన్స్ కొంత పోరాడినప్పటికీ గెలుపును మాత్రం దక్కించుకోలేకపోయింది. పిరేట్స్ కెప్టెన్ పర్‌దీప్ మరోసారి విజృంభించి 10 పాయింట్లు సాధించాడు. టైటాన్స్‌పై ఈ ఆటగాడు 10 పాయింట్లు సాధించడం ఇది ఐదోసారి. పర్‌దీప్‌కు మోను కూడా తోడు కావడంతో టైటాన్స్‌కు పరిస్థితి క్లిష్టమైంది. చివరిలో టైటాన్స్ సారథి రాహుల్ విజృంభించి 10 పాయింట్లు సాధించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. టైటాన్స్ తమ తదుపరి పోరులో ఈనెల 8న నాగ్‌పూర్‌లో బెంగళూరు బుల్స్‌ను ఢీకొంటుంది.

పట్టు బిగించిన ఇండియా

• పుజారా, రహానె అజేయ శతకాలు
• శ్రీలంకతో రెండో టెస్టు

మరోసారి లంక బౌలర్లను భారత బ్యాటింగ్ దెబ్బతీసింది. తొలి టెస్టులో మాదిరిగానే ఇండియా రెండో టెస్టు మొదటిరోజుననే మూడొందల పైగా పరుగుల స్కోరును నమోదు చేసి..భారీ స్కోరు అందుకోవాలన్న పట్టుదలతో ఉంది. ధావన్, కోహ్లీ నిరాశపరిచిన పుజారా, రహానె కలిసి అజేయంగా చెరో శతకాన్ని అందివ్వడం ద్వారా ఈ టెస్టుపై భారత్ పట్టు సాధించేందుకు వీలు కల్పించారు. రెండోరోజు కూడా ఇదే విధంగా భారత్ బ్యాటింగ్ కొనసాగితే (ఇంకా ధాటిగా ఆడగలిగే పాండ్య, అశ్విన్, జడేజా, సాహా ఉండడంతో) ఈసారి 600 మార్క్‌ను అందుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

కొలంబో : భారత జట్టు మరోసారి ఆతిథ్య శ్రీలంకపై పట్టుబిగించింది. 50వ టెస్టు ఆడుతున్న పుజారా మరోసారి అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శించి శతకాన్ని అందించగా చాలకాలం తర్వాత రహానె సైతం సెంచరీ చేయడంతో పాటు వీరిద్దరూ కలిసి రెండొందలపైగా భాగస్వామ్యాన్ని అం దించడంతో తొలిరోజు ఆటముగిసే సరికి భారత్ 3 వికెట్ల నష్టానికి 344 పరు గులు చేయగలిగింది . సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్‌లో గురువారంనాడు మొదలైన ఈ టెస్టులో టాస్ గెలిచిన కోహ్లీ రెండోరోజు నుంచి పిచ్ స్పిన్‌కు అనుకూ లిస్తుందన్న అభిప్రాయంతో మొదటి బ్యాటింగ్‌నే ఎంచుకున్నాడు. ఇప్పటికే సిరీస్‌లో 1-0 తేడాతో వెనుకబడిన శ్రీలంక ముగ్గురు స్పిన్నర్లు ఒకపేస్ బౌలర్‌తో భారత్‌ను కట్టడి చేయడానికి ప్రయత్నించి పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. ఏకంగా స్పిన్నర్ హెరాత్ పేసర్ ప్రదీప్‌తో కలిసి కొత్త బంతిని పంచుకోవడం విశేషం. ఒక దశ వరకు లంక ఆశించినట్లు ఇండియాను (133/3) కట్టడి చేయగలిగింది. అయితే ఇక్కడి నుంచి మ్యాచ్ వారి చేతినుంచి దాటిపోయింది. ప్రధానంగా వాల్‌గా ప్రసిద్ధిపొందిన పుజారాతోపాటు రహానె ఓపిగ్గా ఆడి లంకను నిలువరించ గలిగారు.

నిరాశపర్చిన ధావన్, కోహ్లీ

ఆరంభ టెస్టులో లంకబౌలర్లపై చెలరేగి 190 పరుగులు చేసి మ్యాచ్ గెలుపులో ముఖ్య పాత్ర పోషించిన ఓపెనర్ శిఖర్ ధావన్ ఈ మ్యాచ్‌లో నిరాశపర్చగా, కెప్టెన్ కోహ్లీ సైతం స్వల్పస్కోరుకే తిరిగి వచ్చాడు. అయితే చాలా కాలం తర్వాత గాయంనుంచి కోలుకుని వచ్చిన రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన ధావన్ దూకుడుగా ఆడాడు. దీంతో ఇద్దరూ 10 ఓవర్లకే 50 పరుగులు జత కలిపారు. చివరకు 56 పరుగుల స్కోరువద్ద పెరీరా వేసిన బంతికి ధావన్ (35) ఎల్బీడబ్ల్యుగా వెనుదిరిగాడు.

అతడి స్థానంలో వచ్చిన పుజారా మాత్రం మరోసారి అమోఘంగా రాణించాడు. పొడి ట్రాక్‌పై రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఈ ఇద్దరూ కలిసి రెండోవికెట్‌కు 53 పరుగులు జోడించగలిగారు. అయితే 31వ ఓవర్‌లో అనవసరమైన సింగిల్‌కోసం యత్నించిన రాహుల్ (57) దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యాడు. తర్వాత వచ్చిన కోహ్లీ మళ్లీ ఆశించిన స్థాయిలో ఆడలేకపోయాడు. 13 పరుగల వ్యక్తిగత స్కోరువద్ద హెరాత్ బౌలింగ్‌లో ధాటిగా ఆడబోయి మాథ్యూస్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఇండియా 133 పరుగులకు 3 వికెట్లుకోల్పోయింది.

చక్కదిద్దిన రహానె, పుజారా

ఈ జోడీ స్థిరమైన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఇద్దరూ లంక బౌలర్ల సహనాన్ని పరీక్షించి లూజ్ బంతులను మాత్రమే బౌండరీలకు తరలించి పరుగులు రాబట్టారు. బాధ్యతను పూర్తిగా భుజస్కంధాల మీద వేసుకున్న వీరిద్దరూ భారీ ఇన్నింగ్స్‌ను అందించే క్రమంలో ఎలాంటి తడబాటు లేకుండా ఆడి శతకాలు నమోదు చేశారు. 68వ ఓవర్‌లో పుజారా శతకం పూర్తిచేశాడు. ఇది అతడికి 13వ టెస్టు సెంచరీ. శ్రీలంకపై మూడోది. ఇదే వేదికపై 2015 లో పుజారా అజేయంగా 145 పరుగులు చేసిన విషయం తెలిసిందే. ఆరంభంలో కొంత తడబాటుకు గురైనప్పటికీ నెమ్మదినెమ్మదిగా అతడు క్రీజులో పాతుకునిపోయి చక్కటి షాట్లతో అలరించాడు. ఇన్నింగ్స్ ఆఖరి వరకు ఫీల్డర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా ఆడాడు. ద్రవిడ్, గవాస్కర్‌ల మాదిరి అద్వితీయమైన ఫుట్‌వర్క్‌తో అతడు లంక బౌలర్లకు ప్రశ్నగా మారిపోయాడు. స్పిన్నర్లు బంతులు వేసిన సమయంలో పూర్తిగా ముందుకు వచ్చినా ఆడిన పుజారా షాట్లకు వచ్చిన బంతులను దారుణంగా శిక్షించాడు. అతడిని అవుట్ చేయడానికి లంక కెప్టెన్ ఎంత ప్రయత్నించినా ఫలితం దక్కలేదు.

ఆపై రహానె కూడా సెంచరీతో అలరించాడు. వీరిద్దరూ చక్కటి బాగస్వామ్యాన్ని అందించడం ద్వారా అజేయమైన నాలుగోవికెట్‌కు 211 పరుగులు జోడించారు. ఆట ముగిసే సరికి పుజారా (128-225 బంతుల్లో 10 ఫోర్లు ఒకసిక్సర్) రహానె (103-168 బంతుల్లో 12 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. రహానెకు ఇది తొమ్మిదవ సెంచరీ. స్పిన్నర్ హెరాత్ బంతికి సింగిల్ తీయడం ద్వారా రహానె 115వ బంతితో (12 ఫోర్లలో) సెంచరీ అందుకోగలిగాడు. రహానె టెస్టు క్రికెట్‌లో శతకాన్ని అందుకోవడం 9 నెలల తర్వాత ఇదే. అతడు చివరిసారిగా 2016 అక్టోబర్‌లో న్యూజిలాండ్‌పై 188 పరుగులు చేయగా ఆపై వరుసగా 9 టెస్టుల్లో 19 ఇన్నింగ్స్‌లు ఆడినా ఒక్క శతకాన్ని అందుకోలేకపోయాడు. వీరిద్దరూ ఇంకా నిలబడగలిగితే ఈ టెస్టులో సైతం ఇండియా భారీస్కోరును అందుకునే వీలుంది.

లంక మూడు మార్పులు : అంచనాలకు తగినట్లే రాహుల్ తుది 11 మందిలో చోటు చేసుకోగా, అభినవ్ ముకుంద్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు లంక ఈ టెస్టుకు మూడు మార్పులు చేసింది. దనుష్క, కుమార, అసెలా గాయంతో దూరంకాగా వారి స్థానంలో కెప్టెన్ చండీమాల్, పుష్పకుమార, ధనుంజయ డిసిల్వావచ్చారు.

స్కోరుబోర్డు

ఇండియా తొలి ఇన్నింగ్స్ : శిఖర్ ధావన్ ఎల్‌బి బి పెరీరా 35, రాహుల్ రనౌట్ 57, పుజారా 128 బ్యాటింగ్, కోహ్లీ సి మాథ్యూస్ బి హెరాత్ 13, రహానె 103 బ్యాటింగ్, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం (90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి) 344

వికెట్ల పతనం : 1-56 (ధావన్) 2-109 (రాహుల్) 3-133 (కోహ్లీ)

బౌలింగ్ : ఫెర్నాండో 17.4-2-63-0, హెరాత్ 24-3-83-1, కరుణరత్నే 3-0-10-0, పెరీరా 18-2-68-1, పుష్పకుమార 19.2-0-62-0, డిసిల్వా 8-0-31-0



రహానె 103



పుజారా 128

పుజారా ఘనత

ఎస్ఎస్‌సి మైదానం ఒకరకంగా పుజారాకు కలిసొచ్చినదిగా చెప్పొచ్చు. ఎందుకంటే ఇక్కడే 2015 లో అతడు అద్భుతమైన సెంచరీతో చెలరేగి ఇప్పటివరకు 7 శతకాలు నమోదు చేయగలిగాడు. అలాగే 42వ ఓవర్‌లో పెరీరా వేసిన బంతికి రెండు పరుగులు తీయడం ద్వారా 4000 మార్క్‌ను అందుకున్నాడు. 50వ టెస్టు ఆడిన పుజారా ఈ మైలురాయితో కొంతమంది భారత దిగ్గజాల సరసన నిలిచాడు. 50వ టెస్టుతోనే అతడు 4 వేల పరుగులు పూర్తిచేయగలిగిన క్రికెటర్లలో ఇంతకుముందు గవాస్కర్ 81ఇన్నింగ్స్‌ల్లో (4947), రాహుల్ ద్రవిడ్ (4315) సెహ్వాగ్ 79 ఇన్నింగ్స్‌ల్లో (4103)లు ఉండగా ఇప్పుడు నాలుగోవాడిగా 84 వ ఇన్నింగ్స్‌లో పూర్తిచేయడం ద్వారా పుజారా నిలిచాడు. అంతేకాకుండా 50వ టెస్టులో సెంచరీ చేసిన ఏడో భారతీయ ఆటగాడిగా పుజారా నిలిచాడు. మొత్తంమీద 36వ ఆటగాడిగా ఉన్నాడు.

మరో ప్రపంచ టైటిల్‌పై బోల్ట్ గురి

నేటినుంచి వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్

నేటినుంచి అందరికళ్లు లండన్‌లోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ స్టేడియంపైనే ఉండనున్నాయి. శుక్రవారంనాడు మొదలై ఈనెల 13 వరకు జరగనున్న 2017 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పలువురు మేటి అథ్లెట్స్ తలపడుతున్నారు. స్వర్ణ సంబరాలు, విజయకేతనాలు, నిరాశ నిస్పృహలు, అనూహ్యమైన ఫలితాలు, సంచలనాలు, బద్దలయ్యే రికార్డులకు ఈ వేదిక సాక్షీభూతంగా నిలువనుంది.

ప్రపంచ మేటి స్ప్రింటర్, దశాబ్దకాలంగా తనకు ఎదురులేకుండా చిరుతలా సెకండ్లతోపోటీపడి మైదానంలో పరిగెట్టి అందర్నీ అలరించిన జమైకాకు చెందిన ఉసేన్ బోల్ట్‌మరోసారి 100 మీటర్లలో బంగారు పతకం నిలబెట్టుకునేందుకు సిద్ధమయ్యాడు.

లండన్: బోల్ట్100 మీటర్ల రిలేలోనూ పరిగెత్తనున్నాడు. ఈ రెండింటి అనంతరం అతడు తన పరుగుకు గుడ్‌బై చెబుతున్నాడు.ఇక నుంచి విశ్రాంతి తీసుకునే ఉద్దేశ్యంతో 10 సంవత్సరాలుగా అంతర్జాతీయ మీట్‌ల్లో అవిశ్రాంతంగా పరిగెట్టి 8 ఒలింపిక్స్ టైటిల్స్‌తోపాటు 11 ప్రపంచ చాంపియన్‌షిప్ స్వర్ణ పతకాలు అందుకున్న బోల్ట్ పరుగు దీని తర్వాత ఇక కనిపించదు. రికార్డులపైన రికార్డులు కొల్లగొట్టి అథ్లెటిక్స్ ట్రాక్‌లోనే తనకంటూ ఓ చరిత్ర సృష్టించుకున్న బోల్ట్‌కు ఈ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలుకనున్నారు. రష్యా అథ్లెట్స్ ఎవరూ పోటీలో లేనప్పటికీ పలువురు ప్రపంచ మేటి అథ్లెట్స్ ఈ చాంపియన్‌షిప్‌ల్లో తమ సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు.



అందులో కొందరి గురించి ఈ సందర్భంగా,,

ఫరా : బోల్ట్ మాదరిగానే బ్రిటన్‌కు చెందిన 34 ఏళ్ల ఫరా 5000 మీ, 10 వేల మీటర్ల డిస్టెన్స్ రన్నింగ్‌లో తిరుగులేని అథ్లెట్ సైతం రిటైర్మెంట్ ప్రకటించనున్నాడు. 2012, 2016 ఒలింపిక్స్‌లో 2013, 2015 లో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు అందుకున్న ఫరా మరోసారి సొంత మైదానంలో సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. నేడు 10 వేల మీటర్ల విజేతగా నిలువగలనన్న ఆశాభావంతో ఉన్నాడు.



బోల్ట్ : గత నాలుగు ప్రపంచ చాంపియన్‌షిప్‌ల్లో 8 వ్యక్తిగతఫైనల్స్‌కు చేరుకున్న 30 ఏళ్ల బోల్ట్100 మీటర్ల టైటిల్‌ను (ప్రస్తుత ప్రపంచ రికార్డు 9.58 సె) తిరిగి నిలబెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఒకేసారి అతడు 2011 లో 100 మీ ఫైనల్‌లో ఫాల్స్ ప్రారంభంతో విఫలమయ్యాడు. ఈసారి 100 శాతం ఫిట్‌నెస్‌తో విశ్వాసంతో సిద్ధమయ్యాడు. 2013 డైమండ్‌లీగ్‌లో గాట్లిన్ చేతిలో ఓడిపోయిన బోల్ట్‌కు మరోసారి అతడే పోటీగా ఉన్నాడు. రియోలో అతడు రజతం సాధించాడు. మరో ప్రధాన పోటీదారుడైన 22 ఏళ్ల కెనడా అథ్లెట్ అండ్రీ డి గ్రాసె ఈసారి పోటీపడడంలేదు. అయితే బోల్ట్ సహచరుడు, 2011 ప్రపంచ 100 మీ. చాంపియన్ బ్లేక్, గాట్లిన్ ప్రత్యర్థి కోల్‌మాన్ పోటీలో ఉన్నారు. శుక్రవారంనాడు హీట్స్ జరుగనుండగా శనివారంనాడు సెమీస్, ఫైనల్ జరుగనుంది. నా చివరి రేస్‌లో 9.95 సెకండ్లలో పరిగెత్తాను. కాబట్టి నేను సరైన దిశలోనే ఉన్నాననుకుంటున్నానన్నాడు.

వేడ్ వాన్ నికెర్క్ : దక్షిణాఫ్రికాకు చెందిన వేడ్ 400 మీటర్లు 200 మీటర్లలో పరిగెత్తనున్నాడు. 400 మీటర్లలో 17 ఏళ్ల క్రితం మైఖేల్ జాన్సన్ నెలకొల్పిన రికార్డును రియో ఒలింపిక్స్‌లో బద్దలు కొట్టిన25 ఏళ్ల వేడ్, రాబోయే కాలంలో బోల్ట్ వారసుడిగా ప్రసిద్ధి పొందాడు. 400 మీటర్లలో ఇప్పటికే చాంపియన్‌గా ఉన్న వేడ్ ఈసారి 200 మీటర్లలో తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు.

తియామ్ : బెల్జియంకు చెందిన నఫీ తియామ్ హెప్తాలిన్‌లో తిరుగులేని క్రీడాకారిణి. 21 ఏళ్ల వయసులోనే ఆమె ఒలింపిక్ చాంపియన్‌గా నిలిచింది. ఆమెకు ప్రధాన పోటీ జాన్సన్ - థాంప్సన్‌తో ఉండనుంది.

లువో మాన్‌యాంగా : మైక్ పోవెల్ 1991 లాంగ్‌జంప్ రికార్డును (8.95 మీ) బద్దలు కొట్టిన మాన్‌యాంగా 9 మీటర్లను సైతం అవలీలగా అధిగమించేందుకు ఫేవరెట్‌గా సిద్ధమయ్యాడు.

కెంద్రా హారిసన్ : అమెరికాకు చెందిన 100 మీటర్ల హర్డిల్స్ ప్రపంచ రికార్డుగ్రహీత 28 ఏళ్ల హారిసన్ గత సంవత్సరం రియోలో పోటీపడకపోయినప్పటికీ ఈసారి బంగారు పతకం అందుకోగలనన్న పట్టుదలతో ఉంది.

ఈవాన్ జాగెర్ (3000 మీ స్టీపుల్ చేజ్) : అమెరికాకు చెందిన జాగెర్ ఈ సంవత్సరం ర్యాంకింగ్‌ల్లో అగ్రస్థానంలో ఉండడంతో అతడు విజేతగా నిలిచే వీలుంది.

బరిలో ఇండియా

ఈ చాంపియన్‌షిప్‌లో ఇండియా ఏ మేరకు రాణిస్తుంది? అంటే మన అథ్లెట్స్ ఆరోజు చూపే ప్రతిభాపాటవాల మీదనే ఆధారపడి ఉంటుంది. ఆఖరి నిమిషంలో ఐఏఏఎఫ్ నుంచి ఆహ్వానం అందుకున్న భారత జాతీయ 100 మీటర్ల చాంపియన్ ద్యుతీచంద్ ఒక్కతే లండన్ బయల్దేరి వెళ్లింది. అయితే ద్యుతీ ఒంటరిగా ప్రయాణించడం ఇదే మొదటిసారి కాదు. ఆమె తన కోచ్ రమేశ్‌ను సైతం వెంట తీసుకుని వెళ్లాలనుకున్నప్పటికీ..అది సాధ్యం కాలేదు.ఇదిలా ఉంటే భారత్ ఈ చాంపియన్‌షిప్‌లో బాగా రాణించేందుకు యత్నిస్తుందని డిప్యూటీ చీఫ్ కోచ్ రాధాకృష్ణన్ నాయర్ తెలిపారు. పతకాల విషయానికొస్తే..ఇండియాకు కేవలం జావెలిన్‌లోనే ఆ అవకాశం ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.



నీరజ్

ఈ క్రమంలో నీరజ్ చోప్రా, దేవేందర్ సింగ్‌పై ఉన్నాయి. నీరజ్ 85.23 మీటర్లు (పాటియాలాలో జరిగిన ఫెడరేషన్‌కప్‌లో విసిరాడు) విసురుతున్నప్పటికీ కేవలం అది ఫైనల్స్ చేరేందుకే ఉపయోగపడొచ్చు. ఈ విభాగంలో జర్మనీకి చెందిన థామస్ రోహ్లర్ (93.30 మీ), జోహన్నెస్ వెట్టర్ (94.44 మీ) ఉన్నారు. అదే విధంగా 400 మీటర్ల రిలేలో కూడా ఇండియా ఫైనల్ చేరే అవకాశాలున్నాయి. భారత పురుషుల జట్టులో అరోకియా రాజీవ్, అమోజ్ జాకబ్, కుంజా మహమ్మద్, మోహన్ కుమార్,సచిన్ రోబీ ఉన్నారు. ఫైనల్ చేరాలంటే ఈ జట్టు 3 నిమిషాల లోపుననే పరిగెత్తాల్సి ఉంది. గత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత 40 మీటర్ల మహిళల రిలే జట్టు 14వ స్థానానికే పరిమితమైంది. అదే విధంగా 400 మీటర్లలో పరిగెత్తే నిర్మల సైతం ఫైనల్‌పై ఆశలు పెట్టుకుంది. ఆ లక్ష్యాన్ని 51.28 సెకండ్లలో పూర్తిచేయడం ద్వారా అర్హత సాధించగలిగింది. 5000 మీ, 10000 మీటర్లలో జి లక్ష్మణన్ పరిగెత్తుతాడా? లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. 20 కిమీ నడకలో గణపతి కృష్ణన్, దేవేందర్‌సింగ్ పోటీపడనున్నారు. హెప్తాథ్లిన్‌లో స్వప్నా బర్మన్ పోటీపడనుండగా, జావెలిన్‌లో అన్నూరాణి తలపడుతోంది.

చాంపియన్‌కు బాంబ్రి షాక్

వాషింగ్టన్: భారత యువ టెన్నిస్ ఆటగాడు యుకి బాంబ్రి... డిఫెండింగ్ ఛాంపియన్, 22వ ర్యాంకు ఆటగాడు మోన్‌ఫిల్స్‌కు షాకిచ్చాడు. బుధవారం ఇక్కడ జరిగిన వాషింగ్టన్ ఓపెన్ రెండో రౌండ్ పోరులో బాంబ్రి 6-3, 4-6, 7-5తో మోన్‌ఫిల్స్‌ను మట్టికరిపించాడు. క్వాలిఫయింగ్ రౌండ్ ద్వారా మెయిన్ డ్రాకు చేరుకున్న బాంబ్రి తర్వాత రౌండ్లో అర్జెంటీనా ఆటగాడు గిడో పెల్లాతో తలపడతాడు.

దక్షిణాఫ్రికాపై భారత్ విజయం

మనీష్ పాండే, శాంసన్ అర్ధసెంచరీలు

ప్రిటోరియా: ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్ ఏ జట్టు మరో విజయాన్ని కైవసం చేసుకుంది. మనీష్ పాండే (93), సంజు శాంసన్ (68) అర్ధసెంచరీలతో రాణించడంతో గురువారం భారత్ ఏ ..వికెట్ తేడాతో దక్షిణాఫ్రికా ఏపై విజయం సాధించింది. తొలుత దక్షిణాఫ్రికా 48.2 ఓవర్లలో 266 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత భారత్ 49.4 ఓవర్లలో 9 వికెట్లకు 267 పరుగులు చేసి గెలిచింది.

స్కోరు: దక్షిణాఫ్రికా 266, ఇండియా 267/9

Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

Lively
Interaction
For
Ever

ఆంధ్రప్రభ
lifepage2012@gmail.com

లైఫ్

శుక్రవారం 4
ఆగస్టు 2017

11



చారుమతి కథలోనే ఒక అంతరార్థం, సందేశం దాగి ఉంది. చారుమతి ఈ వ్రతం చేసిందని ఆమెకు సకల సంపదలు చేకూరాయనేది కథ. దీనికి ఒక మహనీయుడు ఇచ్చిన వివరణ ఏమంటే చారుమతి అంటేనే చక్కని బుద్ధి గలది అని అర్థం. చక్కని బుద్ధి ఉన్నవారే ఈ వ్రతం చేయడానికి అర్హులని అటువంటివారికే అమ్మ అనుగ్రహం లభిస్తుందని దీని అంతరార్థం. అంటే వ్రతం చేయడానికి అర్హతా అదే, అనుగ్రహం కలగడానికి అర్హతా అదే. అంతేకాక అందరూ మంచి బుద్ధి కలిగి ఉంటే వారికి సిరిసంపదలు సమకూరుతాయనేది కూడా గ్రహించాలి.

వరాల వర్షిణి

★ నేడు వరలక్ష్మీ వ్రతం ★

వరలక్ష్మీ వ్రతాన్ని శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. పేరులో ఉన్నట్టు ఇది వరాలనిచ్చే లక్ష్మీదేవి వ్రతం. వర అంటేనే శ్రేష్ఠత అని అర్థం. అటువంటి శ్రేష్ఠమైన లక్ష్మి వరలక్ష్మి. సాధారణంగా అందరూ కోరే వరాలు ధనం, ధాన్యం, విద్య, విజయం. ఇవన్నీ లక్ష్మీదేవే ఇస్తుంది. ఆమె అష్టలక్ష్ములుగా ఆది, ధాన్య, ధైర్య, గజ, సంతాన, విజయ, విద్యా, ధనలక్ష్మీ రూపాల్లో ఉంటుంది. ధనం ధాన్యం, విద్య విజయం అక్కర్లేనిదెవరికి ఈ వరలక్ష్మీ దేవిని పూజిస్తే ఆయా లక్ష్ములందరు ఇచ్చే ఫలాలను వరలక్ష్మీ దేవే ఇస్తుంది. లోక కళ్యాణార్థం ఈ వ్రతాన్ని పరమేశ్వరుడు, పార్వతీ దేవికి చెప్పినట్లు భవిష్యోత్తర పురాణంలో ఉందని చెబుతారు. స్కాంద పురాణంలో కూడా ఈ వ్రతం గురించి వివరంగా ఉన్నట్టు పెద్దల మాట. ఇక దీనికి అనుబంధంగా ఒక కథ కూడా ఉంది. మగధ రాజ్యం కుండిన నగరంలో చారుమతి అనే పతివ్రత ఈ వ్రతాన్ని ఆచరించి సర్వ సంపదలు పొందినట్లు చెప్పే కథ అది. మన పురాణాలలోని కథలన్నిటినీ పుక్కిటి పురాణాలుగా కొట్టివేయరాదని, వాటిలో అంతరార్థాలు ఉంటాయని విజ్ఞులు చెబు తుంటారు. నిజానికి చారుమతి కథలోనే ఒక అంతరార్థం, సందేశం దాగి ఉంది. చారుమతి ఈ వ్రతం చేసిందని ఆమెకు సకల సంపదలు చేకూరాయనేది కథ. దీనికి ఒక మహనీయుడు ఇచ్చిన వివరణ ఏమంటే చారు మతి అంటేనే చక్కని బుద్ధి అని అర్థం. చక్కని బుద్ధి ఉన్నవారే ఈ వ్రతం చేయడానికి అర్హులని అటు వంటివారికే అమ్మ అనుగ్రహం లభిస్తుందని దీని అంతరార్థం. అంటే వ్రతం చేయడానికి అర్హతా అదే, అనుగ్రహం కలగడానికి అర్హతా అదే. అంతేకాక అందరూ మంచి బుద్ధి కలిగి ఉంటే వారికీ సిరిసం పదలు సమకూరుతాయనేది కూడా గ్రహించాలి. ఆ కథలోని పాత్రకు ఆ పేరు పెట్టడంలో అంతరార్థం ఇది.

ఇక లక్ష్మీదేవి సృష్టిలో చాలా వాటిలో చాలా రూపాల్లో ఉంటుంది. సిద్ధ లక్ష్మీ, మోక్ష లక్ష్మీ, జయలక్ష్మి, సరస్వతి, శ్రీలక్ష్మి, వరలక్ష్మి రూపాలు సంప్రదాయంలో చెప్పబడినవి. ఇవి కాక ఆహారానికి కారకురాలిగా ధాన్యలక్ష్మి రూపంలో, రాజులందు రాజ్యలక్ష్మిగా, గృహాలలో సైతం గృహలక్ష్మిగా, స్వర్గంలో స్వర్గ లక్ష్మిగా, వైకుంఠంలో మహాలక్ష్మిగా ఆమె కొలువై ఉందని కూడా చెబుతారు. మహాలక్ష్మి ఏమేమి ఇస్తుందో వర్ణించే ఒక శ్లోకం ఉంది.

విజ్ఞాన సంపత్సుఖదాంమహాశ్రియం
విచిత్ర వాగ్భూతి కరీం మనోరమాం
అనంత సౌభాగ్య సుఖ ప్రదాయినీం
నమామ్యహం భూతికరీం హరిప్రియాం

విజ్ఞాన సంపద, సుఖ శాంతులను ఇచ్చే జగన్మాతను, ఆశ్చర్యకరమైన వాక్కుల సిరిని కలిగించే మనోరంజకురాలిని, అనంత సౌభాగ్య సంపదలు ఇచ్చే దేవిని ఐశ్వర్య కారిణిని, విష్ణు ప్రియ అయిన మహాలక్ష్మీ దేవికి నమస్కరిస్తున్నాను అని దీని అర్థం.

అంటే మహాలక్ష్మీదేవి కేవలం ధనాన్ని మాత్రమే ఇవ్వదు. చక్కటి వాక్కును, సుఖాలను సౌభాగ్యాలను, ఐశ్వర్యాలను అన్నిటినీ ఇస్తుంది. ఆ మహాలక్ష్మి రూపమే ఈ వరలక్ష్మి.



లక్ష్మీదేవి అనుగ్రహం కలగాలంటే కొన్ని లక్షణాలు మనకు ఉండాలి. మన ఇంటికి ఎవరైనా రావాలంటే వారికి యోగ్యమైన పరిస్థితులను కల్పించాలి. అలాగే లక్ష్మీదేవి రావాలన్నా, ఆవిడకి రావాలనిపించడానికి కొన్ని మంచి లక్షణాలు మనలో ఉండాలి. వాటిలో ఒకటి మంచి బుద్ధి అని ముందు తెలుసుకున్నాం. మరోటి ఇల్లు శుచిగా, శుభ్రంగా ముగ్గులతో అలంకరించి ఉండాలి. పూజ చేసేవారు స్వధర్మపరాయణులై, సత్వగుణంకలవారై దానం, అధ్యయనం, దేవతాపూజ, పితృదేవతా రాధన చేసే వారై ఉండాలి. గురువుల పట్ల, అతిథుల పట్ల గౌరవ భావం కల వారై ఉండాలి. స్త్రీ వ్యామోహం లేనివారై ఉండాలి.

గురు శుశ్రూష చేయాలి. ఇంద్రియ నిగ్రహం, సత్యవ్రతం, కోపం, అసూయ లేకపోవడం, కాపట్యం లేకపోవడం వంటి లక్షణాలు ఉండాలి. ఉపవాస, జపాదులు చేసే వారై ఉండాలి. ఉషఃకాలంలో నిద్ర పోకూడదు, రాత్రులు పెరుగు, పేలాల పొడిని ఏ రోజూ తినకూడదు. ఉషఃకాలంలో మంగళకరమైన ద్రవ్యాలను చూడాలి. ఉషః కాలంలో సూర్యారాధన అగ్ని ఆరాధన కాలాతిక్రమణ లేకుండా చేయాలి. పగలు నిద్రించకూడదు. దీనులు, అనాథలు, వృద్ధులు, బలహీనులు, రోగులయందు దయ కలిగి శక్తిని బట్టి దానాలు చేయాలి. తల్లి దండ్రులను సేవించాలి. పరుష వాక్కులు పలక కపోవడం, మిత్ర ద్రోహం చేయకపోవడం, కష్టాలకు కృంగిపోక ధైర్యంగా నిలబడడం అలవరచుకోవాలి. ఇవి కొన్ని మాత్రమే. ఒక్క మాటలో చెప్పాలంటే మంచిగా ఉండాలనేదే ముఖ్యం. అటువంటివారినే దేవి కరుణిస్తుంది.

- జి. పార్వతీశం

పచ్చగా ప్రయాణిద్దాం!

గో గ్రీన్ వాహనాల రూపశిల్పి...పి. వెంకటేశం గుప్తా



వీలయినంత వరకు పొగ, కాలుష్యం, వ్యర్థాలు వంటివాటిని బయటకు పంపకుండా ఉండటం, వ్యర్థంగా పడేసిన వాటిని తిరిగి వినియోగించడం...ఇవి రెండూ గొప్ప సామాజిక సేవా అంశాలే. అలాంటి సేవా దృక్పథాన్ని తన వృత్తిలోనూ ప్రవృత్తిలోనూ ప్రదర్శిస్తున్నారు పి. వెంకటేశం గుప్తా. గో గ్రీన్ సేవా ఫౌండేషన్‌ని స్థాపించి...సమాజం కాలుష్యరహితంగా పచ్చగా కళకళలాడాలని కోరుకుంటున్నారు. చెట్లు... వాతావరణంలోని కాలుష్యాన్ని హరించి ఆక్సిజన్‌ని అందిస్తాయి...కానీ మనం తిరిగి మళ్లీ మళ్లీ కాలుష్యాన్ని వెదజల్లుతుంటే...ఎన్ని చెట్లను నాటినా ప్రయోజనం ఉండదు. అసలు అలాంటి కాలుష్యాన్నే నివారిస్తే...మరింత ఆక్సిజన్‌ని ఆరోగ్యాన్ని మనం పొందవచ్చు. వెంకటేశం గుప్తా....స్వచ్ఛభారత్ మిషన్‌కి సపోర్టుగా గో గ్రీన్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో...బ్యాటరీతో నడిచే వాసవీ వీల్స్ వెహికల్స్‌ని రూపొందించి వాటిని జనంలోకి తీసుకువెళుతున్నారు. అన్ని చోట్ల, అన్నివేళలా అన్ని విధాలుగా గో గ్రీన్ ప్రచారం, ఆచరణలే ....తన జీవిత ధ్యేయం అంటున్న వెంకటేశం గుప్తా మనో భావాలను ఆంధ్రప్రభ లైఫ్ పాఠకులకు ఆయన మాటల్లోనే అందిస్తున్నాం-

చిన్నతనం నుండే సామాజిక సేవాకార్యక్రమాలంటే ఆసక్తి ఉండేది. నాల్గవ తరగతి చదువుతున్నపుడే లైన్స్ క్లబ్ పిల్లల విభాగమైన లియో క్లబ్ కార్యక్రమాల్లో పాల్గొనేవాడిని. సేవా క్యార్యక్రమాల్లో పాల్గొన్న నాటి జ్ఞాపకాలు, ఆలోచలే తరువాత కాలంలో జీవన మార్గంగా అనిపించాయి. కంప్యూటర్ సైన్స్‌లో బిఇ, అనంతరం ఎం.బి.ఎ చేసినా నా ఆలోచనలు అన్నీ పర్యావరణ పరిరక్షణ చుట్టూనే తిరుగుతుండేవి. చదువుతో పాటు ఇంజినీరింగ్ కాలేజిలో ప్రాజెక్టులు చేసేవాడిని. ఆ రోజుల్లోనే నైస్ కంప్యూటర్స్ అనే ఇన్‌స్టిట్యూట్‌ని నడిపాను. ఇక 1994లో గ్రీన్‌సేవా ఫౌండేషన్‌ని స్థాపించాను. సైన్స్, ఆరోగ్యం, టెక్నాలజీ, పర్యావరణం మొదలైన రంగాల్లో ఇది కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

గ్రీన్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవీ వీల్స్‌ని ప్రారంభించి పెట్రోలు డీజిల్ అక్కర్లేని వాహనాలను తయారుచేయటం మొదలుపెట్టాను. కేవలం వ్యాపార ధ్యేయమే కాకుండా... సామాజిక సేవా దృక్పథాన్ని కలపాలనే ఉద్దేశంతోనే వీటితయారీని వృత్తిగా ఎంపిక చేసుకున్నాను. సేవ అనేది మనిషిని ముందుకు తీసుకువెళుతుంది. సేవ మనసుకి ఎంతో సంతృప్తిని ఇస్తుంది.

అవసరానికి తగినట్టుగా..అన్ని విధాలా సౌకర్యంగా...

కరెంటుతో ఛార్జింగ్ అవుతూ... బ్యాటరీతో నడిచే గో గ్రీన్ వాహనాలకు రిజిస్ట్రేషన్, లైసెన్సు అక్కర్లేదు. పెట్రోలు డీజిల్ వాహనాలకంటే ఇవి తక్కువ ధరకు లభిస్తాయి. అన్నింటికంటే ముఖ్యంగా ...వీటిని వినియోగదారుల వ్యక్తిగత అవసరాలకు తగినట్టుగా రూపకల్పన చేయటం జరిగింది. స్కూలు రిక్షాలు, డెలివరీ బాయ్స్ వాడే వాహనాలు, తినుబండారాల షాపులు, ఛాట్ అమ్మే వాహనాలు...చెత్తకుండీలు, నీళ్ల ట్యాంకులు ఇలా ఎన్నో రకాలుగా వీటిని వాడుకోవచ్చు. ముఖ్యంగా చిరువ్యాపారులకు ఇవి చక్కగా ఉపయోగపడతాయి. తక్కువ ఖర్చుతో ఎక్కడికైనా తమ వ్యాపారాన్ని తరలించుకునే వీలుంది. దీని వలన ఒక షాపుకి అద్దె, నిర్వహణ ఖర్చులు తగ్గుతాయి. ప్రభుత్వం స్పందిస్తే...ప్రజల్లో వీటి పట్ల అవగాహన పెరుగుతుంది. ప్రభుత్వం ఉద్యోగులకు ఈ ఈ-వెహికల్స్ మీద సబ్సిడీని ఇవ్వవచ్చు. స్వయం ఉపాధి పథకాలకు వీటిని ప్రోత్సహించవచ్చు. రెంటల్‌గా కూడా అవసరమైన వారికి అందించవచ్చు. ఇలా భిన్న మార్గాల్లో వాహనాల వినియోగం పెరిగినప్పుడు ఉత్పత్తి పెరిగి.... కాలుష్యం తగ్గుతుంది. ప్రభుత్వ ఆఫీస్‌ల్లో కార్యకలాపాలకు గోగ్రీన్ వెహికల్స్‌నే వినియోగించే వీలుంది. ఆసుపత్రుల్లోనూ లోపల పేషంట్లను ఒక వార్డునుండి మరొక వార్డుకి, టెస్టులకు తరలించడానికి వాడవచ్చు. ఇలా




వీటిని అన్నిరకాల అవసరాలకు వాడవచ్చు. ఏ వ్యాపారం చేసుకునేవారికైనా వారికి కావాల్సిన సదుపాయాలతో...వారి అవసరాలకు తగినట్టుగా వీటిని పొందే వీలుంది. 150రకాల డిజైన్లలో ఈ వాహనాలను రూపొందించడం వలన ఇది సాధ్యమైంది. చర్లపల్లి జైల్లో ఖైదీలకు రిహ్యాబిలిటేషన్‌లో భాగంగా...విడిభాగాలను కూర్చి వాహనాలను తయారు చేయటంలో శిక్షణ ఇవ్వటం జరిగింది. ఇదే కార్యక్రమాన్ని సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ అండతో ధూల్‌పేటలో కూడా నిర్వహించబోతున్నాం.

పర్యావరణ పరిరక్షణతో పాటు వీటి వాడకంతో మరో ప్రయోజనం ఉంది. మనం పెట్రోలు వాడకాన్ని తగ్గిస్తే...అమెరికన్ డాలర్ విలువ పడిపోతుంది. రూపాయి విలువ పెరుగుతుంది.

గో గ్రీన్ అంటే ...స్వచ్ఛభారతే...

ఇంగ్లీషులో గో గ్రీన్ అంటే తెలుగులో స్వచ్ఛభారతే. రీయూజ్, రీబై, రీడిజైన్, రెడ్యూస్, రీ థింక్, రీసైకిల్...ఇవన్నీ గో గ్రీన్‌లోకి వస్తాయి. మనం స్వచ్ఛభారత్ అంటున్నాం. గాంధీ మహాత్ముడు ఎప్పుడో చెప్పాడు... పర్యావరణం బాగుంటే అంతా బాగుంటుందని. స్వచ్ఛభారత్‌ని ప్రభుత్వ సిఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ)గా చెప్పవచ్చు. కేంద్రప్రభుత్వం స్వచ్ఛభారత్‌లో భాగంగా రాష్ట్రాలకు నిధులను ఇస్తున్నది. మొక్కలు నాటటం, శానిటేషన్, సులభ్ కాంప్లెక్సులు...ఇవన్నీ స్వచ్ఛభారత్‌లో భాగాలే. నేను చేపట్టిన ఈ గో గ్రీన్ ఎకో ప్రాజెక్టు కూడా అలాంటిదే. స్వచ్ఛభారత్‌కి పూర్తి స్థాయిలో సపోర్టు చేస్తూ ఈ వాహనాలను రూపొందించడం జరిగింది. అందుకే నా ప్రాజెక్టుకి చేయూత నివ్వాల్సిందిగా ప్రధానికి కూడా కలవటం జరిగింది. అయితే ఈ విషయంలో సరైన విధానాలతో, సరైన ప్రెజెంటేషన్‌తో రావాల్సిందిగా ప్రధాని కార్యాలయం సూచించడంతోనే కొన్ని ప్రాజెక్టులను



రూపొందించాను. బ్యాటరీ వాహనాల ఛార్జింగ్‌కి అవసరమైన ఛార్జింగ్ స్టేషన్లు, స్వయం ఉపాధి పథకం కింద ఈ -వాహనాలను ఇవ్వటం, రెంటల్ వెహికల్స్, మొదలైన ప్రాజెక్టులకు ప్రభుత్వాలనుండి అనుమతి లభిస్తే...ఇవి విస్తృతంగా జనంలోకి వెళతాయి. అవసరమున్నవారికి, తక్కువ ధరకు వాహనాలు అందుబాటులోకి రావటంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుంది. ఇంట్లో ఛార్జింగ్ చేయాలంటే నాలుగు గంటలు పడుతుంది. కానీ ఛార్జింగ్ స్టేషన్ల ద్వారా అయితే పవర్ బ్యాంకు బ్యాటరీల ద్వారా త్వరగా ఛార్జింగ్ పెట్టుకునే వీలుంది. పలు ప్రదేశాల్లో ఈ స్టేషన్లను ఏర్పాటు చేసుకునే అనుమతి ఉంటే...ఈ వెహికల్స్ సంఖ్యని పెంచే క్రమంలో ఛార్జింగ్ సమస్య ఉండదు. ఇందులో ఏవి సాధ్యం కావాలన్నా ప్రభుత్వాల సపోర్టు ముఖ్యం.

గో గ్రీన్‌దే భవిష్యత్తు

16 దేశాలు... పెట్రోలు, డీజిల్ వాహనాల తయారీని



నిలిపి వేయాలని నిర్ణయం తీసుకున్నాయి. ఐక్యరాజ్యసమితి సైతం ఈ విషయాన్ని ప్రకటించింది. 2020 తరువాత ఆ దేశాలు ఈ వాహనాలను ఆపేయాలనుకుంటున్నాయి. ఈ కారణాల వలన గోగ్రీన్ వాహనాల ఉత్పత్తి మరింతగా పెరిగే అవకాశాలు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయి. పారిశ్రామికవేత్తలు ఎవరు ముందుకు వచ్చినా... గోగ్రీన్ వెహికల్స్ తయారీలో స్పెషల్ ఎకనమికల్ జోన్‌ని క్రియేట్ చేసి ఇవ్వగలను. ఎలక్ట్రికల్ వెహికల్స్‌కి స్పెషల్ ఎకనమికల్ జోన్ ఇండియాలో ఎక్కడా లేదు. అలాగే మెడికల్ పార్క్‌ని సైతం కార్యరూపంలోకి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నాను. ఇది కూడా ఇంత వరకు ఇండియాలో ఎక్కడాలేదు.

వాళ్ల చెత్తను మనం వాడుతున్నాం....

మనం వాడుతున్న కంప్యూటర్లలో చాలాభాగం ..విదేశాల్లో వాడిపడేసినవే. వాడేసిన వస్తువులను చెత్తలో పడేస్తే అవి కాలుష్యంగా మారతాయి. అలా చెత్తలో పడేయకుండా తిరిగి వాడితే...కార్బన్ క్రిడిట్స్ పేరుతో డాలర్లు ఇచ్చే సంస్థ ఒకటి అమెరికాలో పనిచేస్తోంది. అంటే మనదేశానికి వాళ్ల చెత్తని సరఫరా చేసి... అందుకు ప్రతిఫలాన్ని పొందడమే కాకుండా ఆయాదేశాలు అదనంగా కార్బన్ క్రిడిట్స్‌ని పొందుతున్నాయి. ఇది ఒక అనంతమైన సబ్జక్టు. అలాగే పెట్రోలు బదులు సోలార్ ఎనర్జిని వాడినా కార్బన్ క్రిడిట్స్ వస్తాయి. దీనికి ఆడిటింగ్ అవసరం ఉంటుంది. దీంట్లోనూ నేను అధ్యయనం చేశాను. అమెరికాలో కార్బన్ క్రిడిట్స్ ఆడిటర్లు ఉంటారు. వాళ్లు ఆడిట్ చేస్తారు. దీనికి ఒక కన్సల్టెంట్ ఇండియాలో ఉంటారు.

✍ వి.దుర్గాంబ

శ్రీలక్ష్మీ ఆలయాలు...తల్లి కొలువైన నిలయాలు!


ఢిల్లీలోని లక్ష్మీ నారాయణ టెంపుల్

శ్రీలక్ష్మి అంటేనే సకల శుభాలు ఇచ్చే కల్పవల్లి. అందులోనూ ప్రత్యేకంగా వరలక్ష్మీ దేవిని భక్తులు వరాలిచ్చే తల్లిగా కొలుస్తారు. ముఖ్యంగా మహిళలు ఎంతో శుభకరంగా వరలక్ష్మీ దేవి వ్రతాన్ని భావిస్తారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా భక్తులచేత పూజలు అందుకుంటున్న శ్రీమహాలక్ష్ముల ఆలయాలను గురించి తెలుసుకుందాం-

ఢిల్లీలోని లక్ష్మీనారాయణ్ టెంపుల్ బిర్లామందిర్‌గా ప్రసిద్ధి. ఇక్కడ లక్ష్మీదేవి నారాయణునితో కలిసి కొలువై ఉంటుంది. ఈ గుడిని బల్‌దేవ్ దాస్ బిర్లా నిర్మించారు. 1933 నుండి 1939 వరకు ఈ గుడి నిర్మాణం జరిగింది. దీని ఆలయ ఆవరణలోనే శివుని, కృష్ణుని, బుద్ధుని గుళ్లు కూడా ఉన్నాయి. అ ఆలయం 7.5 ఎకరాల స్థలంలో ఉంది. ఆలయ ఆవరణ నిండా మరిన్ని గుళ్లు, ఫౌంటెన్లు, పూలతోటలు ఉన్నాయి. ఈ ఆలయం ఢిల్లీలో సందర్శించదగిన స్థలాల్లో ఒకటిగా భక్తులను, యాత్రికులను ఆకర్షిస్తోంది. దీపావళి శ్రీకృష్ణ జన్మాష్టమిలను ఈ ఆలయంలో వైభవంగా జరుపుతారు.

బంగారు గుడిలో కొలువైన లక్ష్మి

తమిళనాడు, వెల్లూరులోని శ్రీపురం బంగారు ఆలయం లక్ష్మీ దేవి ఆలయాల్లో చాలా ప్రత్యేకమైనదిగా పేరుపొందింది. గుడికి విమానం, అర్ధమండపం బంగారుపూతతో మెరుస్తూ ఉంటాయి. ఈ ఆలయానికి దారి నక్షత్రం రూపంలో శ్రీచక్రాన్ని పోలి ఉంటుంది. మలైకొడి అనే చిన్నకొండమీద ఉన్న శ్రీపురం ఆలయంలో లక్ష్మీ నారాయణి కొలువై ఉంది. ఇది కూడా భారతదేశంలోని అతి పెద్ద గుళ్లలో ఒకటిగా పేరుపొందింది. ఇది 100ఎకరాల స్థలంలో విస్తరించి ఉంది. దీనిని వెల్లూరులో ఉన్న ఛారిటిబుల్ ట్రస్ట్ శ్రీ నారాయణి పీఠం నిర్మించింది. దీనికి 1500ల కిలోల బంగారాన్ని పూతగా వాడటం విశేషం. దేశ వ్యాప్తంగా భక్తులు విశేషంగా దర్శించుకునే ఈ శ్రీలక్ష్మి ఆలయం తిరుపతికి 120 కిలోమీటర్ల దూరంలో ఉంది.

అష్టలక్ష్మి ఆలయం, చెన్నై

భారతదేశంలో లక్ష్మీదేవి కొలువై ఉన్న పలు ప్రాంతాలు నిత్యం భక్తజన సందోహంతో విరాజిల్లుతూ ఉంటాయి. అలాంటి ప్రాంతాలలో చెన్నైలోని అష్టలక్ష్మి ఆలయం ఒకటి. ఈ ఆలయంలో లక్ష్మీదేవి ఎనిమిది రూపాలతో ఉంటుంది. ఈ ఆలయం బీసెంట్ నగర బీచ్ తీరంపై ఉంది. ఇక్కడున్న నాలుగు అంతస్తులలో ఎనిమిది రకాల దేవతలు కొలువై ఉన్నారు. మహాలక్ష్మి, మహావిష్ణు ఆలయాలు ఇక్కడ ఉన్నప్పటికీ రెండవ అంతస్తు నుంచి ఈ దేవతలను ఇక్కడ పూజించడం గమనర్హం. మూడవ భవనంలో శాంతలక్ష్మి, విజయలక్ష్మి, గజలక్ష్మి విగ్రహాలున్నాయి. ఇక నాలుగో భవనంలో ఒక్క ధనలక్ష్మి దేవత విగ్రహం మాత్రమే ఉంటే... మొదటి భవనంలోకి వచ్చేసరికి ... ఆదిలక్ష్మి, ధైర్యలక్ష్మి, ధాన్యలక్ష్మి విగ్రహాలు కనపడతాయి.

లక్ష్మీదేవి ఆలయం, హస్సన్

కర్ణాటక రాష్ట్రంలోని దొడ్డగద్దహళ్లి లోని లక్ష్మీదేవి ఆలయం హొయసాలల కాలంనాటిది. హొయసాల వంశీయులు నిర్మించిన ఆధునిక కట్టడాలతో ఇదీ ఒకటి. వారు తమ పరిపాలన చివరి దశకంలో దీనిని నిర్మించారు. ఆలయం కాంప్లెక్స్‌లో ఎన్నో దేవతలు, దేవుళ్ల మందిరాలు ఉన్నాయి. గుడిలోపలికి ప్రవేశించే ముందు ఎంతో అందంగా అలంకరించబడిన ఏనుగు శిల్పం కనిపిస్తుంది. అలాగే ఆలయం చుట్టూ శిల్పకళా వైభవ ం వెల్లివిరుస్తుంటుంది. దశాబ్దాల పాటు ఈ ఆలయ ఆకృతులను ఎంతో వైవిధ్యంగా చెక్కినట్లు స్పష్టమవుతుంది. ఆలయ పైకప్పు వృత్తాకారంగా గుండ్రని స్తంభాలతో నిర్మితమై ఉంది. కాదంబర నగర శిఖరం, నాలుగు అపురూప ఆలయ గోపురాలు దొడ్డగద్దహళ్లి లోని లక్ష్మీదేవి ఆలయానికి అలంకరణలు. ఈగుడి మండపాలకు నాలుగువైపులా నాలుగు చిన్నపాటి దేవతా విగ్రహాలుంటాయి. శివుని రూపమైన భైరవుడి విగ్రహం ..ఐదవ విగ్రహంగా ఉంది. ఉత్తర,దక్షిణ,పశ్చిమ దేవాలయాలు వరుసగా కాళి, విష్ణువు, భూతనాథలింగం విగ్రహాలను కలిగి ఉన్నాయి. అలాగే గజలక్ష్మి, విష్ణువు అవతారమైన యోగ నారసింహుని విగ్రహాలు కూడా గుడిలో కొలువైనాయి.

మహాలక్ష్మి ఆలయం, ముంబాయి

భారతీయ పురాతన ఆలయాల్లో ముంబాయిలోని మహాలక్ష్మి ఆలయం ఒకటి. ఈ గుడి ముంబాయిలోని బ్రీచ్ క్యాండీలోని బి.దేశాయ్ రోడ్‌లో ఉంది. అరేబియా సముద్రం ఒడ్డున కొలువై ఉన్న మహాలక్ష్మి మాతను దర్శించడానికి లక్షల మంది భక్తులు వస్తుంటారు. స్వర్ణాభరణాలతో సంపదల తల్లిగా ఈ మాత గోచరిస్తుంది బ్రిటీష్ వారి కాలంలో ఆలయాన్ని వర్లీ ప్రాంతానికి తరలించడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని పెద్ద పెద్ద అలలు రావడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఈ ఆలయంలో మహంకాళి, మహాలక్ష్మి, మహా సరస్వతి విగ్రహాలు ఉన్నాయి. మూడు విగ్రహాలకు ముక్కుపుడకలతో పాటు, బంగారు గాజులు. వజ్ర వైడూర్యాలతో కూడిన నగలున్నాయి. ఒక్కసారిగా ముగ్గురమ్మలను చూసిన భక్తులు భక్తిపారవశ్యంతో మునిగిపోవల్సిందే. త్రికరణ శుద్ధితో అమ్మవారిని ఎవరైతే పూజిస్తారో.... వారి కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం.







చింతన

వరలక్ష్మీ వ్రతం నాడు ఏమి చేయాలి?



శ్రావణమాసంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు. ఆనాడు సువాసినులు, కన్యలు, వివాహమైనవారు, ఒకరోజు ముందుగా వ్రతమాచరిస్తామని సంకల్పించి మర్నాడు బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేచి, అభ్యంగన స్నానమాచరించి, నూతన వస్త్రాలను ధరించి అమ్మవారి వైభవాన్ని ప్రస్తుతించే కథలను విని, వినిపించి పంచభక్ష్యపరమాన్నములను నివేదన చేయవలెను. బ్రాహ్మణులకు, గురువులకు తమ శక్తి మేరకు వస్త్ర, ఆభరణ, దక్షిణ, తాంబూలాదులను సమర్పించి సుమంగుళులకు వాయనములు అర్పించి వారి ఆశీస్సులను పొందాలి. ఈ విధంగా చేసిన సౌభాగ్యం, సత్సంతానం, సిరిసంపదలు, ఆయురారోగ్యైశ్వర్యములు సిద్ధిస్తాయని హేమాద్రి పురాణంలో వివరించబడింది.

శ్రావణ శుద్ధ ద్వాదశి




శ్రావణ శుద్ధ ద్వాదశినాడు తులసీ మహాత్యం విని తులసిని ఆరాధించాలి. ఈనాడు శ్రీమహావిష్ణువునకు పవిత్రారోపణ చెప్పబడినది. ఆగమశాస్త్రానుసారం దేవాలయ నిర్వహణలో అర్చకుల వలన యజమానుల వలన భక్తుల వలన జరిగిన అన్ని అపచారాలకు ప్రాయశ్చిత్తంగా పవిత్రోత్సవం నిర్వహిస్తారు.

- డా॥ కందాడై రామానుజాచార్య

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

ఏది బండి



శ్రీ రమణాశ్రమం
28-5-46

ఇక్కడికి వచ్చిన మన పిల్లలు స్వర్ణ, విద్య, ఆడి అన్నామల కోవెల, దుర్గాంబ కోవెల మొదలైనవి చూడాలంటే మొన్న ఉదయం భగవాన్ సెలవు పొంది బయలుదేరాము. ఎండాకాలం, పది పన్నెండేండ్ల పిల్లలు, నడవలేరని బండి మాట్లాడాను. బండి చూచేసరికి ఆ యీడువాళ్లూ, ఇంకా చిన్నవాళ్లూ కొంతమంది బయలుదేరారు. గిరికి ప్రదక్షిణంగా పయనమై, అన్నీ చూపి, మధ్యాహ్నం పదకొండున్నరకు తిరిగి వచ్చాం. మూడింటికి హాలుకు వచ్చి మేము నమస్కరించుటే తడవుగా, "ఎన్ని గంటలకు వచ్చారు?" అని భగవాన్ నన్ను అడిగారు. పదకొండున్నర అయిందంటే, "వీరంతా నడవగలిగారా?" అన్నారు భగవాన్, బండీ యెక్కి వెళ్లామని విన్నవించాను.

భగవాన్ పరిహాసంతో "ఓహో, సరిసరి బండినెక్కి పోతిరా? పుణ్యమెవరికి? బండికా, యెద్దుకా? వీరికా?" అన్నారు. బదులు చెప్పలేక మౌనం వహించాను. ప్రక్కనున్న వారిని చూచి భగవాన్ "ఈ శరీరమే ఒక బండి. దీనికింకొక బండి. ఆ బండిని లాగుటకొక యెద్దు. ఈవిధంగా జరిగిన పనికి మేము చేశామంటారు. అన్నీ యిదేవిధంగా వుంటవి. మద్రాసు నుంచి రైలులో వస్తారు. మేం వచ్చామంటారు. ఇట్లాగే శరీరమున్నూ. తనకి శరీరమొక బండి గదా. దీన్ని ఆశ్రయించిన కాలు నడుస్తుంది. నేను నడిచాను, నేను వచ్చాను, అని చెపుతారు. తానెక్కడికి పోయేది? ఇవన్నీ తనయందారోపించుకోటమే తప్పు, తానేదీ చేయడు" అని చెప్పి, "వీరంతా కొంతదూరమైనా నడిచారా లేదా?" అని ప్రశ్నించారు. గౌతమాశ్రమం దాకా భజన చేస్తూ నడిచారు గాని ఆ వెనుక ఎండ తీవ్రత వల్ల నడవలేకపోయారని విన్నవించాను. "పోనీ, అంతవరకైనా నడిచారు గదా?" అని ఆ ప్రసంగం విరమించారు భగవాన్.

విద్య చిలిపి పిల్ల గదూ? వచ్చింది మొదలు భగవానులను గురించి ఎన్నో ప్రశ్నలడుగుతున్నది. భగవాన్ తాతయ్య ఎక్కడికీ రారా? ఎందువల్ల? అనే ప్రశ్నలకు ఏం జెప్పినా సమాధానపడక 24వ తేదీ ఉదయం ఎక్కడికీ ఎందుకు రారని శ్రీవారినే అడిగింది. చిన్నపిల్లల మాటలంటే వారి కమిత ప్రీతిగదా! సాదరంగా దాన్ని చూచి "ఏమమ్మా, నన్ను మీ వూరు తీసుకుపోతావా? అదే గదా నీ అభిప్రాయం. బాగుంది గాని నేను కదిలితే వీరంతా వస్తారు సరిగదా త్రోవలో ఎందరో పిలుస్తారు. వెళ్లకపోతే వూరుకుంటారా? పట్టుకపోతారు. అక్కడి నుండి ఇంకా కొంతమంది బయలుదేరుతారు. వీళ్లందరినీ తీసుకుపోగలవా? వీరే గాదు. నేను కదిలితే అరుణాచలానికి అరుణాచలమే బయలుదేరుతుంది. ఎట్లా తీసుకపోగలవు? నన్ను చూడు, ఈ జైలులో పెట్టారు. ఒకవేళ నీవు తీసుకపోయినా, మళ్లీ త్రోవలోనే పట్టుకువచ్చి ఎవరో ఏదో జైలులో పడేస్తారు. ఏంజేసే దమ్మ, ఎట్లా రాను చెప్పు? వీళ్లందరూ నన్ను వదులుతారా? ఏం? ఏమంటావు" అన్నారు భగవాన్. విద్య జవాబు చెప్పలేకపోయింది. అప్పటి నుంచీ "ఈ బిడ్డ నన్ను తమ వూరు రమ్మని పిలుస్తున్న"దని అందరితో చెప్పేవారు భగవాన్.

నిన్న పిల్లలిద్దరు ఊరికి వెడతారని విని తొమ్మిది ముప్పావుకు భగవాన్ బయటికి వెడుతూ వాకిలి పక్కనే నిలుచున్న విద్యను చూచి, చెయ్యి పట్టుకొని "ఏమమ్మా, నన్ను కూడా తీసుకుపోతావా? గట్టిగా కట్టి బండిలో వేసి తీసుకొని పో" అన్నారు. వెళ్లే ముందు శ్రీవారి ఫొటోలు తీసుకొనివెళ్లి చూపింది విద్య. ఫొటోలు చూడగానే "ఓహో, నన్ను తీసుకుపోతున్నావే? బాగా కట్టి పడెయ్యమ్మా బండిలో" అన్నారు భగవాన్. అందరూ ఆనందపరవశులైనవ్వారు. "భగవాన్ తాతయ్యను తీసుకుపోతున్నానులే" అంటూ ఒకటే గంతులు విద్య.

ఎవరు? ఎక్కడికి వెళ్లేది? జైలేది? కొండలే కదిలితే వానిని ఆపేదెట్లా? అన్నీ సమస్యలే!

- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

సజీవ సమాధులు

పుణ్య పురుషుల సమాధులు సదా సజీవములై ఉంటాయి. పవిత్ర మూర్తుల సమాధులు వారి ఆశ్రితుల మొర ఆలకిస్తాయి. వారి కోర్కెలను తీరుస్తాయి. సర్వదా వారికి అండదండగా ఉంటాయి. వారి చెంతకు వచ్చి మ్రొక్కిన వారికే కాక రాని వారికి కూడా తమ ఆశీర్వచనాలు అందిస్తాయి. సజీవులకు ఎటువంటి స్పందనలు ఉంటాయో ఆ సమాధులకు అటువంటి స్పందనలే ఉంటాయి.

ఒకనాటి రాత్రి జ్ఞానదేవుడు ఏకనాథ స్వామికి కలలో కనిపించి "నా సమాధి చెంత ఒక యశ్వత్థ వృక్షము వేరు. నా సమాధి చెంతకు వచ్చుచున్నది. అందుచేనీవు వచ్చి ఆ వృక్షమును సమూలంగా పెకిలించి వేరొక ప్రదేశమున నాటుము" అని చెప్పగా ఏకనాథుడు తనను జ్ఞానదేవుడు కరుణించాడని తలంచి వెంటనే అలందికి వెళ్లి సిద్ధేశ్వరస్వామిని దర్శించి, నమస్కరించి అటు పిమ్మట జ్ఞానదేవుని సమాధి చెంతకు వెళ్లి ఆ సమాధికి ప్రదక్షిణలు చేసి నమస్కరించి యోగాసనములో నున్న జ్ఞానదేవుని గాంచి సమాధికి అడ్డంకిగా నున్న అశ్వత్థ వృక్షమును సమూలంగా పెకిలించి మరియొక చోట ప్రతిష్ఠించి తాపీ మేస్త్రీలను పనివారలను రప్పించి సమాధిని పూర్వము వలె కట్టుటకు కావలసిన రాళ్లు, సున్నము, పనిముట్లను తెప్పించి పని ప్రారంభించెను. అక్కడ పనిచేయుచున్న వారికి అలందిలో నిత్యావసర వస్తువులు లభించలేదు. అది గ్రహించిన రుక్మిణి వల్లభుండు ఒక వర్తకుని వేషముతో సరుకులన్నిటితో ఒక దుకాణమును తెరిచి అక్కడ పనిచేయుచున్న వారితో "మీకు కావలసిన సరుకులను తీసుకోండి. మీ పని అంతయు పూర్తి అయిన తరువాత డబ్బులు చెల్లించవచ్చు" అని చెప్పి వారలకు కావలసిన సరుకులన్నింటిని వారు పనిచేయుచున్నంత కాలము అప్పుగా ఇచ్చెను. సమాధి పని పూర్తి అయిన తరువాత అందరు


మహనీయులు

పైఠణపురమునకు బయలుదేరగా వర్తకుని వేషములో నున్న పాండురంగడు సహితము తన సరుకులన్నిటిని ఒక బండిలో వేసుకొని వారితో పాటు బయలుదేరెను కాని మార్గమధ్యమున అతను అదృశ్యుడయ్యెను. అదంతయు రంగని కరుణయనని గ్రహించిరి.

సాయి సమాధి, షిరిడీ

షిరిడీలో ఉన్న సాయి సమాధి కూడా సజీవ సమాధియే. బాబా సమాధి చెందిన మరుక్షణము నుండియే తాను సదా సజీవుడేనని నిరూపిస్తున్నాడు. ఇక ముందు కూడా నిరూపిస్తాడు. సాయిభక్తులమైన మనము దానిని శంకించనవసరము లేదు.

అది 1936వ సంవత్సరము మార్చి రెండవవారం ఆ సంవత్సరము అప్పటికే



శీతాకాలము ముగిసి వేసవి ఉధృతి పెరిగెను. వాతావరణము పూర్తి వేడిగా నుండెను. ఉదయము నుంచే ఉష్ణోగ్రతలు అధికము కాజొచ్చెను. ఆనాడు కాకడ ఆరతి సమయమున మాధవరావు దేశ్ పాండే (శ్యామా) మరి కొంతమంది సమాధి మందిరములో నుండగా అందరు చూచుచుండగనే బాబా సమాధిపై ఉన్న ఉన్ని శాలువ దానంతట అదే కదలి దూరముగా పడినది. ఈ సమయంలో గాలి ఏ మాత్రము లేదు. తిరిగి శాలువను మరల కప్పగా మరల ఆ శాలువ దూరముగా జరిగినది. అక్కడున్న వారందరు పరీక్షించి చూడగా సమాధికి చెమటలు పట్టెను. అది గ్రహించిన వారు వెంటనే ఆ ఉన్ని శాలువను తీసివేసి నూలు శాలువాను కప్పిరి. ఆనాటి నుండి నేటి వరకు బాబాకు , బాబా సమాధికి వేసవికాలములో నూలు శాలువతోను, శీతాకాలమందు ఉన్ని శాలువతోను అలంకరించుచున్నారు.

సమాధికి చెమటలు పట్టాయంటే అది ప్రాణమున్న సమాధియే గదా.

- ముళ్ళపూడి పాండురంగ సాయినాథ్
మున్నలూరి బోస్

భగవద్గీత



అధ్యాయం 4

శ్లోకం 19:

యస్య సర్వే సమారంభాః
కామసంకల్పవర్జితాః।
జ్ఞానాగ్నిదగ్ధకర్మాణం
తమాహుః పండితం బుధాః॥

తాత్పర్యం

ఎవని ప్రతి కర్మ ఇంద్రియ తృప్తి ఆశించకుండా ఉంటుందో అతడు సంపూర్ణ జ్ఞానం కలిగినవాడు. కర్మ ఫలములన్ని జ్ఞానాగ్నిచే దగ్ధమై నవిగా అతడు ఋషులచే చెపబడ తాడు

భాష్యం: సంపూర్ణ జ్ఞానం కలి గినవాడే భగవత్సేవలో అనేక కార్యా లలో నిమగ్నుడైన భక్తుడిని, అర్థం చేసుకోగలుగుతాడు. ఆ విధంగా ఇంద్రియ భోగవాంఛలు లేకుండా కేవలం తాను భగవంతునికి దాసుడ ననే జ్ఞానముతో ఉండటం వలన అతని కర్మఫలములన్నీ భగవం తునికే చెందుట వల్ల, కర్మ భస్మమై నట్లే లెక్క. అతడే నిజమైన పండితుడు. అటువంటి సేవా భావం, జ్ఞానాభివృద్ధి అగ్నితో పోల్చబడినది. అది ఒక్క మారు రగిలితే కర్మఫలా లను సమూలంగా దహింప చేయ గలదు.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీ శ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యధాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...

శ్రీ కృష్ణస్తుతి



మత్సరమును పోద్రోలీ
కుత్సితమౌ మా మనముల కుళ్లును బాపీ
వాత్సల్యముతో చూచీ
వత్సల కాచే గోకుల వత్సవు కృష్ణా॥

నారాయణ! నారాయణ!
మారాముడవే! దీనార్తులకా పరివే!
వారక మోక్షము నిచ్చీ
నరులకు, పశులకు రక్షకుడవురా కృష్ణా॥

ఝుణ ఝుణ గజ్జెలు మ్రోయగ,
ఫణి ఫణి శిరసుల నూపగ ఫణితుల రాయా!
గణ గణ గంటలు మ్రోగగ
క్షణ క్షణ మానందమొందెదనురా కృష్ణా॥

రాగసుధారస పానమొ
సగు, నానందార్ణవానుభూతులనెన్నో,
నీ గానం నా గానం
కాగా నాకు ముక్తి నొసంగుము రా కృష్ణా॥

దేవకీ వసుదేవసుపుత్ర!
జీవాత్మవు పరమాత్మవు నీవే, నా
జీవేశ్వరుడవు నీవే!
దేవేశా కావలె నీ దీవన కృష్ణా॥

కుంజవిహారీ! హారీ!!
కుంజదళాక్షా! దయా కృపాళో! మా
పుంజవు నీవే! ఇదే మా
అంజలి గొనుమా మాకుసుమాంజలి కృష్ణా॥

- ఊటుకూరి సుహాసిని

కల్కి పలుకు



The secret is the law of Attraction

విశ్వంలో ఉన్న రహస్య ఆకర్షక న్యాయం

Sri Amma Bhagavan

వివరణ: కూనపురెడ్డి అరుణ్ కుమార్



ఇన్ ఆపరేటివ్ ఖాతా యాక్టివేట్ చేసుకోవచ్చు!

వినియోగదారులు వివిధ కారణాల రీత్యా చాలా బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి అన్నింటినీ ఉపయోగించే పరిస్థితి ఉండదు. కొన్నింటిలో ఖాతాలను అలాగే వదిలేస్తారు. ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం 2 సంవత్సరాల పాటు ఎలాంటి డెబిట్, క్రెడిట్ జరగకపోతే అటువంటి వాటిని ఇన్ ఆపరేటివ్ ఖాతాలుగా పరిగణిస్తారు. పదేళ్లపాటు ఇన్ఆపరేటివ్‌గా ఉన్న ఖాతాదారుల పేర్లు, చిరునామాలను వెబ్ సైట్లలో ఉంచాల్సిందిగా బ్యాంకులను ఆదేశించింది. ఇన్ ఆపరేటివ్ అకౌంట్ సంబంధించి ఆర్‌బిఐ నిబంధనలను ఇక్కడ తెలుసుకోండి.

ఇన్ ఆపరేటివ్ ఖాతాల విషయంలో ఆర్‌బిఐ మార్గదర్శకాలు



♦ నిర్ణీత కాలంలో లభించే వడ్డీ, బ్యాంకు రుసుములు కాకుండా ఖాతాల్లో సంవత్సరం పాటు ఏ ఇతర లావాదేవీలు జరగని వాటిపై వార్షిక సమీక్ష జరపాలి. ఖాతాలు ఇన్ఆపరేటివ్‌గా ఉన్న విషయాన్ని ఖాతాదారులకు రాత పూర్వకంగా తెలియజేస్తూ అందుకు గల కారణాలను అడిగి తెలుసుకోవాలి. ఏ కారణం చేతైనా ఖాతాదారుడు మరో కొత్త ఖాతాను నిర్వహిస్తుంటే అందులోకి పాత ఖాతాలోని నగదును బదిలీ చేయవచ్చు.

♦ ఖాతాదారుడికి సమాచారం అందించేందుకు ప్రయత్నించినప్పుడు ఆ వ్యక్తి గురించి ఎటువంటి వివరాలను రాబట్టకపోతే, సదరు వ్యక్తిని బ్యాంకుకు పరిచయం చేసిన వ్యక్తికి సమాచారం అందించాలి. ఫోన్, ఈ మెయిల్ ద్వారా అతడిని చేరుకునేందుకు ప్రయత్నించవచ్చు. ఇంకా వీలుకాకపోతే అతడు పనిచేసే సంస్థ ద్వారా వివరాలు తెలుసుకుని సమాచారం అందించే ప్రయత్నం చేయాలి.

వినియోగదారుడు ఖాతాను నిర్వహించకపోవుటకు గల కారణాలను తెలియపరిస్తే సంవత్సరంపాటు ఇన్ఆపరేటివ్‌గా ఉన్న ఖాతాలను గడువును విధిస్తూ మళ్లీ వాడాల్సిందిగా సూచించవచ్చు. ఇచ్చిన గడువు లోపు ఖాతాలను మళ్లీ పట్టించుకోకుండా వదిలేస్తే వాటిని ఇన్ఆపరేటివ్ ఖాతాలుగా ప్రకటించవచ్చు.

♦ ఖాతాదారులకు పంపించే ఉత్తరాలు చేరకుండా వెనక్కి వస్తుంటే, చట్టబద్ధవారసులు లేదా బంధువులు, స్నేహితుల ద్వారా ఖాతాదారుడి చిరునామా కోసం ప్రయత్నించాలి.

♦ రెండేళ్లపాటు పొదుపు ఖాతాలో ఖాతాదారుడి వైపు నుంచి లావాదేవీలు జరగకపోతే అలాంటి ఖాతాలను ఇన్ ఆపరేటివ్ అకౌంట్‌లుగా పరిగణించవచ్చు.

♦ ఇన్ ఆపరేటివ్ ఖాతాలుగా ప్రకటించే విషయంలో ఖాతాదారుడు చేసే డెబిట్, క్రెడి ట్‌లను పరిగణలోకి తీసుకుంటూ, బ్యాంకు జమ చేసే వడ్డీ, వసూలు చేసే సేవా రుసుములను లెక్కలోకి తీసుకోరు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ ఖాతాలో జమ అవడం, బీమా పాలసీ ప్రీమియం కోసం ఖాతాలో నుంచి డబ్బు డెబిట్ అవడం లాంటి థర్డ్ పార్టీ లావాదేవీలు సైతం ఖాతాదారుడు జరిపే లావాదేవీలు అవుతాయి.

♦ మోసపూరిత ఖాతాల విషయంలో బ్యాంకులు నిరంతర నిఘా ఉంచడం సాధారణం. ఈ నేపథ్యంలో ఖాతాలను వర్గీకరించేటప్పుడు ఖాతాదారునికి సమాచారం లేకుండా బ్యాంకులు వివరాలను రాబడుతూ ఉంటాయి. ఏ విధంగా చేసినా ఇన్ఆపరేటివ్ ఖాతాగా ప్రకటించినప్పటికీ సదరు ఖాతాదారులకు ఎటువంటి అసౌకర్యాన్ని కలుగజేయరాదు. అనుమానాస్పద లావాదేవీలపై, ఖాతాలపై బ్యాంకులు నిరంతరం పర్యవేక్షణ ఉంచడం వారి బాధ్యతలో భాగమే.

♦ భద్రతా చర్యలో భాగంగా ఒకవేళ ఖాతాను తాత్కాలికంగా ఇన్ ఆపరేటివ్‌గా ప్రకటించినా, ఖాతా వర్గీకరణ ఆధారంగా నియమ నిబంధనల మేరకు ఖాతా కొనసాగింపు వీలు ఉంటుంది. ఇలా కొనసాగించే ముందు లావాదేవీ/ ఖాతా కచ్చితత్వాన్ని, ఖాతాదారుడి వ్యక్తిగత గుర్తింపును నిర్ధారించి తదుపరి చర్యలు ఉంటాయి. ఈ విధమైన బ్యాంకు జాగ్రత్తల్లో భాగంగా ఖాతాదారుని ఇబ్బంది పెట్టకూడదు.

ఇన్ఆపరేటివ్ ఖాతాలను ఉపయోగించేలా చేసేందుకు ఎటువంటి రుసుములు విధించరాదు.

♦ పొదుపు ఖాతాను నిర్వహిస్తున్నా లేకపోయినా అందుకు తగిన వడ్డీని మాత్రం బ్యాంకు తప్పనిసరిగా జమ చేయాలి. ఫిక్స్‌డ్ డిపాజిట్ విషయంలో మెచ్యూరిటీ తీరిన తర్వాత పొదుపు ఖాతాకు వర్తించే వడ్డీ అమలవుతుంది.

♦ పదేళ్లకు పైబడిన అన్‌క్లెయిమ్‌డ్ డిపాజిట్లు, ఇన్ ఆపరేటివ్ ఖాతాలకు సంబంధించి, వారి పేరు, చిరునామాలను బ్యాంకులు తమ వెబ్‌సైట్లలో పొందుపరచాల్సిందిగా ఆర్ బీఐ సూచించింది. ఖాతా సంఖ్య, ఖాతారకం, బ్రాంచి వంటి వివరాలు వెబ్‌సైట్లో పెట్టరాదు.

ఆర్‌బిఐ సూచించిన మేరకు బ్యాంకులన్నీ వెబ్‌సైట్ హోంపేజిలో ఫైండ్/ సెర్చ్ ఆప్షన్‌తో కూడిన ఇన్ ఆపరేటివ్ ఖాతాల జాబితాను ఇవ్వాలి. పేరు టైప్ చేసి మనం చిరునామాతో కూడిన సమాచారాన్ని రాబట్టవచ్చు. తదుపరి ఖాతాను యాక్టివేట్ చేసుకోవాలనుకుంటే బ్యాంకు మాతృశాఖను సంప్రదించాలి. •



మన జీవనశైలి మారే కొద్దీ చిన్న చిన్న అనారోగ్యాలు రావడం సహజం. ఎక్కువ గంటలు కూర్చొని పనిచేసే వాతావరణం కారణంగా కొంతమందికి దీర్ఘకాలం నయం కాని జబ్బులు సైతం వస్తున్నాయి. గత ఐదు సంవత్సరాల్లో బీమా పరిశ్రమలో చాలా మార్పులు వచ్చాయి. ఆరోగ్య బీమా ప్రీమియంలు ఏటేటా పెరుగుతూ వస్తున్నాయి. అప్పట్లో చాలా కంపెనీలు మెడిక్లెయిం పాలసీలు ఇవ్వడం మొదలుపెట్టాయి. ప్రస్తుతానికి కూడా స్వల్ప ప్రీమియంల పెరుగుదలతో అవి కొనసాగుతున్నాయి.

ఆరోగ్య బీమా ప్రాధాన్యత

బాగా చదువుకుని ఉండి కూడా కొంతమంది ఆరోగ్య బీమా విషయంలో నిర్లక్ష్యం చూపుతుంటారు. అనారోగ్యం తర్వాత ఆసుపత్రి ఖర్చులు భరించేందుకు కష్టపడుతూ ఉండటం మనం అప్పుడప్పుడు చూస్తుంటాం. అన్నిఫీచర్లు ఉండే ఉత్తమ పాలసీ లేదనే కారణంతో ఆరోగ్య బీమా తీసుకోవడాన్ని కొంతమంది వాయిదా వేస్తుంటారు. యుక్త వయసులో పాలసీ తీసుకుంటే పెద్దగా ఆరోగ్య పరీక్షలు, ఎక్కువ ప్రీమియం బాధ లేకుండానే మంచి ఆరోగ్య బీమా పాలసీని కొనుగోలు చేయవచ్చు. గ్రూపు పాలసీ ఉంటే దాదాపుగా ఆరోగ్యబీమా పాలసీ అవసరం రాదు. ఒకవేళ మీకు, జీవిత భాగస్వామికి మాత్రమే ఆరోగ్య బీమా వర్తించేలా ఉంటే తల్లిదండ్రులకు సైతం వర్తించేలా ప్రత్యేక ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవడం సూచనీయం.

సాధారణ బీమాతో పాటు...

ప్రస్తుత పరిస్థితుల్లో మన ఆర్థిక ప్రణాళికలో సాధారణ బీమాతో పాటు ఆరోగ్య బీమాను కూడా తప్పక చేర్చాల్సిందే. ఆరోగ్య ఖర్చులు తీరును గమనిస్తే..



రాను రానూ దానికోసం మన సంపాదన ఎంత వెచ్చించాల్సి వస్తుందో అర్థమవుతుంది.

కొన్నేళ్లలో చిన్నపాటివి మినహాయిస్తే, తీవ్ర అనారోగ్యం వస్తే అయ్యే ఖర్చులకు ఖర్చు పెట్టడం సామాన్యుడికి చాలా కష్టమైపోతుంది. అందుకే ప్రతీ వ్యక్తికీ ఆరోగ్య బీమా పాలసీ తప్పనిసరి ఉండాల్సిందే. అంతేకాకుండా హాస్పిటల్ క్యాష్ కవర్ ఉంటే కలిగే ప్రయోజనాలేంటో తెలుసుకుందాం.

హాస్పిటల్ క్యాష్ పాలసీ

ప్రాథమిక ఆరోగ్య బీమా పథకం.. మీరు తీసుకున్న పాలసీ పరిమితికి లోబడి, మీరు ఆస్పత్రిలో చేరినప్పుడు వైద్య ఖర్చులను రీ ఎంబర్స్ చేస్తుంది. అయితే అప్పటికప్పుడు సంభవించే ఖర్చులను లేదా అనారోగ్యం సమయంలో ఉద్యోగం చేయలేని పరిస్థితి ఎదురయినప్పుడు ఆదాయాన్ని అందించలేకపోవచ్చు. ఇలాంటి సమయంలో హాస్పిటల్ క్యాష్ పాలసీలు పనికొస్తాయి.

కాలపరిమితి

మీకు ఆస్పత్రిలో ఉన్న రోజులకు అనుగుణంగా నిర్ణీత మొత్తాన్ని మీకు హాస్పిటల్ క్యాష్ పాలసీ అందిస్తుంది. సాధారణంగా ఈ పాలసీ ఏడాదికి 30 రోజులు నుంచి 90 రోజుల పరిమితితో ఉంటుంది. కొన్ని పాలసీలు ఏడాదికి 180 రోజులు వరకూ హాస్పిటలైజేషన్‌కు అనుమతిస్తాయి. ఈ పాలసీలను ఆయా వ్యక్తులు వ్యక్తిగతంగాను, లేదా తమ కుటుంబ సభ్యులతో కలిపి తీసుకోవచ్చు.

ఫీచర్లు

పాలసీలో ఉన్న సభ్యులు ఆస్పత్రి పాలైనప్పుడు మాత్రమే క్లెయిం చేసుకునేందుకు వీలుంటుంది. ఈ పథకాలలో విభిన్న కంపెనీలు వైవిధ్యమైన లక్షణాలను కలిగి ఉంటాయి. కొన్ని పాలసీలు ఎంతో ఎక్కువ ఆప్షన్లతో, సాధారణ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాల మాదిరిగా ఉంటాయి. ఎక్కువ ఫీచర్స్ ఎన్ని ఉంటే, అంత ఎక్కువగా ప్రీమియం ఉంటుందనే విషయం మరిచిపోకూడదు.

రీఎంబర్స్

పలు ప్రామాణిక ఆరోగ్య పథకాల్లో హాస్పిటల్ క్యాష్‌తో పాటు ఆరోగ్యం కుదుటపడే వరకు అదనపు కవరేజ్‌లు బిల్డ్ ఇన్‌గా ఉంటాయి. అయితే ఈ రీఎంబర్స్‌మెంట్స్ అన్నీ స్వల్పకాలానికే పరిమితం అయి ఉంటాయి. సాధారణ ఆరోగ్య బీమాపాలసీలో ఏడాదికి 10 రోజుల పరిమితి మాత్రమే ఉంటుంది. అయితే హాస్పిటల్ క్యాష్ పాలసీలో మాత్రం ఇది 30 రోజుల కంటే ఎక్కువగా ఉంటుంది.

అదనంగా అయ్యే ఖర్చులు, అనారోగ్యం సమయంలో వేతనం లభించే పరిస్థితి లేకపోవడం, మీరు ఆస్పత్రిలో ఉంటే కుటుంబం దీర్ఘకాలం పాటు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చేట్లయితే.. మీరు అదనంగా హాస్పిటల్ క్యాష్ పాలసీ తీసుకోవాల్సిన ఉంటుంది. హాస్పిటలైజేషన్ ఖర్చులకు సాధారణ ఆరోగ్య బీమా కొనుగోలు చేసిన తర్వాతే, ఈ హాస్పిటల్ క్యాష్ పాలసీ కొనుగోలు చేయాల్సిందిగా ఆర్థిక ప్రణాళిక నిపుణులు సూచిస్తుంటారు.


ఆన్‌లైన్‌లో పిఎఫ్ విత్‌డ్రా

పీఎఫ్ ఆన్‌లైన్‌లోనే విత్‌డ్రా లేదా క్లెయిం చేసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఇంతకుముందు పీఎఫ్ సొమ్మును క్లెయిం చేయాలంటే మీరు ఇంతకుముందు ఉద్యోగం చేసిన సంస్థ చుట్టూనో, పీఎఫ్ కార్యాలయం చుట్టూనో తిరగాల్సి ఉండేది. ఇప్పుడు మీరు ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే పీఎఫ్ ఆన్‌లైన్ క్లెయిం చేసుకునేందుకు ఈపీఎఫ్‌వో వీలు కల్పిస్తోంది. మీరు ఆన్‌లైన్లో అప్లయ్ చేసిన ఐదురోజుల్లో నేరుగా మీ బ్యాంకు ఖాతాలోకి పీఎఫ్ సొమ్ము వచ్చి పడుతుంది. అది ఎలా చేయాలో తెలుసుకుందాం.

పీఎఫ్ వెబ్‌సైట్ పిఎఫ్ ఆన్‌లైన్ క్లెయిం కోసం http://epfindia.gov.in/site_en/ వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. మీ ముందు పీఎఫ్ సంబంధిత వివరాలను కలిగిన వెబ్‌సైట్ ప్రత్యక్షమవుతుంది. ఈ వెబ్‌సట్ హోం పేజిలోనే కుడిపక్క ఆన్‌లైన్ క్లెయిం అనే ఆప్షన్ ఉంటుంది. మీరు దానిపైన క్లిక్ చేయాలి. క్లిక్ చేయగానే యూఏఎన్ సాయంతో లాగిన్ అయ్యే విండో వస్తుంది.

యుఏఎన్ లాగిన్

మీరు ఇది వరకే పీఎఫ్ ఖాతా కలిగి ఉంటే మీ యాజమాన్యం మీకు యూఏఎన్ నెంబర్ సదుపాయం కల్పిస్తుంది. యూఏఎన్ లాగిన్ అయిన తర్వాత ఐదు ఆప్షన్లు కనిపిస్తాయి. మేనేజ్ అనే దానిలో మీరు కేవైసీ వివరాలను అప్‌డేట్ చేయవచ్చు. అకౌంట్ అనే చోట పాస్



వర్డ్ మార్చుకోవచ్చు. ఆన్‌లైన్ సర్వీసు అనేది పీఎఫ్ సొమ్ము సంబంధించిన ముఖ్యమైన ఆప్షన్.

ఇలా చేయాలి

ఆన్‌లైన్ సర్వీసెస్ అప్షన్‌లో ఉండే క్లెయిం, ట్రాన్స్‌ఫర్ రిక్వెస్ట్, ట్రాక్ క్లెయిం స్టేటస్ ద్వారా మీకు కావాల్సిన పనిచేసుకోవచ్చు. క్లెయిం ఆప్షన్ నొక్కితే మీ ఆధార్ సంఖ్య కేవైసీ వివరాలతో పీఎఫ్ వెబ్‌సైట్ అప్‌డేట్ అయిందో లేదో తెలుస్తుంది. మీ కేవైసీ వివరాల వెరిఫికేషన్ పూర్తయితే మీరు ఆన్‌లైన్‌లో క్లెయిం నేరుగా చేసుకోవచ్చు.

కేవైసీ వివరాల అప్‌డేట్


కేవైసీ వివరాలు సరిగ్గా లేకపోతే వాటిని మీరు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సి వస్తుంది. దీన్ని కేవైసీ ప్రక్రియ పూర్తిచేయకుండా పీఎఫ్ ఆన్‌లైన్ క్లెయిం చేయడం కష్టం. హోం, వ్యూ తర్వాత మేనేజ్ అనే అప్షన్ ఉంటుంది. అక్కడ కాంటాక్ట్ డీటెయిల్స్, కేవైసీ అని ఉంటుంది. అక్కడ కేవైసీ పై క్లిక్ చేయండి.

వివరాలు


ఇక్కడ డాక్యుమెంట్ రకం, డాక్యుమెంట్ నెంబర్, మీ పేరు వంటి వివరాలను వెబ్‌సైట్ అడుగుతుంది. బ్యాంకు, పాన్, ఆధార్ వివరాలను ఇస్తే వెరిఫికేషన్ పూర్తవుతుంది. ఇక్కడ మీ ఆధార్‌లో ఉన్న పేరు, పుట్టిన తేదీ వెబ్‌సైట్లో ఉన్నవాటితో సరిపోలాలి. తర్వాత సేవ్ ఆప్షన్ నొక్కండి. ఒకసారి కేవైసీ ప్రక్రియ పూర్తయితే మళ్లీ ఆన్‌లైన్ సర్వీస్‌లోకి వెళ్లి క్లెయిం ఆప్షన్ నొక్కండి. దీన్ని పూర్తి చేస్తే 10 రోజుల్లోపు మీ ఖాతాలోకి పీఎఫ్ సొమ్ము జమ అవుతుంది.

సూక్ష్మ రుణాలు నిరుపేదలపాలిట వరం

చాలామందికి, సూక్ష్మ ఆర్థిక సహాయమంటే ఉత్పాదక కార్యకలాపాలను చేసుకోవడానికి లేదా వారి చిన్న వ్యాపారాలను పెంచుకోవడానికిగాను నిరుపేద కుటుంబాలకు అతి తక్కువరుణాలను ఇవ్వడం. 1980 సంవత్సరానికి మునుపే, అనగా ముప్పై సంవత్సరాల క్రితమే బంగ్లాదేశ్, బ్రెజిల్, మరికొన్ని ఇతర దేశాలలో ఈ సూక్ష్మ రుణాలను ప్రయోగాత్మకంగా చేసినప్పటికీ, 1980 దశకంలో ఊపందుకుంది. పేదవారికి సేవచేయడానికి, త్వరితగతిలో రాయితీ రుణాలను ఇవ్వడం నుండి, ప్రాధాన్యత, స్థానిక, నిలకడగల సంస్థల నిర్మాణాత్మకతను సాధించే లక్ష్యాత్మక రంగానికి మారింది. సూక్ష్మ రుణాలు ఇవ్వడానికి ప్రయివేట్ రంగం పూనుకుంది. కాబట్టి మితిమీరిన రాజకీయం లేకుండా అయ్యింది. దీనివల్ల అన్ని రకాలైన అభివృద్ధి కోసం ఇచ్చిన రుణాలన్నింటి కంటే ఎక్కువ పనితనం చూపించింది. సూక్ష్మ రుణాలు ఉత్పాదకతపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఆస్తులను ఏర్పరచుకునేందుకు, సంసారానికి అవసరమైన స్థిరమైన పరికరాలను కల్పించుకునేందుకు, ఆపదల నుంచి తమకు తాము భద్రత కల్పించుకునే సామర్థ్యం కల్పించడానికి, మిగతావారి వలెనే బీద ప్రజలకి వివిధ ఆర్థిక అవసరాలుంటాయి.



సూక్ష్మ రుణాలు నిరుపేదల పాలిట వరం



నితిన్ కెరీర్‌లో భారీ చిత్రం లై

నితిన్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం లై. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ హను రాఘవపూడి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ సుంకర నిర్మాతలు. లై (లవ్ ఇంటిలినెన్స్ ఎనిమిటి) చిత్రాన్ని ఈ నెల 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రీ రిలీజ్ వేడుకను శనివారం నిర్వహించనున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న లై చిత్రాన్ని ఈ నెల 11న రిలీజ్ చేస్తున్నాం. నితిన్ కెరీర్‌లో భారీ బడ్జెట్‌తో తీసిన చిత్రమిది. పెద్ద హిట్ అయి మా అందరికీ మంచి పేరు తెచ్చిపెడుతుందని ఆశిస్తున్నాం అన్నారు. ఈ చిత్రంలో మేఘా ఆకాష్ నాయికగా నటిస్తోంది.

ఎన్‌బీకే 102 ప్రారంభం



నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 102వ చిత్రం గురువారం మొదలైంది. దర్శకుడు కేఎస్ రవికుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సి. కళ్యాణ్ నిర్మాత. నయనతార నాయికగా నటిస్తున్నారు. ఈ చిత్ర షూటింగ్ ప్రారంభోత్సవం రామెజీ ఫిలింసిటీలో జరిగింది. దర్శకులు బోయపాటి శ్రీను, జాగర్లమూడి క్రిష్, బి గోపాల్, నిర్మాత అంబికా కృష్ణ తదితరులు అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తం సన్నివేశ చిత్రీకరణ అనంతరం దర్శకుడు కేఎస్ రవికుమార్ మాట్లాడుతూ...'బాలకృష్ణతో తొలి సారి సినిమా చేస్తున్నాను. గతంలో రెండు మూడు సార్లు అనుకున్నా, కుదరలేదు. దాదాపు 18 ఏళ్ల విరామం తర్వాత తెలుగులో సినిమాను తెరకెక్కిస్తున్నాను. షూటింగ్ చేయకముందే ఈ చిత్రం హిట్ అనే భావన కలుగుతోంది. నాతో మంచి టీం కుదిరింది. రత్నం చెప్పిన కథ, నాకూ బాలకృష్ణ కు బాగా నచ్చి సినిమా మొదలుపెట్టాం.' అన్నారు. నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ...'బాలకృష్ణ 101వ సినిమా మేమే చేయాలి. కానీ కుదరలేదు. ఈ సినిమా నిర్మిస్తుండటం సంతోషంగా ఉంది. కేఎస్ రవికుమార్ గొప్ప దర్శకుడు. దర్శకుడిగా ఆయనకు 95 శాతం విజయాలున్నాయి. బాలకృష్ణకేఎస్ రవికుమార్ కాంబినేషన్‌లో గుర్తుండిపోయే సినిమా చేయాలనిపించింది. చాలా కథలు విన్నాం. రత్నం చెప్పిన కథ అందరికీ బాగా నచ్చింది. మాస్, సెంటిమెంట్ అంశాలు కథలో ఉంటాయి. ఇవాళ్టి



నుంచి నెలాఖరు వరకు రామెజీ ఫిలింసిటీలో షూటింగ్ చేస్తాం. వచ్చే నెల 6 నుంచి తమిళనాడు కుంభకోణంలో చిత్రీకరణ ఉంటుంది. తర్వాత వైజాగ్, హైదరాబాద్‌లో షెడ్యూల్ చేస్తాం. పాటల రూపకల్పనతో సినిమాను పూర్తి చేయాలనుకుంటున్నాం. వచ్చే ఏడాది సంక్రాంతికి చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం.' అన్నారు. రచయిత రత్నం మాట్లాడుతూ...'బాలకృష్ణ పిలిచి మంచి కథ ఉంటే చెప్పమన్నారు. నేను అంతకుముందు చాలా కథలు చెప్పాను గానీ అవేమీ నచ్చలేదు. ఇరవై నిమిషాల్లో వినిపించిన ఈ కథ ఆయనకు బాగా నచ్చింది. సినిమా విజయవంతం అవుతుందనే నమ్మకం అందరిలోనూ ఉంది. అద్భుతమైన సినిమా అవుతుంది.' అన్నారు. మురళీ మోహన్, ప్రకాష్ రాజ్, అశుతోష్ రాణా, అథర్ చీమా, బ్రహ్మానందం, ప్రభాకర్, శివపార్వతి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం - చిరంతన్ భట్, సినిమాటోగ్రఫీ - రాంప్రసాద్, ఎడిటర్ - ప్రవీణ్ ఆంథోనీ, యాక్షన్ - అన్బరివు, ఆర్ట్ - పి. నారాయణరెడ్డి, కథ, మాటలు - రత్నం



ఎంతమంది అడిగారో...!

ప్రేమిస్తున్నామంటూ తన వెంటపడిన వాళ్ల జాబితా చాలానే ఉంటుందని గర్వంగా చెప్పుకుంటోంది ఢిల్లీ భామ రాశీ ఖన్నా. టాలీవుడ్‌లో పేరొచ్చాక వీళ్ల సంఖ్య మరింత పెరిగిందని చెబుతోంది. కళాశాలలో ఉన్నప్పటి నుంచే అబ్బాయిలను బాగా ఆకర్షించేది రాశీ. అయితే తాను అందరితో కలివిడిగా ఉండకపోవడం చూసి...విషయం చెప్పేందుకు భయపడేవాళ్లట. ప్రేమించడం ఇష్టం లేక తిరస్కరించలేదని...బంధాల్లో ఇరుక్కుంటే చదువు పాడవుతుందని ఆలోచించానని అంటోంది. ఇటీవల రాశీ ఖన్నా తనకొచ్చిన ప్రేమ ప్రతిపాదనలను గుర్తు చేసుకుంటూ సరదాగా మాట్లాడింది...'నా ధ్యాసంతా చదువుమీదే ఉండేది. ఎవరితోనూ కలివిడిగా ఉండేదాన్ని కాదు. దాంతో అబ్బాయిలు నాతో ఏదైనా చెప్పాలంటే భయపడేవారు. అయినా చాలా మంది ప్రేమిస్తున్నామంటూ చెప్పారు. నేను అందరికీ 'లేదనే' చెప్పాను. నేను తిరస్కరిస్తానని వాళ్లకీ తెలుసు. నేను పరిశ్రమకొచ్చి నాయికగా పేరు తెచ్చుకున్నాక ఈ ప్రేమికుల జాబితా ఇంకా పెరిగింది. వాళ్లకు అదే సమాధానం దొరికింది. ఈ కాలంలో బంధాలకు విలువ తగ్గిపోయింది. అయితే వాటికి నేను చాలా ప్రాధాన్యత ఇస్తాను. నాకున్న పేరు, అందం చూసి ఈ ప్రేమిస్తున్నామనే వాళ్లలో బంధం విలువ ఎంతమందికి తెలుసనేది నా అనుమానం.' అంటూ చెప్పింది. ఈ బొద్దుగుమ్మ ప్రస్తుతం రవితేజ సరసన 'టచ్ చేసి చూడు', ఎన్టీఆర్‌తో 'జై లవకుశ' లో నటిస్తోంది.

హాలీవుడ్ సినిమా కూడా చేస్తా - రానా



నేను నటించే ప్రతీ పాత్ర కొత్తగా ఉండాలని అనుకుంటా. నేనే రాజు..నేనే మంత్రి సినిమాలో చాలా సన్నగా, లావుగా కనిపిస్తా. కండలు కూడా తిరిగి ఉంటాయి. వెంకటేశ్‌గారి అభిమానులు నాకు తోడు ఉన్నారన్న ధైర్యంతోనే నేను అన్నీ చేస్తున్నా. ఇలాగే సహకరిస్తే హాలీవుడ్ సినిమా కూడా చేస్తా అని రానా అన్నారు. రానా, కాజల్‌అగర్వాల్ నాయకానాయికలుగా తేజ ధర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై తెరకెక్కుతున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. కాగా ఈ చిత్రంలో జోగేంద్ర పాత్రను రానా పోషించిన నేపథ్యంలో జోగేంద్ర యువగర్జన పేరుతో హైదరాబాద్‌లో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో సుఖీభవ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు రానా స్పందిస్తూ, సినిమాల పరంగా, అలాగే వ్యక్తిగతంగా నందమూరి తారక రామారావుగారిని నేను దేవుడులా భావిస్తాను. ఎన్టీఆర్, ఎంజీఆర్ ఫిలాసఫీలు ఈ చిత్రంలోని జోగేంద్ర పాత్రలో ఉంటాయి. అందుకే ఈ సినిమా చేశా. నాకెంతో భావోద్వేగంగా ఆకట్టుకున్న సినిమా ఇది. ఈ సినిమాను మా తాతగారు చూడలేకపోయారనే లోటు ఉంది. ఆయనతో సినిమా చేయలేకపోయామనే బాధ ఉండేది. పై నుంచి మాకు ఆయన ఆశీర్వచనాలు లభిస్తున్నాయి అని అన్నారు.

దర్శకుడు తేజ మాట్లాడుతూ, రానాకు కథ చెప్పగానే ఆయనకు నచ్చిందని ఈ సినిమా చేశాం. కొత్తవాళ్లతో సినిమాలు చేసి బోర్ కొట్టిందని పాతవాళ్లతో ఈ సినిమా తీశా. రానా సరసన పొడవుగా ఉన్న అమ్మాయి కావాలని కాజల్‌ను, స్టైలిష్ పాత్ర కోసం కేథరిన్‌ను ఎంపికచేశాం అని చెప్పారు. కాజల్ మాట్లాడుతూ, ఈ చిత్రం నాకెంతో ప్రత్యేకమైంది. జోగేందర్ పాత్రలోనే రానా గుర్తుండిపోతారు. సినిమాను ఎలా చూడాలో..ఎలా ప్రేమించాలో తేజ దగ్గర నేర్చుకున్నా అని పేర్కొనగా, ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉందని, ఇందులో దేవికారాణి అనే పాత్రలో కనిపిస్తానని మరో కథానాయిక కేథరిన్ చెప్పారు.

నిర్మాతలలో ఒకరైన డి.సురేష్‌బాబు మాట్లాడుతూ, పాత్ర చిత్రణతో కూడుకున్న పొలిటికల్ డ్రామా ఇది. రానా, కాజల్, కేథరిన్‌లు తమ తమ పాత్రల్లో ఎంతగానో ఒదిగిపోయారు. వాళ్లందరి చేత తేజ చాలా బాగా చేయించారు అని అన్నారు.

మరో నిర్మాత భరత్‌చౌదరి, ఇంకో నిర్మాత కిరణ్‌లు మాట్లాడుతూ, ఒక చిత్రం కోసం చిత్రబృందం ఇంత కష్టపడుతుందా అని ఈ చిత్రం ద్వారా అనిపించిందని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పరుచూరి బ్రదర్స్, తనికెళ్ళ భరణి, జయప్రకాష్‌రెడ్డి, నవదీప్, శివాజీరాజా, లక్ష్మీభూపాల్ తదితరులు పాల్గొన్నారు.



గోపీచంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో శ్రీ బాలాజీ సినీ మీడియా నిర్మించిన 'గౌతమ్‌నందా' ఇటీవలే తెరపైకి వచ్చింది. ఈ సినిమాకు ప్రేక్షకాదరణ బాగుండటంతో చిత్ర యూనిట్ విజయోత్సవం జరుపుకుంది. హైదరాబాద్ సినీమాక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుడు సంపత్‌నంది, హీరో గోపీచంద్, నాయిక క్యాథరీన్ ట్రెసా, నిర్మాత భగవాన్, పుల్లారావు పాల్గొన్నారు.

సంతోషం అవార్డుల కర్టెన్ రైజర్

సంతోషం సినీ అవార్డుల వేడుక ఈ నెల 12న హైదరాబాద్‌లో జరగనుంది. కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మా అధ్యక్షుడు శివాజీరాజా, నటి రెజీనా అవార్డు లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కె.ఎస్.రామారావు, హీరో ఆది, హెబ్బాపటేల్, ఏడిద శ్రీరామ్, ఏడిద రాజా, లక్ష్మి కొండేటి, మహేష్ కొండేటి తదితరులు పాల్గొన్నారు. శివాజీరాజా మాట్లాడుతూ సంతోషం అవార్డులు విజయవంతంగా 15 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. ఈ సక్సెస్‌కు కారణం సురేష్ కొండేటి అన్నారు. వరుసగా అవార్డుల వేడుక నిర్వహించడం అభినందనీయం అని నటి రెజీనా పేర్కొన్నారు. చిత్ర పరిశ్రమ అందించిన ప్రోత్సాహంతోనే దిగ్విజ యంగా అవార్డుల వేడుకలను నిర్వహిస్తున్నట్టు సురేష్ కొండేటి చెప్పారు. ఈ సారి మరింత వైభవం గా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇంకా పాత్రికేయులు వినాయకరావు, ప్రభు కూడా మాట్లాడారు.

